# 1. జా ద ల నా స

**2రాజులు 13:23.** "యెహోవా వారిమీద జాలిపడి వారియందు దయయుంచి, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో తాను చేసియున్న నిబంధననుబట్టి వారియందు లక్ష్యముంచి వారిని నాశనము చేయనొల్లక యిప్పటికిని తమ సముఖములోనుండి వారిని వెళ్లగొట్టక యుండెను."

నేటిదిన వాక్యాహారము కొరకు వచ్చిన వాక్యాసక్తిపరులారా! వాక్యములోని ఆయన జాలి, దయారసములు మీకు అందునుగాక. ఆమేన్. ఈ వచనములోని కొన్ని ముఖ్యమైన పదములను వివరించుదును. ముందుగా ఆ ముఖ్య పదముల మొదటి అక్షరములతో రూపొందించబడిన ఒక మాటను మీకు పరిచయము చేయుదును. జాగ్రత్తగా వినండి:

**జా, ద, ల, నా, స:–** అబ్రాహాము, యాకోబు, ఇస్సాకులను బట్టి దేవుడు ఇశ్రాయేలీయులను కాపాడెను. దేవదాసు అయ్యగార్నిబట్టి క్రీస్తుప్రభువు బైబిలుమిషను వారిని కాపాడుచున్నాడు. అరామీయుల రాజు అయిన హజాయేలు దమస్కులో నుండి ఇశ్రాయేలీయుల ముఖ్యపట్టణమైన షోమ్రోను పై దండెత్తుచున్నప్పుడు 1) జన నాశనము 2) పంట నాశనము చేసెడివాడు. ఈ విధములైన శ్రమలు వచ్చుచునే ఉండును. యెహోయాహాజు ఇశ్రాయేలీయులకు రాజుగానుండిన కాలమంతయు హజాయేలు ఈ రీతిగా బాధించుచుండెను. ఇశ్రాయేలు సంఘమున జరిగిన విషయములను గురించి ఈ వాక్యము వ్రాయబడెను.

**1. జాలి:–** యెహోయాహాజు కాలములో ఇశ్రాయేలీయులు అరామీయుల వలన శ్రమనొందిరి. యెహోయాహాజుకు పూర్వము కూడ వారు శ్రమనొందిరి. ఈ శ్రమ అరామీయుల వలన కలిగినది.

అలాగే క్రైస్తవులమైన మనకును శ్రమలు కలుగుచున్నవి. మన పూర్వికులైన క్రైస్తవులకుకూడ శ్రమలు కలిగినవి. ఈ వాక్యమునుబట్టి మనకు ఆదరణ. ఏలాగనగా, 'శ్రమలు మాకేకాదు మా పూర్వికులకుకూడా కలిగినవి' అని తలంచవలెను. అపోస్తులుల కాలములో నీరో చక్రవర్తి కాలములోను, ఆ తరువాతకూడా ఆది సంఘ క్రైస్తవులు బహు శ్రమలుపొందిరి. శ్రమలయందు చూపు ప్రేమను "జాలి" అందురు. మన పూర్వికులకు దేవుడు 5 విధములుగా వారి శ్రమలలో ఆదరణ కలుగజేసెను. కాబట్టి మనకుకూడా అట్టి ఆదరణలను అనుగ్రహించెను.

1) జాలి అనగా నేమి 2) దయ అనగానేమి? ఒకరు బాధపడుచున్నప్పుడు చూపించు ప్రేమను **'జాలి'** అందురు. ఇశ్రాయేలీయులు బాధపడుచున్నప్పుడెల్లా దేవుడు వారికి జాలి చూపించెను. ఆ విధముగానే మనకు శరీర బాధ వచ్చినను, ఇబ్బంది కలిగినను క్రీస్తు ప్రభువు మనమీద జాలి పడుచున్నాడని జ్ఞాపకముంచు కొనవలెను. ఆదరణ పొందవలెను. ఇది దేవునియొక్క ప్రేమ లక్షణము జాలి, దేవుని ప్రేమ లక్షణములలో ఒక భాగము.

**2. దయ:-** దేవునిప్రేమ రెండు భాగములు అనగా రెండు రకములు. *(1) ప్రత్యేకమైన ప్రేమ, (2) సామాన్య ప్రేమ.* పాపులకు, భక్తులకు, మానవులందరికి దేవుడు చూపించునది సామాన్యప్రేమ. ఇదియే దయ. భక్తుల పొలములలోను, పాపాత్ముల పొలములలోను, వర్షమము కురియుట సూర్యుని వేడిమి కలుగుట; పాపాత్ములకు భక్తులకు ఒకే రీతిగా ఉన్నది. ఇది సామాన్యప్రేమ. అయితే దేవుని ప్రత్యేక ప్రేమకు రెండు కారణములున్నవి.

1) భక్తులు శ్రమ పడుచున్నారు. అయితే ఇశ్రాయేలీయులు భక్తులు కాకపోయినను, వారు భక్తుల పిల్లలు. గనుక వారు దేవుని ఎదిరించేవారైనను, వారి తండ్రులు ఆయన ఏర్పాటు భక్తులు కాబట్టి వారికి దేవునియొక్క ప్రత్యేకమైన ప్రేమ దొరుకుచున్నది.

ఉదా:- ఒక బడిలో పిల్లవాడు చదువుచున్నాడు. వాడు ఉపాధ్యాయునియొక్క స్నేహితుని కుమారుడు. ఈ పిల్లవాని తండ్రి చనిపోయెను. పిల్లవాడు విద్యయందు శ్రద్ధ చూపనప్పటికిని వాని తండ్రిమీది గౌరవముచేత, ఉపాధ్యాయుడు పిల్లవానియందు బహుశ్రద్ధ వహించును. అలాగుననే దేవుడు అబ్రాహాముతో, ఇస్సాకుతో యాకోబుతో నిబంధన చేసెను. అందువలననే ఇశ్రాయేలీయులు ఎదిరించువారైనను దేవుడు వారియెడల ప్రత్యేకమైన ప్రేమ కనపర్చెను. ఆ ముగ్గురితోను దేవుడు చేసిన నిబంధనలు, కృప తోడైయున్నది. గనుక ఈ నిబంధనలు తరతరముల వరకు నిలిచిపోయినవి. ఇశ్రాయేలీయులు ఎంత తప్పిపోయినను, ఈ నిబంధన అనగా దేవునికృప అబ్రాహాము మొదలుకొని బాప్తిస్మమిచ్చు యోహానువరకు ఇశ్రాయేలీయుల యెడల ఉన్నది. అలాగుననే దేవుడు యం. దేవదాసు అయ్యగారికి గాలిలో నిబంధన చేసెను. ఒక యువరాజువలె, సైన్యాధిపతివలె బయటికి రావలసినది అనిచెప్పిరి. నేను వృద్ధుడను, అనారోగ్యుడను, విద్యలేనివాడను ధనము లేనివాడను అన్నప్పటికిని అబ్రాహాముద్వారా యూదులకు ఏర్పాటు చేసినట్లుగా, అయ్యగారి ద్వారా ప్రభువు బైబిలుమిషనును ఏర్పాటు చేసుకొన్నాడు. అయ్యగారినిబట్టి మనందరకు జాలి చూపును. పాతనిబంధన కాలమునకును, క్రొత్త నిబంధనకును జాలి, అలాగే ఇతర

క్రైస్తవులకును, బైబిలుమిషను వారికిని దయ. దయకును, జాలికిని బేధము చూపించు కథ ఒకటి బైబిలు ఉన్నది.

యోసేపు ఐగుప్తులో ఉన్నప్పుడు అన్నదమ్ములు ధాన్యమునకు వచ్చిరి. అందరికి ఇచ్చిన దానికంటె బెన్యామీనుకెక్కువ ఇచ్చెను. బెన్యామీను యెడల యోసేపు ఎక్కువ, ప్రత్యేకమైన ప్రేమ చూపించెను. ఈ దృష్టాంతము అవిశ్వాసుల యెడల దేవుడు చూపించు సామాన్య, ప్రత్యేక ప్రేమలకు గుర్తుగా ఉన్నది. దీనినిబట్టి దేవుడు ఇశ్రాయేలీయులను లక్ష్యపెట్టెను,, గౌరవించెను. ఇశ్రాయేలీయులు నిబంధనను బట్టి నడిచినారా? లేదు. అయిననూ ఆయన ప్రత్యేక ప్రేమనువారు అందుకొనిరి. ఉదా:- ఒక పిల్లవాడు తల్లిచెప్పిన మాట వినకపోయిన యెడల తల్లికి వానియందు లక్ష్యముండదు. అయితే చేయను అనిచెప్పిన పిల్లవాడా తల్లిమాట విని మనసు మార్చుకొనివెళ్ళి, త్రోవలో వర్షముచేత ఆటంకపర్చబడి తిరిగివచ్చివేయగా, తల్లిచెప్పిన పనిచేయక పోయినను నెరవేర్చుటకు ప్రయత్నించినవాడాయెను. కాబట్టి తల్లికి పిల్లవానియందు గౌరవముండును. అలాగుననే ఇశ్రాయేలీయుల నిబంధన ప్రకారము నడువకపోయినను నిబంధన తీసికొనిరి. గనుక దేవుడు వారిని లక్ష్యపెట్టెను. ఇశ్రాయేలీయులు మోషేద్వారా ఇవ్వబడిన నిబంధనను అందుకొనిరి. ఇట్లు అందుకొనినందుననే దేవునికి గొప్ప ఆనందము. అలాగుననే బైబిలు మిషను వారు యం. దేవదాసు అయ్యగారిద్వారా ఇవ్వబడిన నిబంధన నమ్మివచ్చిరి. గనుక క్రీస్తుకు గొప్ప ఆనందము. క్రైస్తవ సంఘములో అనగా క్రీస్తుప్రభువును నమ్మివచ్చిన వారిలో చాలామంది నామక క్రైస్తవులున్నారు. వారు ఒప్పుదల క్రైస్తవులు. అయితే, విశ్వాస క్రైస్తవులు నిబంధన ప్రకారము చేయుదురు. ఈ రెండు తరగతులయెడల ప్రభువు జాలి చూపించును.

దేవునియొక్క ప్రత్యేక జాలి కొంతమందికి చూపించును. పరిశుద్ధాత్మ బాప్తిస్మముపొంది, రెండవరాకడ నమ్మువారు మాత్రమే ప్రత్యేక ప్రేమ పొందుదురు. పెండ్లికుమార్తె సంఘములోనున్న వారికి మాత్రమే ప్రత్యేక నిబంధన. తక్కినవారికి వేరే నిబంధనలున్నవి. అబ్రాహాము నిబంధన: ఆది. 17:19, ఇస్సాకు నిబంధన: ఆది. 17:21 యాకోబు నిబంధన: ఆది. 28:13-14, ఇశ్రాయేలీయులు ఈ నిబంధన తోసివేసిరి. 1రాజు. 18:18. దేవుడు తన నిబంధనను ఎప్పుడు కొట్టివేయడు. అయితే మనుష్యుడు కొట్టివేయును ఈ దినములందు విశ్వాసులు ఎక్కువగా వచ్చుచున్నారు. అయితే కడవరకు జరుపువారే నిబంధన జరుపుదురు. 1). జాలి అనగా విమోచన ప్రేమ, 2) దయ, అనగా సృష్టికర్తయొక్క ప్రేమ 3) లక్ష్యముంచెను అనగా నిబంధన ప్రేమ 4) నాశనముచేయలేదు అనగా జనాంగ ప్రేమ 5) సన్నిధినుండి త్రోసివేయలేదు = రక్షణ ప్రేమ. నాశనము చేయలేదు. ఎందుకనగా ఈ జనాంగము నుండి క్రీస్తు ప్రభువు పుట్టవలసియుండెను. ఈ దినములయందు సంఘములో నుండి పెండ్లికుమార్తె రావలసి ఉన్నది. కాబట్టి నాశనము చేయలేదు. ఇది జనాంగముమీది ప్రేమ. ఇన్ని ప్రేమలు ఆయన తన ఏర్పాటు జనులయెడల చూపించెను. నేడు మనకును ఆ ప్రేమలన్నిటిని చూపించుచున్నాడు. గనుక అది ఆయన సంకల్పన ప్రేమ. ఇట్టి ప్రేమలతో దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్. [1]

1. 1945వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో చేసిన ప్రసంగము.

# 2. శక్తికిమించిన శక్తి - ప్రార్థనాశక్తి

**1రాజులు 18:36-39; మత్త. 6:5-15; యాకో. 5:13-18.**

దీవెన:- దైవప్రార్థనాశక్తి ప్రియులారా! నేటిదిన వర్తమానము ద్వారా ఆ పరమదేవుని ప్రార్థనాదీక్ష మరియు పట్టుదలగల ప్రార్థనలు చేయు దీవెన మీకు అందునుగాక! ఆమేన్.

ప్రార్థన లోకములోనున్న శక్తులన్నిటికన్న గొప్పశక్తియను మాట ఒక పాదిరిగార్కి పిడుగులాంటి వార్తయై ఈవార్త నిజమైతే ప్రపంచములో నిదియే గొప్ప సత్యమగును. మనలో చాలినంతమంది చాలినంత తరుచుగా ప్రార్థన చేసిన యెడల లోకములోని ప్రతి ఒక్కరును దేవునివైపు చూచి ఆయన మాట వినునట్లు చేయగలము. ప్రపంచమును మార్చి వేయగలము అన్నాడు. ఆయన చెప్పినది సత్యము ప్రార్థన లోకములో నున్న అనంతశక్తియే. ప్రార్థన శక్తివంతమైనదని లక్షలాదిసార్లు నిరూపింపబడినది. సరిపడనంతమంది చాలినంత ప్రార్థనచేస్తే లోకమును రక్షించగలము. చాలినంత ప్రార్థనచేస్తే పైమాటలు చెప్పిన పాదిరిగారు అధిక ఉత్సాహముతో క్రైస్తవులు దినమునకొక్క నిమిషము ప్రార్థనచేస్తే చాలు. లోకమును రక్షించగలరు అన్నాడు. అంతమాత్రమైతే చాలదనియే నా అభిప్రాయము జీవరాసులను కాపాడుటకు సూర్యుడు దినములో ఒక్క నిమిషము ప్రకాశించి ఊరకుంటే చాలదు. జీవము సూర్యకిరణములమీద ఆధారపడియున్నది. కోట్లకొలది కిరణములలలో ఒక్క కిరణము జీవనమును సృష్టిచేయలేదు. కోట్లకొలది పడు వర్షపు చినుకులలో ఒక్కటిమాత్రమే చెట్లువేరు వద్దకు పోలేదు. కోట్లకొలదిగా ఉన్న విత్తనములలో ఒక్కటి మాత్రమే చెట్టుగా అగుచున్నదా?

1. కింబర్లీ వజ్ర గనులలో కోట్లకొలది పారలమన్నులో ఒక పార మన్నుమాత్రమే ఒక వజ్రమును కనుగొనలేదు. కాంగిర్ ఈల్

అనే చేప పెట్టుగుడ్లన్నియు పొదగబడిన తరువాత బయలుదేరు ఈల్ చేపలన్నిటికి సరిగా ఆహారము దొరికి జీవించగలిగిన యెడల ఇక్కడ నుండి సూర్యునివరకున్న ఈ మహావిశాలత యంతటిని రెండేడ్లలో నింపివేయగలవు అట, సృష్టి పద్ధతి అంతయు అంత పుష్కలమైనది. మనము వ్రాసే వానిలో చెప్పేవానిలో బహుకొద్ది మాటలే ప్రజలకు ఉత్సాహము కలిగించి మంచి పనులు చేయుటకు ప్రేరేపించును. గనుక మనము ప్రార్థన ఎవరినిగూర్చి చేయుచున్నామో వారికి మన ప్రార్థనలు ప్రేరేపించినవిగా లేవని తోచినయెడల మనప్రార్థనలు ఎక్కడో ఒకచోట ఎవరికో ఒకరికి అందవచ్చునని నమ్మియుంటే చాలును. అంతకుమించి మన కవసరములేదు. ఇది మట్టుకు సత్యము ఏదనగా యేసుప్రభువు చెప్పినట్లు మనము విసుగక నిత్యము ప్రార్థన చేసినయెడల మనము లోకమును మార్పుపొందించగలము గాని అనుమానముతో కూడిన నిర్వీర్య ప్రార్థనలు నీరస ఫలములనే కనబరచును. దినమునకు ఒక్క నిమిషము మనలను రక్షింపనేరదు.

**2. కుంటివారు నడుతురు:-** ఒక భావముతో కొందరు ప్రార్థించగా జబ్బులు ఆశ్చర్యకరముగా భాగవుట తరుచుగా జరుగుచున్నవి. వెన్నెముకలో పుట్టిన ఒక విధమగు కురుపుతో ఏడేండ్లు అమితమైన బాధ అనుభవించుచుండిన ఒకామె గత రెండేండ్లు నడువలేకపోయినది. సహింపనలవికాని బాధపడుచుండెను. మేము ఆసుపత్రివారు సాధ్యమైనంతవరకు సహాయము చేయుదుముగాని సంపూర్ణ స్వస్థత నియ్యలేము. ఇష్టముంటే ఫలాన తేదిని రావచ్చునని చెప్పిరి. ఈమె తన భర్తతో కారుమీద వెళ్లను. మేము ఆసుపత్రికి వెళ్లుటకు ఇంకా రెండు వారములున్నందున, దానికిముందుగా ఒక ప్రార్థన సమాజమునకు వారు వెళ్లిరి. వారక్కడ చేరగానే ఆమె వ్యాధిని గురించి గుంపులుగను, ఒక్కొక్కరుగాను ఆ సమాజమువారు ప్రార్థనచేయ మొదలుపెట్టిరి.

ఆదివారము ఉదయము గ్లెన్‌క్లార్క్ అను ఆయన యోబుయొక్క శ్రమలు అను అంశము మీద ప్రసంగించెదనని ప్రకటించెను. కురుపు బాధతో ఉన్న ఈమెకు యోబుగ్రంథము ప్రియమైనది, గనుక ఆ ప్రసంగము వినగలుగునట్లు బాధతగ్గినయెడల బాగుండునని ఆశతో ప్రార్థించి కూటము కూర్చుండెను. ఆయన బోధించుచు చివరి బాగములో (13:15) ఇదిగో ఆయన నన్ను చూపినను నేను ఆయన కొరకు కనిపెట్టుచున్నాను అను మాటలు చెప్పుచుండగా తటాలున ఒకచేయి ఆమె తలను నెమ్మదిగా సర్దుచు వెన్నెముకవరకు జరుగుచున్నట్లు ఆమె తెలుసుకొనెను. క్రమముగా బాధ కలిగించుచున్న వ్రణమువద్దకు చెయ్యిరాగానే వెంటనే ఆ భయంకరబాధ మాయమయ్యెను. సంపూర్ణ స్థితికలిగెను. పూర్ణ స్వస్థత గలదై ఆమె బయటకు స్వయముగా నడిచి వెళ్ళగల్గెను. కొన్ని గంటల తరువాత ఆమె రోడ్డుపై పరుగెత్తుచుండెను. ప్రార్థించు వారి అందరి *భావములు ఒక్కటైనప్పుడు ఈలాగు కలుగుట సాధారణమని* తెలియుచున్నది. దీనినిబట్టి ఒక పెద్ద సమూహము ఒకే భావముతో ఒకే భావముతో ప్రార్థింపగలిగినయెడల ఆ ప్రార్థన అధిక శక్తివంతమైనదిగా నుండుననియు, ఒక్కడు చేయునది అల్పశక్తివంతమైనదిగా నుండుననియు స్పష్టమగుచున్నది. ఆరాధనలలో వినుచున్న వారందరును గట్టిగా ప్రార్థించునట్లు మనము ప్రార్థించగా వెంటనే ఆశ్చర్యకరముగా బలముగా సంతోషకరముగా అన్నివైపులనుండి ప్రార్థన చేయువారే కనబడుదురు. సంఘమంతయు పట్టుదలతో, ఐక్యభావముతో ప్రార్థించునపుడు అదృశ్యహస్తమొకటి మనలనెత్తుచున్నదా? అనునట్లుండును. మనకండ్లవెంట నీరు ఉబుకును. మనము వ్రాసికొనిన ప్రసంగములకంటె ప్రశస్త తలంపులు కలిగి ఆవేశముతో బోధింప గలుగుదుము. సాధారణ సంగతి ప్రకాశించుచున్న వర్తమానమువలె నుండును.

**3. చదువునపుడు ప్రార్థించుము:-** వార్తాపత్రికలు చదువునపుడు మీలో కొందరు ప్రపంచ నాయకులపేర్లు కనబడినపుడు

ఒక నిమిషకాలమాగి ప్రభువా! ఈయన నీ కొరకు ఆకలిగొనునట్లు అనుగ్రహించుము ఆమేన్ అని అనుచున్నారు లేదా ఆ నాయకుని పేరును యేసు అను అనంత శక్తిగల పేరుతో కలిపి పలుకుదుము. ఈలాగు చేయుటవల్ల పత్రికను చదువుటలో ఆలస్యముండదుగాని యేసుతో ఆ నాయకుని జతపర్చి ఒక సెకండుమాత్రముంచగలము. ***ఇది అలవాటు చేసికొన్నయెడల కంటికగుపడని శతసహస్ర దీవెనల లోకముపైకి విరజిమ్ము వారమగుదుము.***

**4. డాక్టరు ఫ్రాంక్‌లాబాక్:-** డా॥ ఫ్రాంక్ లాబాక్ వయోజన విద్యావిషయమున పండిత ప్రముఖులలోని అగ్రగణ్యుడు. ఉత్తర అమెరికా విదేశీ మిషనుల కాన్ఫరెన్స్‌యొక్క ప్రపంచ విద్యాసారస్వతోప సభపక్షముగా ఈయన లోకమందలి ప్రతి మిషను ప్రాంతమును దర్శించి తన వయోజన విద్యాపద్ధతిని ప్రతిచోటను ప్రవేశపెట్టెను. ఆ సందర్భమున మన భారత ప్రభుత్వమునకుగూడా ఈయనచేయూత నొసంగెను.

**5. చిరునవ్వు:-** మనమనుకొనునట్లు విషయములు జరుగకున్న చివరకు స్నేహితులు నమ్మకద్రోహులైనను నీకు మిగులనదేమి? చిరునవ్వు నవ్వి ముందుకు నడువుము. నీ జీవితకాలమంత అడ్డుబాటలతో నిండియున్న అనారోగ్యము తొందరలు కలుగును. మనుష్యులు గేలిచేసినయెడల చిరునవ్వునవ్వి ముందంజ వేయుము.

నీ పూర్ణశక్తితో పనిచేసిన, దానిలో నీవు తలంచినట్లు జయము పొందనియెడల, నీకు సహాయము చేయవలసినవారు సహాయము చేయనియెడల, చిరునవ్వునవ్వి ముందుకు నడువుము. జీవితములో మార్పు కలుగవచ్చును. ఈ పరీక్ష ముందు నీకు అవసరము. అప్పుడే విశ్రాంతి కలిగి ఎక్కువ సంతోషింపగలవు. గనుక చిరునవ్వు నవ్వి ముందుకు పొమ్ము. ఒక దినము కూర్చుని నిట్టూర్పు విడువనవసరము లేదు. చిరునవ్వు నవ్వి ముందుకు పొమ్ము.

**6. సోమరితనము:-** సోమరితనము దేవునియెడల చేసిన పాపము. ఇతరులు సంపాదించిన ధనముమీద జీవింపక దేవుని ఉద్దేశప్రకారము మానవుడు చెమటకార్చి ఎవరి భోజనమును వారు సంపాదించవలెను. ఏ పనిచేయక సోమరిగా నుండినయెడల, దేవుని ఇష్టమునకు వ్యతిరేకముగా పోయినట్లు దేహము, మనస్సు, ఆత్మ, మరవలె ఉపయోగించని యెడల అది పాడవును. గనుక ఆరోగ్యకరమైన దేహము కొరకు మానవుడు పనిచేయవలెను. సోమరితనమువలన దుఃఖము కలుగును. క్రియలు, తప్పుదారిని పోవును. దుఃఖమునకు సోమరితనము కారణము. కష్టపడి పనిచేయువారిని త్రోసిపుచ్చి మంచి ఆరోగ్యము, బలము, వరములున్నను ఇతరులు సంపాదించిన ధనము మీద ఆధారపడియుండుట పాపము. సాంఘికముగా, శ్రామికంగా రాజకీయంగా, పెరుగుదలను సోమరితనము అడ్డుచేయును. కష్టపడి పనిచేయువారికి సోమరిగా ఉన్నవారికి మధ్య మంచి స్నేహ సంబంధమైనదేదియు వృద్ధిపొందదు. స్వతంత్రత పోరాటములోగాని స్వతంత్రత నిలుపుదలలోగాని సోమరితనమునకు స్థానములేదు.

ఇండియాకు స్వాతంత్రము సిద్ధించినది కాని, జీవితమును సంతోషదాయకముగా చేయునవన్ని స్వాతంత్రముతోపాటురావు. బ్రిటీషు అధికారమునుంచి మాత్రము విడుదలైనది. ఇంకా సాంఘికముగా, శ్రామికంగా మనదేశము స్వాతంత్రత సంపాదించలేదు. ఇండియా ప్రజలందరు సోమరితనముమాని దేశోభ్యుదయమునకై పనిచేసి సోమరి తనము వదలి వేయవలెను. సోమరితనము ఒక చీడ పురుగువంటిది.

ప్రార్థన:- సదాకాలము మీతోకూడా ఉన్నానని సెలవిచ్చిన తండ్రీ! మానవులమైన మేము నీతో ప్రత్యుత్తరములు సంధించుటకు ప్రార్థన అనే సాధనశక్తిని ఏర్పరచినందులకై నీకు వందనములు. ఈదిన వాక్యముద్వారా జ్ఞానయుక్తముగా పట్టుదలగా ఏలాగు ప్రార్థించవలెనో మాకు నేర్పుమని తండ్రీ నీ నామమున అడిగివేడుకొనుచున్నాము ఆమేన్.[1]

---

1. మే నెల 1939వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో చేసిన ప్రసంగము.

# 3. గురిపెట్టి ప్రార్థించుట

## లూకా. 18:1-8.

దైవ ప్రార్థనాసక్తికలిగినవారలారా! నేటి వాక్య ధ్యానముద్వారా గురిగల ప్రార్థనావాలు క్రీస్తుప్రభువు మనకు అందించునుగాక. ఆమేన్.

డాక్టరు మార్టిను లూథరు. ఇట్లు చెప్పినాడు నేను వ్యక్తిని గురించి ప్రార్థించినపుడు అతనిని నా మనోదృష్టి యెదుటికి తెచ్చుకొందును. గనుక మనమును ప్రార్థనలో ప్రభువును జ్ఞాపకము తెచ్చుకొన్న మీదట మనము ఎవవరిని గురించి ప్రార్థింపనై యున్నామో, ఆ వ్యక్తిని మనో దృష్టికి తెచ్చుకొని అతడు మన యెదుట ఉన్నట్టు భావించుకొని అతనిని గురించి చెప్పవలసిన మాటలన్నియు ప్రభువునకు వరుసగా చెప్పివేయవలయును. అనగా 1) అతని గుణములను గురించియు దుష్ట క్రియలను గురించియు, 2) అతడు వేయు ప్రశ్నలను గురించియు 3) అతనికి గల శోధనలను గురించియు ప్రభువునకు ఒక దరినుంచి రిపోర్టుచేస్తూ, మీరు చేయవలసిన మనవి ప్రభువునకు వినిపించవలయును. ఆ తర్వాత దేవా! నా ప్రార్థన ఆలకించినావని నమ్ముచున్నాను, నీకు స్తోత్రము అని చెప్పవలయును. ఒక మిషనెరీ ఇట్లు చెప్పుచున్నాడు:- ఒక పక్షిని కొట్టగోరు వేటగాడు కొమ్మను గాని ఆకునుగాని కొట్టితే పిట్టపడునా? పడదుగదా! అట్లే మనము ఎవరి గురించి ప్రార్థించనైయున్నామో, ఆ వ్యక్తి బలహీనతకు తగలకుండా ప్రార్థించిన యెడల, అతడు ఆ బలహీనత మానడు. వెన్న ముద్ద పక్షిని ఉండేలు బద్దగలవారు కొట్టనారంభించగా, ఉండేలు ఖర్చు అగునేగాని పిట్టబడదు. ఎందుచేత?

ఒకసారి పొదకును, ఇంకొకసారి కాలికిని, మరియొక సారి రెక్కకును వేరొకసారి వేరొకచోటను తగిలినయెడల కుంటుకొనుచు ఎగిరిపోవును. ఉండ గొంతుకకు తగిలితే వెంటనే పడిపోవునని వేటగాళ్లు చెప్పుచున్నారు. పక్షుల దృష్టాంతములు అంతమంచివి కాకపోయినను ఇక్కడ మనకు అక్కరకు వచ్చుచున్నవి. మన ప్రార్థన పట్టు ఏమనగా, ఆ మనుష్యుని బలహీనతవైపు గురిపెట్టి చేసినయెడల తప్పక నెరవేరునని ఈ దృష్టాంతము వలన గ్రహించుకొనుచున్నాము. గురిలేకుండా ప్రార్థించిన యెడల సమయము వృథా, ప్రార్థనా మాటలు వృథా, కీర్తనలు వృథా, వాక్య పారాయణము వృథా, మోకాళ్లు కొట్టుకొనిపోవుట వృథా? అంతయును వృథా? అతనియొక్క ఆత్మ మీకు దొరకనే దొరకదు. ***గురిలేని ప్రార్థనలు గుణమునకు రావు.***

ఒకవేటగాడు ఇట్లనుచున్నాడు. ఉండకు ఒకపక్షి పడవలెను అవును. ఆయన మూడు ఉండలు తీసికొని వెళ్లితే, మూడు పక్షులు తెచ్చేవాడు. అట్లేనొక ప్రార్థనకు ఒక మనిషి ఆత్మ దొరుకవలెను. అనగా ఈ వేళ ఒక మనిషిని గురించి మీరు గురిపెట్టి ప్రార్థించితే ఆ మనిషి మీకు దక్కవలయును.

**ప్రార్థన ఫలితములు:–**

1. ప్రార్థనవలన మహిమ, రక్షణ, సహవాసము కలుగును. అనగా మన ప్రార్థనవలన తండ్రికి మహిమ, కీర్తి రావలయును రక్షణ లేనివారికి రక్షణ రావలయును. రక్షణ ఉన్నవారికి మన ప్రార్థన వలన దేవునితో సహవాసము కలుగవలెను.

2. మన ప్రార్థనవలన ఎదుటి మనిషికి రక్షణ రావలయును. ఒకరి స్వస్థత నిమిత్తము ప్రార్థిస్తే వారికి స్వస్థత రావలయును. ఇబ్బంది

ఎత్తి ప్రార్థించితే సమృద్ధి రావలయును. ఒక కలహము ఎత్తి ప్రార్థిస్తే, సమాధానము రావలయును.

3. మన ప్రార్థనవలన దేవునికిని, మనకుగల సహవాసము వృద్ధిపొందవలయును. ప్రార్థన చేయగా అనగా తరచుగా ప్రభువు దగ్గరకు ప్రార్థనకై వెళ్లినయెడల ప్రభువుతో చనువు కలుగును. ఆ చనువు సహవాసాభివృద్ధికై దారితీయును.

షరా:- దేవునిరాజ్యము భూమిమీద వ్యాపించుటకు అనేక పనులు జరుగుచున్నవి. ఆ పనులు రాజ్యాభివృద్ధి విషయమైన సాధనమైయున్నవి. మన ప్రార్థనకూడ ఒక పని సాధనము. ఇది గ్రహించి, "దేవా! నా ప్రార్థన నీ రాజ్యాభివృద్ధి సాధనముగా వాడుకొందువని నమ్ముచున్నాను నీకు స్తోత్రము" అని చెప్పుటవల్ల ఆయనకు మహిమ కలుగును. (2) దేవా! నా ప్రార్థన ఆలకించెదవని నమ్ముచున్నాను నీకు స్తోత్రము అని చెప్పుటవల్ల తండ్రికి కీర్తి కలుగును. (3) నీ చిత్త ప్రకారము నా ప్రార్థన నెరవేర్చియున్నావని నమ్ముచున్నాను, నీకు స్తోత్రము అని చెప్పుటవలన ఆయనకు కీర్తి కలుగును.

షరా:- మనమెవరినిగూర్చి ప్రార్థించినామో అతనిని ప్రభువు రక్షించుట వలన ఆయనకు కీర్తిగాని, మనకుకాదు. తరచుగా ప్రార్థన చేయుటవల్ల తండ్రియొద్ద నాకు చనువు కలిగింది. తండ్రి నన్ను దగ్గరకు రానీయని యెడల నాకు ఆ చనువు కలుగునా! ఆయనే అట్టి ప్రార్థనావాలు, వీలు కలిగించినందువలన ఆయనకు స్తోత్రములు అని దేవుని స్తుతించవలెను.

యేసు ప్రభువు తన శిష్యులతో ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క విషయమును గూర్చి బోధించుచుండెను. ఉదా:- ప్రార్థన, ఉపవాసము, పరలోక రాజ్యము, మొ॥వి బహు క్లుప్తముగా చెప్పెను. ఆయన

బోధించినది కొన్ని నిమిషములైనను, ప్రజల హృదయములలో అవి గొప్ప పనిచేసెను. మనము ఆయన ఒక చిన్న మాటను వివరించుటకే సమయము చాలదు. ఆయననుగూర్చి అనేక గ్రంథములు వ్రాయబడినవి కాని వాటిలో ముఖ్యమైనవియే ప్రసంగికులు చదువుచున్నారు.

"విసుగక నిత్యము ప్రార్థన చేయవలయును". మానవుని జీవితములో కష్టమును బట్టి చూడగా కష్టకాలములో ఎంత దైవజనునికైనను విసుగుదల రాకమానదు.

విసుగుదల"- 1) ప్రార్థన చేయ తలంచగా, ప్రార్థనకు స్థలము దొరకనప్పుడు, 2) స్థలము దొరికినా సమయము దొరకనప్పుడు, 3) సమయము ఉన్నా, వీలు చిక్కనపుడు, 4) వీలున్ననూ అనారోగ్యము కలిగినపుడు విసుగుదల వచ్చును. ఎండ ఎక్కువ, వాన యెక్కువ అని విసుగుకొందుము; ఆ విధముగానే బైబిలు చదువనపుడు మరియు ప్రార్థనలోనూ మనము విసుగుచున్నాము.

యేసుప్రభువు చెప్పిన మాటలో రెండు భాగములున్నవి:- 1) విసుగకుండ ప్రార్థన చేయవలెను. ఇది ఒక వంతు. 2) నిత్యము ప్రార్థన చేయవలయును. ఇది రెండవ వంతు. రెండునూ ప్రార్థనను గూర్చిన అంశములే. గనుక దైవప్రార్థన పై రెండు విధములుగా చేయవలయును. విసుగుదల ఎప్పుడు కలుగును? 1) స్థలము 2) సమయము, 3) వీలు లేనప్పుడు. విసుగుకొంటే, అది ప్రార్థన కాదు. విసుగుకుంటున్నారు, ప్రార్థన చేయుచున్నారు. కాన *విసుగుదల లేకుండా చేయునదే ప్రార్థనగాని విసుగుదలతో* కూడినది ప్రార్థన కానటువంటి ప్రార్థన.

లూకా సువార్త 18వ అధ్యా॥లో ప్రభువు ఒక ఉపమానము చెప్పినారు:- ఒక స్త్రీ అనేకమారులు మనవి చేసికొన్నది. మన అనుభవమునుబట్టి ఆమె విసుగుకొనలేదు. విసుగుదలకు పై చెప్పిన

మూడు కారణములున్నవి. (2) స్త్రీయొక్క ఉపమానమునుబట్టి చూచితే, అధికారి పరిష్కారము చేయలేదు. ఈ కారణముచేత ఆమె విసుగుకొనవలెను, అయిననూ ఆమె విసుగుకొనలేదు. మనము దేవునికి ప్రార్థన చేయుచున్నాము. దేవుడు మన విషయము పరిష్కరింపవలయును. ఒకవేళ పరిష్కరింపపోయినను, విసుకకొనకూడదు. ఈ భావము చూపించుకొనుటకై క్రీస్తుప్రభువు ఈ ఉపమానము నిచ్చెను. దేవుడు మన ప్రార్థనలు ఆలకించుచున్నాడా? ఒక్కొక్కప్పుడు నెరవేర్పు కనబడదు. అనేక దినములు చేసినను నెరవేర్పుకాదు. అప్పుడును విసుగుదలను రానీయకూడదు. ఇన్నిమారులు చేసినను నెరవేర్పు రాలేదనియినను విసుగుకొనకూడదు. ***మనపని విసుగుదల లేకుండా ప్రార్థన చేయుట.***

**రెండు న్యాయములున్నవి:-**

1. మనకు ఒక న్యాయమున్నది. అది మనము నెరవేర్చవలసిన న్యాయము. 2. దేవునికి మరియొక న్యాయమున్నది. మన ప్రార్థన ప్రకారము చేసి నెరవేర్చుటయే దేవుని న్యాయము.

దేవునిది ఒకటి, మనది ఒకటి. విసుకకుండా ప్రార్థించుట మన న్యాయము. మన మనవి ఆలకించి పరిష్కరించుట ఆయన పని. మనము నేర్చుకొనవలసిన న్యాయమునుబట్టి ఆయన న్యాయము ఉంటున్నది. గనుక మనము మన న్యాయము నెరవేర్చవలసిన ప్రార్థన ఉన్నది గాని మన న్యాయము తప్పిపోయినది గనుక నెరవేర్పులేదు. అనగా న్యాయప్రకారము చేయవలసిన ప్రార్థన చేయలేదు గనుక నెరవేర్పులేదు. ఆ న్యాయాధిపతి ఆరంభంలో విచారించకపోయినను చివరకు ఆమెను పిలిచి న్యాయ విచారణ చేసినారు. అలాగే దేవుడుకూడ తప్పక ఎప్పటికైన ఆలకిస్తాడు ఆలస్యమైనను ఆయనపని

ఆలస్యముచేయుట అవసరమైతే ఆలస్యము చేస్తాడు. ఆయన విశ్వాసులయొక్క ప్రార్థన ఆలకించి న్యాయము తీర్చును గనుక తప్పక ఆలకిస్తాడు విసుకక ప్రార్థించండి. చిన్నప్పటినుండి దేవుడు ప్రార్థన ఆలకిస్తున్నాడని చదువుకున్నా మనము విసుకుకుంటున్నాము ఎందుచేత? నిండైన నమ్మకము లేనందువలన కొంచెము ఆలస్యమైనప్పటికి దేవుడు ప్రార్థన ఆలకిస్తాడు గనుక విసుకకూడదు.

పై నాలుగు కారణములనుబట్టి విసుగుకుంటారు. దేవుని దగ్గరనుంచి నెరవేర్పు రాలేదని విసుకుతాము కాని ఆయన తప్పక ఆలకిస్తాడని, విసుగక దయచేయునని నమ్మవలెను. విసుకుకొనవలసిన కారణములు తట్టు చూడక, ఆయన తప్పక ఆలకిస్తాడు న్యాయము తీర్చుననే విషయము తట్టుచూచి ప్రార్థించవలెను. దేవుడాలకిస్తాడనే విషయము ప్రార్థించుటకు మనలను ప్రేరేపిస్తుంది.

**రెండు కారణములు:-** 1. సమయము 2. వీలు. ఇక్కడ దేవుడు ఆలకిస్తాడని ఉన్నది గనుక ఆ సంగతి ప్రార్థనకు ప్రేరేపిస్తుంది. విసుగుదల లేకుండా నిత్యము ప్రార్థించవలెను. ఈ కారణమువల్ల ధైర్యము పుట్టుచున్నది. విసుగుదల కొట్టివేయుటవల్ల నిత్య ప్రార్థన చేయగలము. విసుగుదల కొట్టివేయకపోతే ప్రార్థన ఆగిపోతుంది. గనుక ఎన్నడూ విసుగుదలలోనికి పోకూడదు. మన మనవి నెరవేరకపోయిన విసుగుదలపడకూడదు. నెరవేర్పు ఈ ఉపమానములో లేదు. తప్పకుండా వింటాడని, నెరవేర్పు ఇస్తాడని ఈ ఉపమానములోను ఉన్నది. నిత్యము ప్రార్థన చేయవలెను. 4 రోజులు చేసి ఆగిపోతే నిత్యమనేది రాదుకదా! ఆ ప్రార్థన ఏమైనది? ఆ ప్రార్థన, ప్రార్థన స్వరూపము ధరించలేదు. అది విసుగుదల స్వభావమును, విసుగుదల నైజమును కలిగియున్నది. విసుగుదల

లేకుంటే నెరవేర్పు కలిగియున్నది. 'ఆ స్త్రీ వెళ్లి మనవి చేసినప్పుడు ఆయన ఆలకించలేదు' అని ఆమె తెలుసుకొన్ననూ, అయిననూ ఆయన అనగా ఆ లోకాధికారి 4రోజులు వెళ్లింది, ఆలకించలేదు. ఇది మన ఎదుట కనబడే వృత్తాంతము. గాని ఆయన ఆలకిస్తాడని ఉన్నది గనుక అనేక పర్యాయములు వచ్చినది. మన యెదుట కనిపిస్తున్న వృత్తాంతము ఆమె హృదయములో ఉన్నది గనుక అనేకసార్లు వచ్చినది. ఆమె ఎదుట ఆయన ఆలకించలేదని ఉన్నను, ఆయన ఎప్పటికైనా ఆలకిస్తారని తన హృదయములో ఉండవలెను. ఇది విచిత్రమైన వృత్తాంతము. దేవుడు మన ప్రార్థన ఆలకిస్తాడని ఉన్నను 4 రోజులు చేసినా, విసుగక కొనసాగించిన దేవుడు ఆలకించలేదు. 'ఆయన ఆలకించపోయిన పర్వాలేదు, ఆయన గడియ వచ్చినపుడు ఆలకిస్తాడని' నమ్మవలెను. విశ్వాసి దేవుడు ఆలకిస్తాడని పట్టుకుంటాడు. అవిశ్వాసి దేవుడు ఆలకించలేదను మాట పట్టుకుంటాడు. విశ్వాసియైతే, దేవుడు ఆలకిస్తాడని ప్రార్థన చేస్తునే ఉండును. అదే నిత్య ప్రార్థన. విశ్వాసికి నిత్యము ప్రార్థించే సమయముండును. ఇక్కడ రెండు సంగుతులు గుర్తించవలెను. (1) అంతరంగములో దైవప్రార్థన చేసే సమయమందు తన హృదయములో విసుగుదల వచ్చునేమో అని జాగ్రత్తగా పరిశీలించుకొనవలెను.

(2) (i). ప్రార్థన గురిగా జరుగుతుందా లేదా? (ii). విసుగుదల వస్తున్నదా?

తప్పకుండా దేవుడు నా ప్రార్థన ఆలకిస్తాడు అని నమ్మవలెను. ఆలకించలేదు అనే విషయము ఎత్తుకొనకూడదు. కాబట్టి మీ స్వంత విషయములు ఎత్తి ప్రార్థించునపుడు విచారపడకూడదు (పడవద్దు). ఇంకా మీ ప్రార్థన హెచ్చుగా చేయవలెను. విసుగుదల

వస్తే హెచ్చిపోయిన ప్రార్థన తగ్గిపోతుంది. నెరవేర్పు ఆలస్యముగా వస్తుంది. దైవ ప్రార్థన చేసేటందుకు మనమందరము పూనుకున్నాము. చేసిన వాటిలో కొన్నిటికి నెరవేర్పు వచ్చినది. ఇంకా క్రొత్త ప్రార్థనాంశాలు వస్తున్నవి. ప్రభువు ఈ మాట ఉపమానములో సెలవిచ్చినపుడు ఈ రెండు విషయములతో పాటు దివారాత్రులు ప్రార్థించవలెను అని సెలవిచ్చెను, అంటే ఈ నిత్య ప్రార్థన జ్ఞాపకము చేసెను. పగలు రాత్రులు చేయవలెను. ఇది చూచి దేవుడు ఆలకించకుండా ఉంటాడా! ఈ వేళ పగలు రాత్రి, రేపు పగలు రాత్రి ఈలాగు క్రమముగా చేసికుంటూ వెళ్లవలెను. అందుకే ఆయన తాను ఏర్పరచుకొన్న వారియొక్క ప్రార్థన అన్నారు. ఉదా:- ఏ విషయమైనా10మంది ప్రార్థిస్తుంటే వారిని బోధకుడు పరీక్షిస్తున్నాడు. ఎవరు కునుకుచున్నారో, ఎవరు విసుగుచున్నారో, ఎవరు మాటమాటికి బయటికి వెళ్లివచ్చుచున్నారో అది ఆయన చూచుచున్నారు గనుక; అట్టివవారిని బోధకుడు గమనించినాడు గనుక ఎవరు విసుగకుండా ప్రార్థించినారో వారి ముగ్గురను ఏర్పరచుకొన్నట్లు, విసుగకుండా ప్రార్థించే వారినే మాలో ఏర్పర్చుకొన్నారు. విసుగుదలలేకుండా నిలకడగా ప్రార్థించుచున్నావని ఆ బోధకుడు అట్టివారిలో ఒకని ఏర్పర్చుకొనెను. ఆలాగే దేవుడు విసుగకుండా ప్రార్థించేవారినే ఏర్పర్చుకొనును. విసుగుదలలేనందున, వారు నిత్యము ప్రార్థనచేయువారు గనుక వారిని ఏర్పర్చుకొనును గనుక తానేర్పరచుకొను వారిని అని ప్రభువు చెప్పెను. వీరు ప్రార్థనాపరులే. మంచి మార్కులు గలవారిని టీచరు ఏర్పరచుకొన్నట్లు దేవుడు వారిని ఏర్పరచుకొన్నాడు. ఎందుకు? వారి ప్రార్థనలు నెరవేర్చే పనిమీద వారిని ఏర్పరచుకొన్నారు. మీరు నామకార్థముగానైన విసుగుదల

లేకుండా ఉండవలెను. చేయవలసిన ప్రార్థన నెరవేర్చే పనిమీద వారిని ఏర్పరచుకొనెను. ఎన్ని అంశములమీద మనము ప్రార్థిస్తున్నామో, అన్నిటిమీద నెరవేర్పు అవసరమై ఉన్నది. **ఆయన మనసులో నెరవేర్చవలెనని ఉన్నది కాబట్టి; ఆ నెరవేర్పు నిమిత్తము ప్రార్థించే ప్రార్థనాపరులు కావలెను.** అనగా ఆ నెరవేర్పులు బయలుపర్చేటందుకు దేవుని మనుష్యులు కావలెను. అటువంటి వారిని ప్రార్థనాపరులనుగా ఆయన ఏర్పరుచుకొనుచున్నారు. బయటకు వెళ్లి సువార్త బోధించుటకు సువార్తికులు కావలెను. ఆదరించే ఉద్యోగము చేసేవారుకూడ కావలెను అనగా రోగులను ఆదరించేవారు. ఆలాగే చిక్కులలో ఉన్నవారి చిక్కులు విడదీయుటకు పరిచారకులు కావలెను. వీరు ఎక్కడనుండి వస్తారు? మనుష్యులలో నుండి వస్తారు. మూడు పాఠశాలలోని విధ్యార్థులు స్కూలు ఫైనల్‌లో కృతార్థులైన పిమ్మట వెళ్లి, ఆయా డిపార్టుమెంటులలో పనిచేయుదురు. ఈ ప్రకారముగా నేర్చుకొన్నందున ఆయా ఉద్యోగములలోకి వెళ్లి, పనిచేయుదురు. అట్లే ప్రార్థనోద్యోగము మీద ప్రార్థనాపరులు కావలెను. 1) దేవుని నెరవేర్పులు అందుకొని, 2) నెరవేర్చే ప్రార్థనలు జరిగించే, 3) ప్రార్థనా మనుష్యులు దేవునికి కావలెను. అప్పుడు దేవుడు ఎంత గొప్ప పనియైెన చేయగలరు. ప్రభువు 12మంది ఏర్పరచుకొన్నారు. 1900 ఏండ్లక్రిందట భూదిగంతముల వరకువారు సువార్త ప్రకటించిరి. ఒక విద్యకాదు అన్ని విద్యలు క్రీస్తు ప్రభువు సహవాసములో సంపాదించుకొనిరి. వినయము, పవిత్రత, జీవనము ఈలాగు అనేకములు సంపాదించుకొనిరి. అప్పుడులేచి భూమియొక్క సమస్త రాష్ట్రములకు వెళ్లి, వాక్యము ప్రకటించిరి. వారు ఆ పనిని

అంగీకరించినందున నూతన బలముపొంది. పనిచేసిరి. ప్రభువువద్ద వేదవిద్య బాగా నేర్చుకొన్నారు గనుక దేశదేశములకు వెళ్లి లోకధనము లోక విద్య తక్కువ అయినను వెళ్లి, మంచి పని చేసిరి. నేర్చుకొనేటప్పుడు విసుగుకొనిరి. గాని తరువాత విసుగుకొనలేదు ఆకలి అయినప్పుడు పేతురు విసుకలేదుగాని ప్రార్థనలోకి వెళ్లినాడు గనుక ప్రార్థన విద్యలో శిష్యులందరూ ఆరిందలైరి. అంతే కొంచెము సమయము దొరికితే చాలు, ప్రార్థనలోకి వెళ్లిరి. గనుక మనమును ప్రభువు చెప్పిన ప్రకారము చేస్తే గొప్పగొప్ప ఉపకార ఉద్యోగములకు ప్రభువు నిర్ణయించును. దేవుడు తాను ఏర్పరుచుకొన్న వారు దివారాత్రులు ప్రార్థించుచుంటే ఆయన తప్పకుండా ప్రార్థన ఆలకించును గనుక కోరుకొనండి. ఎప్పుడో కోరుకొనడముకాదు, ఇప్పుడే. విసుగక నిత్యము ప్రార్థించే వారిని అడిగితే కాదు ఆ ప్రకారము చేస్తే ఏర్పాటులో చేరగలము. ఈ దినములయందు ప్రార్థన బలము తగ్గిపోవుచున్నది. కష్టము, నింద, అవమానము ఎక్కువగుచున్నది. అయినను మనము మనపని మీద ఉండవలెను. దుర్జనులు తమ పనిమీద ఉన్నారు గనుక సజ్జనులును తమ పనిమీద ఉండవలెను. గనుక ప్రభువు ఇచ్చిన సలహాలు రెండునూ మీకు ఎంతైనా అవసరమే. 1) నిత్యము, 2) విసుగకకుండా ప్రార్థించవలెను. విసుగుకుండా ప్రార్థిస్తే అది నిత్యప్రార్థనయే. ఒక వ్యక్తి ప్రార్థిస్తూ విసుకుకొన్నాడు. 4రోజులుచేస్తే, అది నిత్య ప్రార్థనకాదుగాని. అనిత్య ప్రార్థనయైయున్నది. ఇంగ్లీషు బైబిలులో Faint not అంటే సొమ్మసిల్లవద్దు అని ఉన్నది. ఒకరు ప్రార్థన నెరవేరనందున సొమ్మసిల్లినారు. అదే విసుగుదల. ప్రభువు చెప్పిన ఉపమానములో కొన్నిమాటలు ఉన్నవి.

1) నిత్యము,
2) తరచుగా,   } ప్రార్థించవలెను.
3) దివారాత్రులు,

అప్పుడు తండ్రి త్వరగా నెరవేర్పు ఇచ్చును. విసుగుదల లేకపోతే త్వరగా జవాబిచ్చును. ఆలస్యమైననూ జవాబిచ్చును. దేనినిబట్టి మనము చెప్పగలము? త్వరగా అనేమాటనుబట్టి 1) వాగ్ధానము ఆలకిస్తాడు. 2) వృత్తాంతమును తప్పక ఆలకిస్తాడు. ఈ సంగతి జరిగిపోయిన, భావికాల వృత్తాంతమునుబట్టి చెప్పుదురు. గతించిన దానినిబట్టి మనము నమ్మినయెడల మన ప్రార్థన తప్పక జరుగుతుంది. మనుష్యకుమారుడు వచ్చునపుడు, భూమిమీద విశ్వాసముండ కనుగొనునా? ఆ ప్రశ్నతో ముగించెను. ఈ ప్రశ్న మానవుని జీవితకాలమునకు సరిపోయేది. చనిపోయిన వానియొద్దకు వచ్చి ఘనవైద్యులు ఏమి చేస్తున్నారు? ఒక తలవెంట్రుక తెచ్చి ముక్కుయొద్ద పెట్టగా, అది కదిలితే మందులే ఊపిరిపోయుచున్నట్టే. అట్లే ప్రార్థన ఊపిరివంటిది గనుక మనము అన్ని కష్టములు ప్రభువుతో విసుగక చెప్పుచున్నాము అనే ప్రార్థన ఊపిరి నిత్యము కలిగినవారమై యుండవలెను. అట్టి స్థితిలో పెండ్లికుమారుడైన క్రీస్తు ప్రభువు మనలను స్థిరపర్చును గాక. ఆమేన్.[1]

---

1. 5.7.1945వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో చేసిన ప్రసంగము.

# 4. సంపూర్ణ ఉపవాస అభ్యాసము

## యెషయా 58:3-8; 1థెస్స. 5:12-24.

ఉపవాస దిన ఆసక్తిపరులారా! మీకందరకు సంపూర్ణ ఉపవాస దీవెనలు అందునుగాక! ఆమేన్.

**ప్రార్థన:-** భూలోకమందున్న మా తండ్రీ! పరలోకమందున్న మా తండ్రీ! తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను త్రిత్వదేవా! ఇప్పటి మా కూటములో ఉన్న తండ్రీ నీకనేక స్తోత్రములు. సైతానుకుకూడా ఈ కూటమునకు వచ్చుటకు సెలవిచ్చిన తండ్రీ స్తోత్రములు. మేము ఎటువంటి మీటింగులు చేసికొనుచున్నామో, ఆ మీటింగులు సైతాను కూడా చూడవలెను. గనుక నీవు అతనికి సెలవివ్వడము మంచిదే. అతని ప్రయత్నములను, అతని రాజ్యమును పడగొట్టే ప్రయత్నముల నిమిత్తమైన ఈ మీటింగును; అతడు అతని సైన్యము చూచుట ముఖ్యము. అలాగే నీ విశ్వాసులు నీ రాజ్యమును వృద్ధిచేసే మీటింగులు చూచుటకు దూతలు, పరలోక వాస్తవ్యులుకూడా రావలెను. వారిని కూడా తీసికొని రమ్ము. అలాగే ఎవరికైతే వరమున్నదో అట్టి భూలోక వాస్తవ్యుల ఆత్మలనుకూడా ఇది చూచుటకు తీసికొని రమ్ము. ఎందుకంటే ఈ పని వారుకూడా చూడవలెను.

ఈవేళ ఇక్కడ మీటింగు ఉన్నదని తెలియ జేసినప్పుడు ఎవరికి తెలిసినదో, వారిలో మీకిష్టమైన వారిని తీసికొని రమ్ము. నీకిష్టము లేనివారిని రానియ్యవద్దు. తీరా వచ్చిఉంటే మెల్లగా వారిని సాగనంపుము. ఈవేళ నీవు మాకు ఏమి చెప్పనైయున్నావో వాటిని చెప్పుము. వాటిని వినగలిగే మా హృదయ చెవులను విప్పుము, ఆదరించుము. చెవిగలవాడు ఆత్మ సంఘముతో చెప్పేవి వినవలెను గదా. ఇక్కడ ఉన్న చిన్నపిల్లలను, పెద్దవారిని, క్రైస్తవులను, క్రైస్తవేతరులను అందరిని పేరు పేరు చొప్పున దీవించుము. ఈ ప్రార్థన త్వరగా వచ్చుచున్న మా ప్రభువుద్వారా ఆలకించుము ఆమేన్.

1. కఠినమైన ఉపన్యాసాలు వినేటందుకు వచ్చినట్టి విశ్వాసులారా! వినండి. నా మొదటి ప్రసంగము ఏదనగా ఉపవాసము ఈ సంగతులు మీరు ఇదివరకే ఇతర స్థలములలో, బైబిలులో, సన్నిధి కూటాలలో విన్నారు. కొందరు వినలేదు. సన్నిధి కూటములలో యేసుప్రభువు చెప్పిన వివరణలు అనగా ఉపవాసమునుగూర్చిన వివరములు, ఆ కూటస్తులు నాకంటె బాగా చెప్పగలరు. మొదటి ఉపన్యాసము ఉపవాసము గురించి, రెండవ ఉపన్యాసము దశమ భాగము గురించి, మూడవ ఉపన్యాసము సువార్త ప్రకటనగూర్చి, నాల్గవ ఉపన్యాసం సన్నిధి కూటముల స్థాపనగురించి, ఐదవ ఉపన్యాసం ప్రభువు రాకడను గురించి. ఈ ఐదు ఉపన్యాసములును మిక్కిలి అవసరమైనవి.

**ఉపవాసము:-**

1. ఉపవాసము అనగానేమి? ఉపవాస ప్రార్థన అనగా ఎక్కువ కష్టపడి, చెమట ఊడ్చి పనిచేయుటయే ఉపవాస ప్రార్థన. 2. మామూలు పనులు కట్టివేసి వాటిని ఉపవాస ప్రార్థనా శాలకు రాకుండాచేయుట. 3. తీరిక లేకుండా ఉండుట. 4. మీటింగులో కూర్చున్నవారు ఒకరితోఒకరు గుసగుసలాడుట, మాట్లాడుట మానివేసి, ప్రభువు దీక్షతోనే ఉండుట. ఎవరికి ఏమి వచ్చినదని అడుగుకొనుటకూడ మానివేయవలెను.

5. వచ్చిన భూతములను బైట నిలువబెట్టి నోరునెత్తి బాదుకొనేటట్లు చేయుట. ఉదా:- అరణ్యములో ఉన్న త్రాసు పాము అనగా ఎప్పుడూ మనిషిని చూడని త్రాసు పాము మనిషినిచూస్తే తల నేలకు వేసి కొట్టుకొనును. అలాగే ఇటువంటి కూటములు భూతాలు చూస్తే తలనేలకు వేసి కొట్టుకొనును. అట్టి పనిని జరిగించునదే ఉపవాస ప్రార్థనాదినము. 6. ఎ) అన్నముగాని, బి) నీళ్లుగాని, సి) బయటకు వెళ్ళవలసిన అవసరాలుగాని

ఏమియులేకుండా చేసికొనుటే ఉపవాస ప్రార్థనాదినము. 7. ఎ) బీదలకు, బి) రోగులకు, సి) వృద్ధులకు, డి) ఉద్యోగములు లేనివారికి అనగా నిరుద్యోగులకు మన ముద్దలో ఒక ముద్ద ఇచ్చివేయునదే లేక అన్ని ముద్దలు ఆవేళకు ఇచ్చివేయుటయే ఉపవాస ప్రార్థనాక్రమము. ఇది బైబిలులో ప్రవక్తలు మిక్కిలి స్పష్టముగా వ్రాసినారు. యేసుప్రభువే అటువంటి బీదలు అనగా, 1) రోగులు, 2) వృద్ధులు, 3) పేదలు, 4) ఉద్యోగములేనివారు. మొదలైన వారికి కావలసిన సహాయముచేసి, వారి అక్కరలు తీర్చిరి. ఆలాగే, మనమును వారికి మనము సహాయము చేయుటకు అట్టి సమయము ప్రభువే రప్పిస్తే, అదే ఉపవాస సమయము. వారేకాదు ఇంకా బీదలున్నారు. 5) అన్నదాన సమాజపు వారు వచ్చి 'అయ్యా మీరు క్రైస్తవులు. మాకేదైన సహాయము ఇయ్యండి' అంటే అప్పుడు మీరు ఇస్తే అది బీదల లెక్కలోనికి వచ్చును. 6) మనము భోజనము చేసివేసి పాత్రలన్నీ కడిగివేసిన తర్వాత ఒక కునుకు తీద్దామని పండుకొన్నప్పుడు, మన బంధువులుగాని, స్నేహితులుగాని పొరుగు ఊరునుండి పగలు అయినా రాత్రి అయినా మన ఇంటికి వచ్చినపుడు; (బైబిలులో స్నేహితుడు రొట్టెలకొరకు సమయము దాటి నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రిలో వచ్చినట్లు ఉన్నదికదా!) అట్టి సమయములో బద్ధకించక, విసుగుకొనక ప్రభువునకు చేసినట్లు భావించిచేస్తే, అది అసలైన అతిధి సంస్కారము. అనగా అవసరమైన వారికి చేయవలెను అదియే ఉపవాసము. బంధువులు, స్నేహితులు ఆ నిమిషమునకు బీదలైనవారు వీరిలో ఏడు రకపు బీదలున్నారు. అప్పుల పాలైనవారు మీవద్దకు వచ్చి సలాంచేసి, మాకు కాస్త సహాయము చేయండి తర్వాత తీర్చుకొంటాము అని అన్నప్పుడు చేయగలిగినంత సహాయము చేయుటయే ఉపవాసము. (దౌర్జన్యము చేయువారును వచ్చి

సహాయము అడుగుదురు. కారణము రాకడ దగ్గర పడినది. గనుక అట్టి దౌర్జన్యస్తుల రాకడకూడా దగ్గర పడినది. వారికిని మనము సహాయము చేయాలి. అందుకే ఇట్టి కూటాలు. (అనగా అట్టి శక్తిని సంపాదించుకొనుటకే ఈ కూటములు). 8) మనదగ్గర డబ్బు, సరుకు అయిపోయినప్పుడు వారు వస్తారు. అప్పుడు అబ్బాయి నా దగ్గర ఏమీలేదు. నీకెక్కడైన దొరికేటట్లు ప్రార్థిస్తాను. నా ప్రభువు తప్పక నా ప్రార్థన వింటాడు. యోహాను. 14:14లో యేసునామమున ఏదైనా వింటాను అని ఉన్నది గనుక అధైర్యపడకు' అని అతనిని నిలువబెట్టి ప్రార్థిస్తే మొదట అతడు నమ్మకపోయినా తర్వాత సమ్మతించి వెళ్లతాడు. ఈ మంగళవారమేకాదు. ప్రతి మంగళవారము ఇట్టికూటములు పెట్టాలి. 9) ఇది చాలా భయంకరము. అన్నిటికంటె భయంకరము. మీరు నమ్మరు. వీరు ఆఖరు బీదవారు. అనగా యేసుప్రభువే బీదవాని ఆకారముగా వస్తాడు. కుష్టురోగుల ఆకారంలో వస్తాడు ఎందుకనగా, "నరులును, నీవును చేసిన పాపమునుబట్టి, ఇట్టి జబ్బులు వచ్చినవని మానవులకు చూపుటకు వచ్చును. ఎప్పుడైనా ప్రభువు అట్టి రూపముతో వస్తే, అట్టి తరుణమును నీవు పోగొట్టుకుంటే, నీవు దౌర్భాగ్యుడవును, వట్టి దరిద్రుడవును అగుదువు. నిదానించి చూచిన యెడల అతని కళ్లనుండి అనగా భిక్షకుని కండ్లనుండి వెలుగు వచ్చును (ఆ రోగి ప్రభువై ఉంటే అది అందరికి కనిపించక నీకే కనిపించును. అప్పుడు ఆయన చాటుకు వెళ్ళిపోవును. ఆయన ప్రభువని నీవు గుర్తించి, ప్రభువా! నమస్కారము అని చెప్పితే, ఆయన నీ భిక్షము తీసుకోరుగాని అంతర్ధానమగుదురు. మరియొక రకము వారు ఎవరనగా, దౌర్జన్యము చేసేవారు. వీరు వచ్చి మనము తినేతినే కంచాలు దౌర్జన్యముగా లాగుకుంటారు. మీరు ప్రార్థనలో ఉంటూ ఉంటే అట్టి దౌర్జన్యాలు ప్రభువు మీకు జరుగనివ్వరు (నా మాట మీరు వింటారు. గనుక ప్రార్థనలో ఉంటారు).

అట్టి పేదలను పరిశీలనగా తెలిసికొనుటకు లోపలకు వెళ్లి కాసేపు ప్రార్థించుకున్నట్లయితే వేయవచ్చునా? వేయకూడదా? అను సందేహము తీరిపోవును. అతను నిజముగా బీదవాడయితే వేసేవరకు ఉంటాడు. ఆ వచ్చినవాడు ప్రభువు అయితే నీవు ప్రార్థించుకొనునప్పుడు వెళ్ళిపోతాడు. కొందరు బట్టముక్క (వస్త్రము) అడుగుతారు, కొందరు పెరుగు అన్నము వేయమంటారు, ఇంటిముందే కూర్చుంటారు. జాగ్రత్త. ఈ విషయములు జాగ్రత్త. 10) మీరు ప్రయాణములో వెళ్ళునప్పుడు ప్రభువుగాని, దేవదూతగాని, పరలోక పరిశుద్ధుడుగాని 'మీయొద్ద కూర్చుండి, జాలిగా అందరివైపు బహు దీనముగా చూచుచుండును.' అప్పుడు నీవు విశ్వాసివి అయితే ఈ రూపు యేసుప్రభువుదే అని గుర్తించుము. మత్తయి 25అధ్యా॥లో ఉన్నదే మీకు చెప్పుచున్నాను. జాగ్రత్త. రాకడ సమీపించినది గనుక ఇకముందుకు ఇవి జరుగబోవును, నేడునూ కొన్ని జరుగుచున్నవి. జరుగనైయున్నవి గనుక జాగ్రత్త. ఈలాగు వీరు 10రకపు బీదలు. మీరు వారికి ఏమైనా ఇస్తే, వారు పుచ్చుకొనరు. వద్దులెండి అందురు.

పూనానుండి దౌండు స్టేషనునకు బండి వెళ్ళుచుండగా, దానిలో ఒక పెట్టెలో మిలటరీవారు ఉన్నారు. దానిలో ఒక ఆంగ్లో-ఇండియన్‌వలె ఉన్న ఒకవ్యక్తి, వారు స్థలమియ్యనందున బండిలో ఒక మూల నిలువబడి, ఆ బండిలో ఉన్నవారితో, లోకము ఎవరికొరకు కనిపెట్టుచున్నదో మీరు ఎరుగుదురా? అని అడిగి అంతర్ధానమై పోయారు. ఈలాగు ఆయన అనేకమారులు మనలను దర్శించును, పరీక్షించును, అనుభవము నేర్పించును. ఈ చెప్పబడిన సంగతులన్నీ మన అనుభవములో ఉండుటకే ఈ కూటము ఏర్పాటు చేసితిని. ఈ అనుభవములన్నీ క్రీస్తుప్రభువు మీకు నేర్పించి, తగిన కాలము తన దర్శనమిచ్చి, తనను గుర్తించగల్గిన జ్ఞానప్రత్యక్షతనిచ్చి, వివేకమును వెలిగించి, తన మహిమలో మిమ్ములను స్థిరపర్చుకొనునుగాక. ఆమేన్.[1]

1. 16.9.1958వ సం॥లో దేవదాసు అయ్యగారు బేతేలు గృహములో ఉపవాస దినమున చేసిన ప్రసంగము.

# 5. పరిశుద్ధాత్మను అందుకొను వాలు

## అపో.కార్య. 2:1-4.

అత్యాసక్తి పరులైన మీకు ఆత్మానందము కలుగునుగాక, ఆత్మాభిషేకము అందునుగాక. ఆమేన్.

**ఆత్మ నింపుదల:-** దేవుడు తన ఆత్మను మానవులకు నింపుతాడు. హనోకు దేవుని ఆత్మ కలిగినవాడు. అలాగే అబ్రాహాము, యోసేపు, హన్నా, జకర్యా ఎలీసబెత్తు, స్నానికుడైన యోహాను మొదలైన వారందరూ ఆత్మతో నింపబడినారు. ఆ ప్రకారమే మరియ పరిశుద్ధాత్మచేత నింపబడినది. అది దేవుని ఉద్దేశ్యము. పాపం ప్రవేశింపకముందు దేవుని ఉద్దేశ్యము ఏదనగా, స్త్రీలు పరిశుద్ధాత్మతో గర్భవతులై పిల్లల్ని కనాలని. అయితే మానవులు పాపము చేసి పాపముతోనే పిల్లల్ని కంటున్నారు. పరిశుద్ధాత్మతో గర్భవతులైతే పుట్టినవారు పరిశుద్ధులుగా ఉందురు. అయితే పాపమువల్ల పుట్టినందున మానవులందరూ అపరిశుద్ధులైనారు. 'నా తల్లి నన్ను పాపంతోనే గర్భందాల్చినది' అని యోబు అన్నాడు. దేవుడు ఆయన జన్మద్వారా నేను సృష్టికర్తను అని రుజువు చేసికొన్నారు.

మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము కలిగినది. సృష్టి, మనిషి పాపము చేయకపోతే పరిశుద్ధాత్మవలన పిల్లలు పుట్టి అందరూ యేసుప్రభువులానే ఉందురు. అప్పుడు మామూలు బట్టలు ఉండక మహిమ బట్టలే ఉండును కాని మానవుడు పోగొట్టుకొనిన మహిమను యేసుప్రభువు సంపాదించారు. ఆదాము పోగొట్టుకున్నాడుగానీ రెండవ ఆదాము అంతా తిరిగి సంపాదించారు. సృష్టి అంతా 'కలుగునుగాక'

అనగా కలిగినది. అలాగే మరియ గర్భము ధరించినది, పరిశుద్ధాత్మ వలన కలిగినది. మత్తయి. 3:11 ఆయన పరిశుద్ధాత్మ కలిగినవాడు గనుక 'పరిశుద్ధాత్మతోను అగ్నితోను బాప్తిస్మము మిచ్చును' అని యోహాను అన్నాడు. అపో॥కార్య. 1:5 యోహాను నీళ్లతో ఇచ్చెనుగాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను. గనుకనే అగ్నిజ్వాలవంటి నాలుకలు వారిమీద వ్రాలినది. అగ్ని వారి జ్ఞానాన్ని వెలిగించినది. కాబట్టి పరిశుద్ధాత్మను పొందినవాడు జ్ఞానముగా ఉండును.

1. సందేహము, 2. అనుమానము, 3. అవిశ్వాసము, 4) అపనమ్మిక, ఈ నాలుగు ఉంటే దయ్యములకు ఆనందము. అగ్నితో బాప్తిస్మమనగా జ్ఞానము వృద్ధిపొందుట. 120మందికి జ్ఞానము కలిగినది, తెలివి కలిగింది కాబట్టి అన్యభాషలు మాట్లాడారు. అనేకులు విభ్రాంతినొందిరి. మన హృదయాలు ఖాళీ అయితేనేగాని దేవుడు ఆత్మతో నింపడు. హృదయం ఖాళీ చేసి, అనగా శుద్ధిచేసికొంటేనే పరిశుద్ధాత్మతో నింపుతాడు. బాప్తిస్మము అనగా గ్రీకు భాషలో నీళ్ళలో ముంచుట, తోముట అనే అర్థములున్నవి. పరిశుద్ధాత్మ పొందాలంటే మూడు ప్రాముఖ్యమైనవి ఉండాలి. మత్త. 12:31 1) ప్రార్థన, 2) క్షమాపణ, 3) విశ్వాసము.

1. ప్రభువా! నాకు పరిశుద్ధాత్మ దయచేయుము. 2) నా పాపములు క్షమించుము. 3) దేవుడు నా పాపములు క్షమించి, నాకు తప్పక పరిశుద్ధాత్మ దయచేస్తాడని విశ్వాసముతో కనిపెట్టాలి. ఈ మూడును లేకపోతే పరిశుద్ధాత్మను పొందలేరు. ఒక మనిషి దయ్యము ఆకర్షణవల్లనో లేక తెలివి తక్కువవల్లనో పాపములో పడును. శోధనవల్ల ఇంట్లో విచారముంటుంది. కనీసం చోడిగింజ అంత

విచారమైన ఉంటుంది. ఆవగింజంత విచారమున్ననూ పరిశుద్ధాత్మ బాప్తిస్మమురాదు. చింతాకంత చిరాకున్నా మోక్షానికి వెళ్ళరు. విసుగున్నచో సిద్ధివెనుకకేపోవును. ***ఒక మనిషి బాగుపడడని తెలిసినా అతన్నికూడ పరిశుద్ధాత్మ విడువడు.*** కాబట్టి సందేహమనునది మీ హృదయములోనుంచి చెరిపివేసికొనండి.

అనుమానంతో పరిశుద్ధాత్మను అడుగకూడదు. హెబ్రీ. 4:1-3 అవిశ్వాసమువల్ల వారు విశ్రాంతిలో ప్రవేశింపలేకపోయిరి. ప్రభువు నా ప్రార్థన విన్నాడు అని నమ్మిక పోవుటకూడ పాపమే. మనిషి జీవితములో అవిశ్వాసము, అపనమ్మిక అనేది రాకూడదు. 1) పరలోకములో మొట్టమొదటి పాపము గర్వము 2) సృష్టిలో మొట్ట మొదటి పాపము సందేహము. గనుక అనుమానము, గర్వము ఉంటే పరలోకం వెళ్ళలేము. బైబిలులోనున్న వాగ్దానములన్నియు 'నావి' అని నమ్మితే పరలోకం వెళ్ళగలము. పాట: అంతయు మనదేగదా యేసునికున్నదంతయు మనదే గదా! ॥బహుగా॥ 1. ఆవగింజంత విశ్వాసముంటే కొండవెళ్ళి సముద్రంలో పడును. 2. ఆవగింజంత పాపముంటే పరలోకం వెళ్ళము. (పాట: యెహోవా నా మొర లాలించెను).

పరిశుద్ధాత్మ అగ్నితో బాప్తిస్మము జరిగినపుడు దడవచ్చి, ఒళ్ళంతా కాలినట్లు ఉండును. ఆత్మను పరమాత్మ సంధించుట. అనగా పరిశుద్ధాత్మ వచ్చినపుడు హాయిగా, చల్లగా ఉంటుంది. కొన్నిసార్లు గందరగోళంగా ఉంటుంది గాని ఆత్మే అన్నిటిని సరిచేస్తుంది.

వెనుక జరిగిపోయిన వాటిని అనగా గతించిన పాపములను జ్ఞాపకం చేసికొంటే పరిశుద్ధాత్మరాదు. సముద్రంలో పేతురు మునిగిపోతున్నపుడు ప్రభువు అల్పవిశ్వాసీ ఎందుకు సందేహించావు,

అన్నారు. సందేహము చాలా ప్రమాదకరమైనది. సందేహము = పాపములలోకెల్ల గొప్ప పాపము. దేవుడు నా ప్రార్థన వినలేదేమోననే సందేహము రాకూడదు. మరణ సమయమందు సందేహముంటే పరలోకము వెళ్ళరు. లూథరుగారి దగ్గరకు సాతాను పాపముల లిస్టు తెచ్చినదట. లూథరుగారు– 'ఇవేనా ఇంకా ఏమైనా ఉన్నాయా అని అని అంటే నాకు తెలియకుండా ఇంకేమిలేవు నేనే కదా చేయించాను' అని అన్నదట. అప్పుడు లూథరుగారు 'నా పాపములు అన్నీ దేవుడు క్షమించాడు' అని సిరాబుడ్డితో సైతాను కొట్టారట. సందేహపడలేదు లూథరుగారు. పాట: 'పాపివని నీకెవడు చెప్పెను పావనుడవై యుండగను...– 'మనో విచారము కూడదు నీకు'. యాకోబు 1:6 సందేహించువాడు గాలిచేత రేపబడి, ఎగిరిపడు సముద్ర తరంగమును పోలియున్నాడు. అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువు వలన ఏమైనా తనకు దొరుకునని ఆలోచించరాదు. సందేహముంటే పరిశుద్ధాత్మ రాదు. 'పరిశుద్ధాత్మ ఈరోజు నాకు వస్తుంది' అని ప్రతిరోజు నమ్మాలి. ప్రార్థన, క్షమాపణ, విశ్వాసము ఈ మూడును ఉంటే తప్పక పరిశుద్ధాత్మను పొందుతాము. పరిశుద్ధాత్మ రావడంద్వారా మనము పరిశుద్ధులౌదుము. సూర్యుని ఎండ మంచిచోటున, చెడ్డచోటున ఏలాగుపడునో, అలాగే పరిశుద్ధాత్మ మంచివారిమీదను, చెడ్డవారిమీదను వ్రాలును. గనుక ప్రార్థించి, నమ్మికతో అందుకొనండి. అట్టి స్థితి నేటిదిన వర్తమానము ద్వారా పరిశుద్ధాత్ముడు మీకు కలిగించునుగాక. ఆమేన్. [1]

1. 1947వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో ఆత్మకుమ్మరింపు కూటములలో చేసిన ప్రసంగము.

# 6. తైలాభిషేకము - ఆత్మాభిషేకము

**1సమూ. 16:12-13; 1సమూ. 10:1 దా.కీర్త. 45:1-4; కార్య. 2:33.**

ఆనందభరితులైన సహకారులారా! మీ వందనములకు వందనములు. ఇప్పటివరకు మీరు విన్నవన్ని కలిపితే ఒక పుస్తకమగునుగాని నేను ఇప్పుడు చెప్పబోయేది తక్కువే. మీరు సౌలుయొక్క తైలాభిషేకము విన్నారు. అయితే దానికి ముందు ఇశ్రాయేలీయులందరు ఒక రాజుకావాలని దేవుని కోరుకొన్నారు. ఆ ప్రజలందరికి ఒక అక్కర ఉన్నది. ఆ అక్కర రాజు కావాలనుటయే. అయితే ఆ అక్కర తర్వాత ఇంకొక అక్కర కావలసివచ్చింది. 12 గోత్రములలో ఆఖరు గోత్రములోనున్న అనగా బెన్యామీను గోత్రములోనున్న కీషుయొక్క గార్ధభములు తప్పిపోయినవి. అందుచేత ఆయన తన కుమారుడైన సౌలును వాటిని వెదకుటకై పంపెను. ఇది రెండవ అక్కర.

1. ప్రజలకు రాజులేడు గనుక రాజును తీసికొని రావలెను ఇది మొదటి అక్కర.

2. గార్ధభములు తప్పిపోయినవి గనుక వాటిని తోలుకొని రావాలి. ఇది రెండవ అక్కర. ఈ రెంటి తర్వాత సౌలు సమూయేలు దగ్గరకు వెళ్లెను. ఈ కథ చాలా పెద్దదైనందున చెప్పుటకు వీలులేదు. అప్పుడు సమూయేలునకు దేవోక్తి ఏమని వచ్చెననగా, "నా ప్రజలైన ఇశ్రాయేలీయులకు ఒక రాజు కావలెను గనుక సౌలును తైలముతో అభిషేకించుమని చెప్పెను. అప్పుడాయన ఇతనిని తైలముతో అభిషేకించెను. వీరిద్దరును త్రియేక దేవుడు, ముగ్గురు ఉండిరి. అప్పుడభిషేకించిరి. ఈ అభిషేకానికి ముందు రాజు అక్కర

గార్ధభములు దొరుకుట గనుక ఆ గార్ధభముల అక్కర తీరినది. ఇది అభిషేకమునకు మార్గమును సరాళము చేసినది. ఈ అభిషేకమునకు ముందేమి జరిగినది? చెప్పండి. అయ్యగారు చెప్పిందిగాక మిగిలినది మీరు చెప్పండి. అదేమంటే ఈ అభిషేకమునకు ముందు పరలోకములో ఏర్పాటు జరిగింది. **ఏర్పాటు లేనిదే అభిషేకమురాదు. అక్కరలేనిదే అభిషేకమురాదు.** పరలోకములో ఏర్పాటు ఉంటేనేగాని భూలోకములో అభిషేకముండదు. ఇది సౌలుకథ.

తర్వాత దావీదు కథ వస్తుంది. సౌలు పరిపాలన అయిపోయింది గనుక క్రొత్తరాజు కావాలి. దావీదుకు ముందు సౌలే క్రొత్తరాజు. సౌలు తర్వాత దావీదు మరింత క్రొత్తరాజు. యేసుప్రభువు ఒక మాట అన్నారు. 'శిష్యులారా! మీరుప్పుడు చేపలు పట్టేజాలరులు. అయితే, నేను మిమ్మును మనుష్యులను పట్టే జాలరులనుగా చేస్తాను' అని అన్నారుగదా! ఆ ప్రకారముగానే దావీదును రాజుగాచేస్తాను అని అన్నారుగదా! దావీదు ఇంతకుముందు గొర్రెలను పాలించే పాలకుడుగా ఉన్నాడు. అతడిప్పుడు దేవుని ప్రజలను పాలించువాడుగా మారవలెను ఎందుచేతననగా దేవుని సంఘరాజ్యములో ఖాళీ వచ్చినది గనుక ఆ ఖాళీ పూర్తిచేయుటకు దావీదును అభిషేకించవలెను. దావీదు *దేవుని రాజ్యసంఘ అభిషేకమునకు ముందు గొఱ్ఱెలకాపరిగా* ఉండవలెను. ఈ రెంటికి ముందు దావీదుకు పరలోక ఏర్పాటు ఉండవలెను. అందుచేత దావీదుకు తైలాభిషేకము. 120మంది శిష్యులు యెరూషలేములో కనిపెట్టినప్పుడు, వారికి అభిషేకము కలిగింది గాని అక్కడ తైలములేదు. అక్కడ దైవాత్మయేతైలము. ఈ

Bible Mission HQ Guntur

తైలమే మొదటి తైలము కంటె గొప్ప తైలము. **దేవుని సేవకులందరు తైలాభిషేకము పొందినను దైవాత్మాభిషేకము పొందవలెను.**

నాకు పాదిరిపని ఇవ్వాలని లూథరన్‌వారు పిలువగా నా వల్లకాదు నాకక్కరలేదన్నారు. ఆ తర్వాత త్రిత్వదేవుడు బరంపుర సన్నిధి కూటములో నాకు పాదిరి పనికి ఆర్డినేషను ఇచ్చెను. ఇది 40 సం॥ల క్రిందట సంగతి. 'రాజమండ్రి సంఘముమీద పాదిరిగా ఉండాలంటే నీవు ఒప్పుకోలేదు గనుక అన్ని సంఘములపై పాదిరిగా ఉండడానికి ఆర్డినేషన్ ఇస్తున్నాను' అన్నట్లు ప్రభువు అభిషేకించిరి. ఒక్క సంఘమును పాలించలేనప్పుడు అనేక సంఘాలను పాలించగలనా? తండ్రి ఎట్లు అట్లు అనుకున్నాడో! రాజమండ్రి సంఘమంత చిన్న పెద్దలు అయ్యగారిపేరు చెప్పికోరితే, అప్పటి అధికారులు సిగ్గుపడిరి. ప్రభువా! నీమాట నెరవేర్చుకొన్నావు గనుక నీకు స్తోత్రము.

ఇప్పుడు ఎక్కడైనా పాదిరిగారు లేనప్పుడు నేను బాప్తిస్మము, ప్రభువు భోజనము ఇవ్వవచ్చును. మనిషి నన్ను అభిషేకించలేదుగాని దేవుడే నన్ను అభిషేకించెను. నేను ఆత్మద్వారా అందరికి, అనేకమందికి కనబడుచున్నాను. ఇక్కడ వరండామీద కూర్చున్న వారిలో 52మందికి వారివారి ఊళ్లలో కనబడుచున్నాను. గనుక నేను నిన్ననేక సంఘాలకు అభిషేకించుచున్నాననేది దీనిద్వారా నెరవేరుచున్నది. తక్కిన వారి అభిషేకముకంటె నా అభిషేకము (అయ్యగారిది) విద్దూరముగా ఉన్నది.

ఈ ఆత్మసంచార స్థితి మొదట విన్నప్పుడు అయ్యగారికి గుండె గుబేలుమన్నది. చెప్పులు, గొడుగు, క్రొత్త బట్టలు, చేతిసంచి లేకుండ, స్నానము చేయకుండనే పరిశుద్ధముగా తండ్రి నన్ను అన్నిస్థలములకు పంపుచున్నారు. ఇందులో నా స్వశక్తి కొంచెమైనను

లేదు. నాకట్టె మంచముమీదే ఉన్నదిగాని సర్వదేశాలకువెళ్ళి, నా ఆత్మ సంచారము చేయుచు వస్తున్నది. ఒక్క నిమిషములో ఏడు స్థలాలకు నీ ఆత్మ వెళ్లి వస్తున్నది అని ప్రభువు చెప్పిరి. భూలోకములో, పరలోకములో, పాతాళములోనికి **ప్రభువు నన్ను తీసికొని వెళ్లుచున్నారు. నేను వెళ్లుటలేదు.** ఈ దినము ఈ మీటింగుకు రావడము నాకు ఇష్టములేదు. కారణము ఏమనగా కారు ఎక్కుట దిగుటలో, నా గుండె కదలి, నా కడుపులోనికి దిగిపోవుచున్నట్లున్నది. అందునుబట్టి నా శరీరము వణకుచున్నది. చంటిబిడ్డను ఎత్తుకొన్నట్లు నన్నిద్దరు ఎత్తి కారులో పెడుతున్నారు. ఇది వృద్ధాప్యమువల్ల కలిగిన అసౌకర్యము. ఇట్టివాడనైన నేను దేశసంచారము చేయలేను అని, ప్రభువు నన్ను ఈ రీతిగా అనేక దేశములకు తీసికొని వెళ్లి పనిచేయించుచున్నాడు. నాకు కునికిపాట్లు వస్తున్నవి. దీనిలోనే ఆయన నన్ను తీసికొనివెళ్లుతున్నారు. నేను కుర్చీలో ఉన్నపుడు, భోంచేయునపుడు, ప్రసంగించునపుడు ప్రభువు నన్ను తీసికొని వెళ్లుచున్నారు. ***ఆయనశక్తికి ఏమి ఆటంకము!*** నేను క్రమముగా అసలు పనిలోనికి, అసలుగదిలోనికి, అసలు జ్ఞానములోకి వస్తున్నాను. అది నా పనికాదు, నావశముకాదు, నా మిషనుకాదుగాని పరలోకములోని దేవుని ఏర్పాటు. అదిలేకపోతే భూలోకములో ఏమియు జరుగదు.

ప్రార్థన:- అంతములేని కృపగల దేవా! నీకు స్తోత్రము. మేమెందుకును పనికిరానివారమైనను, అన్నిటికి పనికివచ్చే నిమిత్తమై మమ్ములను శ్రమలద్వారా, సౌఖ్యాధారములద్వారా సిద్ధపరచుచు శుద్ధిపరచుచున్నందులకు వందనములు. తనకు ఎక్కువ సమయము లేదని సాతాను విశ్వాసులమీద పడుచున్నాడు గనుక అతని

ఆలోచనలు అతని ప్రయత్నములు నెరవేరనీయకుము. అతని పన్నాగములు చెడగొట్టుము. యూఫ్రటీస్ నదిదగ్గర నాలుగు భూతములను నీవు బంధించినావు. అలాగే ఇప్పుడును లోకమందంతట తిరుగుచున్న భూతముయొక్క పనులు బంధించుము.

ఈ మధ్య గుంటూరులో ఒక విశ్వాసురాలు సన్నిధికి వెళ్లు సమయములో, మైకముకమ్మి, ఏలాగు వెళ్లవలెనో, ఏ ప్రక్కకు వెళ్ళవెలెనో తెలియలేదు. అదే పిశాచిపని. ఈ మధ్య చీరాలలో మైకము కలిగి బంధన కలిగినది అది పిశాచిపని. ప్రభువా! నీవు మా ప్రార్ధనలు వింటానని అన్నావుగదా! ఇట్లు పిశాచి మాలో ఎవ్వరికిని మైకము కలుగజేయకుండ వాడి పనికి ఆటంకము కలుగజేయుము. ఈరాత్రి దుష్టులు వర్షము, పిడుగులు, ఉరుములు, మెరుపులు, పురుగులు తప్పుడు దర్శనములు, దుష్టస్వప్నాలు, భూతములు, దయ్యములు మా శరీరానికి, జ్ఞానానికి, ఆత్మకు, మనస్సాక్షికి, భక్తికిగాని ఏమియు హాని కలుగజేయకుండ నీ దూతను కావలిగా ఉంచి, సుఖ నిద్ర కలుగజేయుమని ఈ కూటము అంతటిని దీవించుమని, ప్రయాణికులకు ఇండ్లకు వెళ్లువారికి తోడైయుండి, మమ్మును రాకడకు సిద్ధపర్చుమని ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.[1]

1. 10.8.1959వ సం॥ దేవదాసు అయ్యగారు గుంటూరు క్రీస్తు సంఘములో చేసిన ప్రసంగము.

# 7. ఈకాబోదు

## 1సమూ. 4:21; మత్త. 26:14-25; ప్రక. 19:1-4.

దైవారాధన పరులైన విశ్వాసులారా! రాకడ వరకు ప్రతి ఆదివారము ఈలాగు కూడుకొనగలిగితే మహిమకు సిద్ధపడగలము. గనుక అట్టి సిద్ధబాటును ప్రభువు మీకు నేటిదిన వర్తమానము ద్వారా దయచేయును గాక. ఆమేన్. ఈ అధ్యాయములో ఇశ్రాయేలీయుల శత్రువులైన ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధముచేసిరి. ఇశ్రాయేలీయులు ఓడిపోయిరి. అనేకులు హతులై పోయిరి. ఇందువలన అపజయమునకు కారణము తెలిసికొని, షిలోహులోనున్న మందసము పెట్టె తెచ్చిరి. ఇది తీసికొని రాగానే గొప్ప స్తుతిగానము చేసిరి. ఈ గానము శత్రువులు విని భయపడిరి. కారణము ఇశ్రాయేలీయుల దేవుడు శూరుడు అనియు, అన్ని విధముల వారికి (ఇశ్రాయేలీయులకు) జయము అని తలంచిరి. ఈలాగు ఇశ్రాయేలీయులు ధైర్యపడి, మరలా రెండవసారి యుద్ధమునకు వచ్చినపుడు ఫిలిష్తీయులే జయము పొందిరి. దేవుని మందసము పెట్టె పట్టబడెను, అనేకులు హతులైరి. ఈ వార్త యాజకుడైన ఏలీకు వినబడెను. ఇతడు చాలా వృద్ధుడు. ఆయన అధైర్యముతో ఉండగా, ఈ వార్త అంతయు అనగా ఆయన కుమారులు యుద్ధములో చనిపోవుటయు, మందసము పట్టబడెననుమాట వినగానే, ఆయన ఊరి గవినిద్వారపు పీఠమునుండి వెనుకకుపడి చనిపోయెను. గర్భవతియైన ఆయన కోడలుకూడా ఆ వార్త విని చనిపోవు సమయములో 'ఈకాబోదు' అను కుమారుని కని చనిపోయెను.

దీని అర్థము ఇశ్రాయేలీయులలోనుండి ప్రభావము వెళ్లిపోయెను. దీనిలోని అనుభవము ఏదనగా, ఈ అధ్యాయమంతా తీర్పుభాగములు, శిక్షభాగములు కలవు.

1. ఇశ్రాయేలీయులు యుద్ధమునకు వెళ్ళిరి. 2. మందసము పెట్టె తెప్పించవలెనని కోరిరి. 3. మందసము రప్పించుకున్నారు (1సమూ. 4:4-8) 4. పెట్టె రాగానే ధ్వని చేసిరి. 5. ఇట్లుచేయుట వలన ఫిలిష్తీయులకు భయము పుట్టించిరి. ఇవన్నియు మంచి కార్యములే, వీటిని ఇశ్రాయేలీయులు చేయగలిగిరి. ఈ చరిత్ర మంచిదే కాని వారు వెంటనే త్వరపడి ఓడిపోయిరి. మొదట 4వేలమంది, తరువాత 30వేలు హతులైరి. వీరు ఫిలిష్తీయుల యెదుట తమ దేవుని తెలిసికొనేటట్లు చేసిరి. తమ దేవుడు శూరుడని వారు మెచ్చుకొనేటట్లు చేసిరి. మరి ఫలితము ఈలాగున ఎందుకు కలిగెను? ఇశ్రాయేలీయులు యుద్ధమునకు వెళ్లిరి. పాలస్తీనా దేశమును ఆక్రమించు సమయములో 'మీరు ధైర్యముతో మోషే- యుద్ధము చేయండి, లేకపోతే మీకు జయముండదని చెప్పిన దైవాజ్ఞ ప్రకారము చేసిరి. అయితే వారనుకున్నారు- మందసము పెట్టిలో ఉన్నది 1) 10 ఆజ్ఞలు గల పలకలు అనగా దైవాజ్ఞలు పెట్టుకొనిరి. ఇంకా అందులో (2) మన్నా ఉండును, ఇది విశ్వాసులైన మన పితరులకు అరణ్యములో ఇశ్రాయేలీయులను పోషించినది. ఇది విశ్వాసులైన వారందరిని పోషించుటకు ముంగుర్తైయున్నది. (3) చిగురించిన అహరోనుకర్ర- దేవుడు మనకు తోడైయున్నాడని అర్థము. ఇది, విశ్వాసులైనవారికి శ్రమలో ఆదరణకు ముంగుర్తు అయియున్నది.

ఇట్టి ముంగుర్తుగల పెట్టెనేకాక ఇశ్రాయేలీయుల దేవుడు మన దండులోనికి వచ్చెనని గ్రహించిరి. చెప్పుకున్నారుకూడా! చిగిర్చిన కర్ర అనగా తండ్రి విశ్వాసులను వాక్యముద్వారా అనేక విధములుగా ఆదరించెను. అయితే, ఇంకొక అర్ధము ఏదనగా, విశ్వాసులు శ్రమలలో నిరుత్సాహపడి ఎండిపోయిన సమయములలో శోధనద్వారా వారిని బలపర్చి చిగురింపజేసెను.

**ఇశ్రాయేలీయులు మందసమును రప్పించుకొనిరి:-** వారు ఈ మందసముయొక్క మహత్యము ఎరుగుదురు గనుకనే కోరుకొనుట మాత్రమేగాక తెప్పించుకొనిరి. తేగానే సంతోషించిరి. ఈ విధముగానే దైవ గ్రంథమును మనము కోరుకొనుట మాత్రము చాలదు, పఠించవలెను. జయము రాకముందే జయమని గానముచేసిరి. మంచి విశ్వాస లక్షణముగల క్రియలను చేసిరి. చైనా దేశములో క్రైస్తవులకు శ్రమలుగల సమయములో క్రైస్తవులందరు మాట్లాడుకొని ప్రార్థన చేయుటకు గుడికి వెళ్లిరి. ఈ సంగతులన్నియు శత్రువులు చూచి. విరోధంగా చేయవలసిన పనులు ఎన్ని చేసినను వారు ఓడిపోయిరి. అయితే ఈ కథలో ఇశ్రాయేలీయులు అనేకులు చనిపోయిరి. దేవుని మందసము పట్టబడెను. ఈకాబోదు అనగా ఇశ్రాయేలీయులనుండి ప్రభావము వెళ్ళిపోయెను. దీనినిబట్టిచూస్తే ఇశ్రాయేలీయులు ఈ మంచి పనులు చేసినను కీడు వచ్చెను. క్రైస్తవ విశ్వాసులకుకూడా ఈ విధంగా జరుగవచ్చును గనుక జాగ్రత్తపడవలెను. జయము రాకముందే జయము అన్నారు కాని అపజయము కలిగెను. దీనినిబట్టి చూస్తే మనము ఎన్ని పనులు చేసినను ఏదోయొక

లోపముంటే అపజయము కలుగుతుందని గ్రహించవలెను. ఈకాబోదు అనుమాట బైబిలు చరిత్ర అంతటిలోను విచారకరమైన సంగతి. ఇక్కడ ప్రభావము వెళ్లిపోయెను. అలాగే గెరాసేనీయులు ప్రభువును తమ ప్రాంతము నుండి వెళ్లిపొమ్మనిరి. కాని ప్రభువు వారియొద్దకు వెళ్ళి కృపచూపెను. బాగైనవానిని వారికే మిషనెరీగా పంపెను. ఇశ్రాయేలీయులలోనుండి మహిమ పోయెను. అనగా దేవుడే వెళ్లిపోయెను. దీనినిబట్టి విశ్వాసులు, తండ్రి ఇచ్చిన ఆత్మీయ ఆశీర్వాదములు పరీక్షించుకొనవలెను. 1. నేనేమి పోగొట్టుకున్నాను! 2. ఏమి నిలుపుకున్నాను! అని పరీక్షించుకొనవలెను. ఆ పరీక్షయొక్క తీర్మానము ఏమిటనగా పోగొట్టుకుంటే (ఎ) ఆశీర్వాదము సంపాదించుకొనవలెను. (బి) ఆశీర్వాదము నిలుపుకొని ఉంటే వృద్ధి చేసికొనవలెను. ఏర్పాటు జనాంగమైన ఇశ్రాయేలీయులలో దేవునిని ఎరిగినవారు, దేవునిని ఎరుగనివారును ఉన్నారు. దీనినిబట్టి చూస్తే క్రీస్తు జనాంగములలోకూడా అట్టివారు ఉన్నారు. ఈలాగుంటే వారికి కీడు కలుగును.

ఈ అధ్యాయముయొక్క స్వరము:- ఏ చిన్న లోపమున్నను అపజయము కలుగును. ఈ అధ్యాయమంతా విచార చరిత్రయేగాని 'కుమారుడు నూతనముగా జన్మించెను' అను సంతోషవార్త ఉన్నది. చనిపోయినవారు చనిపోగా నూతనముగా వచ్చేవారు ఉంటారు. ప్రయాణ సమయములో ఇశ్రాయేలీయులు అరణ్యములో రాలిపోయిరి. విధేయులు వాగ్దాన దేశము చేరగలిగిరి. ఇశ్రాయేలీయులలో నుండి ప్రభావము పోయెను అనగా వారిని

పాడుచేయడానికి వెళ్ళిపోయెను (ఒకరిని పాడుచేయుటకు, మరొకరిని బాగుచేయుటకు). కాని ప్రభువులోనుండి మహిమ పోయినదనగా ఎవరినో బాగుచేయుటకు వెళ్లెను. దీనినిబట్టిచూస్తే విశ్వసించితే, నమ్మితే, ప్రార్థిస్తే, ప్రభువు ప్రభావము విశ్వాసులలోనికి వచ్చును. అనగా వారిని బాగు చేయుటకు వచ్చును.

ఏదేనుతోటలోని మహిమను ఆదాము, హవ్వలు పాపముచేసి పోగొట్టుకొనిరి. ఆది మహిమను పోగొట్టుకొనిరి. తరువాత మరలావచ్చు మహిమ వేరుగా నుండును. ఈ సంగతులు మేము మహిమకు సిద్ధపడవలెనని నీ గ్రంథములో వ్రాయించినావు స్తోత్రములు ఆమేన్.

ఆలాగు నీ మహిమ రాకడకు, మహిమను నిలుపుకొన్న వధువుగా సిద్ధపడగల ధన్యత నేటిదిన వర్తమానముద్వారా పెండ్లికుమారుడు మీకు దయచేయునుగాక. ఆమేన్.[1]

1. 26.1.1947వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో చేసిన ప్రసంగము.

# 8. కానుకల పండుగలోని కానుకలు

**ఆది. 4:1-5; మార్కు. 12:41-44; 2కొరింథీ. 9:5-8.**

కోతపండుగ, చందాపండుగ, కానుక పండుగ, అర్పణల పండుగ ఆచరించుటకై కూర్చున్న ప్రియులారా! మీ అందరకును ఈ పండుగయొక్క సంతోషము కలుగునుగాక.

కోతపండుగ, కానుకపండుగ, చందాపండుగ, అర్పణల పండుగ, కృతజ్ఞతపండుగ అను పేరులుగల ఈ పండుగను ఆ పేరులకు తగినరీతిగా ఆచరించుటకై నేను చెప్పుమాటలు ప్రవేశించు నిమిత్తమై మీరు మీ హృదయములలో మీ హృదయములు విప్పి మనో నిదానముతో వినండి.

త్రియేకదేవునికి మహిమ; మనకు రక్షణ; దేవుని రాజ్యమునకు అభివృద్ధి; సైతాను రాజ్యమునకు నాశనము కలుగునుగాక. ఈ పండుగరోజున రెండు పండుగలు. ఈ పండుగ రోజున ఇద్దరి పండుగలు (అనగా మన పండుగ, దేవుని పండుగ).

1) మనము చేసే పండుగ అనగా సంతోషముతో చేసే ఈ పండుగ.

2) మనము ఇచ్చేకానుకలు కృతజ్ఞతతో, సంతోషముతో ఇస్తే అది పరలోకములో ఉన్న దేవునికిపండుగ. మనము పుట్టక ముందే, అన్నీ కలుగజేసి, మనముపుట్టిన తరువాత మనకనుదినము ఇస్తున్న కానుకల నిమిత్తమై, ఆయన చేసే పండుగే రెండవ పండుగ. మనము తిరిగి దేవునికి ఇస్తే, అప్పుడు ఆయనకు మనకు పండుగ. అనుదినము గాలి, ఎండ, వేడి, నీరు ఆయన ఇస్తే అది మనకు పండుగే ఎప్పుడనగా మనము గ్రహించి తెలిసికొనపుడు. యెడల గనుక మీకెన్ని పండుగలు జ్ఞాపకము చేయుదునో అవన్ని జ్ఞాపకము ఉంచుకొనండి.

మొట్టమొదట దేవుడు మనకు రెండు కానుకలు ఇచ్చిరి. మనము పుట్టకముందే, వాటిని మనకు ఇచ్చివేసి, ఇంకా తీసికొనలేదు. మనము అవి అనుభవిస్తునే ఉన్నాము. అవి 1) ఆకాశము, 2) భూమి. భూమ్యాకాశములు దేవుడు మనకు ఇచ్చిన గొప్ప కానుకలు. సూర్యకాంతి, వర్షము, ఆకాశమునుండియే వస్తున్నవి. 2. భూమినుండి ఫలవృక్షాలు, పంటలు వస్తున్నవి గనుక దేవుడు ఇచ్చిన ఈ రెంటి విషయమై కృతజ్ఞత చెల్లించవలెను. ఈ వేళ ఇంకా ఎక్కువ చెల్లించవలెను.

**2వ కానుక:-** ఇదియు దేవుడిచ్చినదే. ఇది మొదటి రెండిటికంటె గొప్పది. ఆయన మాటలుగల బైబిలుగ్రంథమే, ఆ కానుక, ఇది భూమ్యాకాశములను గురించికూడా బోధించుచున్నది. ఇది చదివినప్పుడే భూమ్యాకాశములయొక్క వివరములు తెలియుచున్నవి. చదవకముందు గ్రహింపు ఉన్నదిగానీ, బైబిలు చదివితే వాటి పూర్తి వివరములు తెలియుచున్నవి. 1) భూమి యాకాశముల కానుక గొప్పదా? వాటిని గురించి బోధించు బైబిలు కానుక గొప్పదా? బైబిలు కానుకే గొప్పది.

**3వ కానుక:-** మొదటి రెండు కానుకలకంటె, బైబిలు గ్రంథ కానుకకంటె మూడవది ఇంకా గొప్ప కానుక. ఇయ్యగా ఇయ్యగా ఇంకా గొప్ప కానుక దేవుడు ఇచ్చెను ఇయ్యగా ఇయ్యగా, ఆయన ఇంకా గొప్పవి ఇస్తునే వస్తున్నారు. ఇది పాత ప్రసంగమైననూ పండుగ వంకమీద క్రొత్తదిగా చెప్పుచున్నాను. దేవుడు ఇచ్చేవాటిలో మూడవది. ఏ కానుకయైననూ దేవుడిచ్చుట, మనము పుచ్చుకొనుటయై యున్నది. మనము పుచ్చుకొని దేవునికి కానుక ఇచ్చే పండుగయే ఈ కానుక పండుగ. ఆ మూడవ కానుక ఏనదగా అసలు దేవుడే మన మనిషియై మన కానుక అయిపోయినాడు గనుక అన్ని కానుకలకంటె ఆయన గొప్ప కానుక. మనము ఆ కానుక విలువను గ్రహించలేము.

ఒక ఆవును ఎంత మంత్రించినను, పక్షికాదుగాని దేవుడు మన మనిషిగా మారిపోయినాడు, మనకు కానుకగా ఏర్పడినాడు ఇదే క్రిస్మసుపండుగ. అది జ్ఞాపకముచేసికొని, ఈ కానుకల పండుగ, అర్పణల పండుగ కృతజ్ఞత పండుగ చేస్తున్నాము.

**4వ కానుక:-** దేవుడిచ్చే కానుక, మనము అందుకొనే నాలుగవ కానుక ఏదనగా, పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఇంతకుముందు కుమారునిచ్చినది మూడవది. ఇది నాల్గవది అనగా పరిశుద్ధాత్మనిచ్చిన పండుగ. యేసుప్రభువువారు ఆరోహణమైన తరువాత 120మంది మేడగదిలో ఆత్మకొరకై ప్రార్థించగా ఆత్మను ఇచ్చినది నాల్గవ కానుక పండుగ. ఈ కానుకద్వారా వచ్చే కానుకలు, వరములు అనేకములు. అవి మన అనుభవములో ఉన్నవి.

1) భాషలతో మాటలాడుట, 2) భాషార్ధము చెప్పుట,

3) రోగులను స్వస్థపరచుట. ఇవన్నీ ఈ నాలుగవ దానినిబట్టి వచ్చినవి. ఓహో ఇవి చాలా ఉన్నవి. ఈ నాలుగు తలంచి కృతజ్ఞత గలిగి కానుక ఇచ్చే వారే, నిజముగా కానుక పండుగ చేసేవారు.

**5వ కానుక:-** ఈ కానుక ఆయన ఇంకా ఇవ్వలేదు. అదేదో తలంచండి. ఈ అయిదేకాదు ఇంకా ఉన్నవి అవి బాగా తెలిసికొనవలెను. అవి మనవద్దకు రాలేదుగాని వాటికొరకు ఎదురుచూస్తున్నాము. అదే ఆరోహణ కానుక. ఎవరు రెండవ రాకడకు సిద్ధపడుతున్నారో అది వారు పొందు కానుకే, ఆరోహణ కానుక. ప్రభువు మధ్యాకాశములోనికి వచ్చి సిద్ధపడిన వారిని తనయొద్దకు ఆకర్షించుకొనును. పై నాలుగు అందుకొన్న వారున్నారు. అయితే, వీరిలో రాకడకానుక అందుకొనేవారుంటే ఉంటారు లేకపోతే ఉండరు. ఈ ఐదవ కానుకకు సిద్ధపడుట కష్టము.

1. పాపవిసర్జన, 2. రక్షణ పొందుట (కష్టము),

3. ప్రభువుతో వెళ్ళుటకు సిద్ధపడుట. ఈ మూడును చాలా కష్టము. మిగిలిపోయిన వారిగతి ఏమి అనగా, రాకడకు వెళ్లక పోయిననూ రక్షణపొందినారు గనుక చనిపోయి మోక్షానికి వెళ్లుదురు. ఆరోహణము ఇచ్చేవరకు ఉగ్గబట్టి ఉండలేక చనిపోయిరి. ఇన్ని కానుకలు అనుభవించిన ప్రియులారా! పై నాలుగింటికి సిద్ధపడినట్లు ఐదవ దానికిని సిద్ధపడండి. సిద్ధపడినవారిలో ఈ విషయాలు వింటున్న మనమును చేరాలి ఇప్పటికాలేదు అనగా సిద్ధపడలేదు. ఇకముందుకైన వస్తారా (సిద్ధపడతారా?) వస్తామా అనుసందేహముంటే అయిదవది అనగా ఆరోహణ కానుక అందుకొనలేము అదిచాలా ఆటంకము. 'త్వరగా వస్తానన్నారు. నేను సిద్ధపడతాను' అని నమ్మి సిద్ధఫడువారే రాకడలో వెళ్లువారు. మొదట నాలుగు కానుకలు ఆయన ఇయ్యడము నిజమైతే, ఐదవది మాత్రము ఎందుకు నిజముకాదు! అట్టివారే సిద్ధపడి రాకడలో పాలుపొందుదురు. ఇప్పుడు చెప్పిన కానుకలు అన్నిటికంటె మించినవి ఎవ్వరు ఇయ్యగలరు? ఎవ్వరూ ఇవ్వలేరు మనమెవరమూ ఇయ్యలేము, ఇయ్యడానికి లేవు లేవు. ముందు ఆయన ఇచ్చిన నాల్గింటికిన్ని నీ హృదయములో స్తుతిచేస్తే, వాటితో సమానకానుక నీకున్నట్టే. నీ విచ్చినట్టే. ఈ ఐదు కానుకల నిమిత్తమై కృతజ్ఞతతో కానుకలు ఇయ్యండి మరి.

ఆయన ఇంకా ఐదవది ఇయ్యలేదు గాని మార్కు. 11:24లో ఉన్నట్లు లేకపోయిన ఉన్నట్టే అని భావించి ఇస్తే, మనకు ఆయనకు సంతోషమే.

దీవెన:– షరా! ఈ దీవెన రాకడలోకి వెళ్లేవరకు కూడా వస్తూనే ఉండును గనుక ఆయన ఇచ్చిన ఈ కానుకలేకాక ఈ కానుకలవలన ఇంకా ఇచ్చే దీవెన పొందుటకు మీ కానుకలు చెల్లించండి అట్లు చెల్లించుటకు దేవుడు మీకు కృప దయచేయునుగాక. ఆమేన్.[1]

1. 8.3.59వ సం॥ దేవదాసు అయ్యగారు బేతేలు గృహములో చేసిన ప్రసంగము.

# 9. కానుకల పండుగలోని ఆనందము

**ఆది. 4:3-5; ఆది. 14:22-24; 2దిన. 31:10; మలాకీ 3:10; మార్కు. 12:41-44; లూకా. 21:1-4.**

1కొరింథీ. 16:1-6 2కొరింథీ. 8:1.

నిండిన చేతులతో వచ్చిన కానుకలపండుగ ఆరాధన పరులైన వారలారా! మీకు శుభము కలుగునుగాక! నిండి నిండని చేతులతో వచ్చిన వారు ఉంటే, వారికికూడా వారికి తగిన శుభవచనము అందునుగాక! మిక్కిలి ఇష్టముతో, కృతజ్ఞతతో కానుక ఇచ్చే వారికి హేబెలుయొక్క కానుక అంగీకారమువంటి అంగీకారము కలుగునుగాక!

ఇప్పుడు పాతనిబంధనలో ఉన్న కానుకలనుగూర్చి, క్రొత్త నింబంధనలో ఉన్న కానుకలనుగూర్చి మరీ పరీక్షించితే కొన్ని విషయములు తేలుచున్నవి. మొదటి విషయము;

1) స్వంత ఇష్టమునుబట్టి ఇచ్చిన కానుక,

2) దైవాజ్ఞనుబట్టి ఇచ్చిన కానుక,

3) దైవ వాగ్ధానమునుబట్టి ఇచ్చిన కానుక;

4) లేమిలో ఇచ్చిన కానుక,

5) శక్తికొలది ఇచ్చిన కానుక,

6) శక్తికిమించి ఇచ్చిన కానుక,

7) ఆదివారపు చందా, దానికి అసలే వివరము లేదు. అనగా ఆదివారము ఇంత చందా ఇవ్వవలెనని లేదు. బైబిలులో ఈ 7 రకములైన కానుకలు చెల్లించుట కనబడుచున్నది. కానుకలను గురించి బైబిలులో ఉన్న విషయములన్నింటిని చేర్చితే, చాలా పెద్ద పుస్తకమగుచున్నది.

ఈ కానుకలను గురించి విడిచిపెట్టి గడిచిన రెండువేల సం॥ములలో క్రైస్తవ సంఘమునందు 1) విశ్వాసులు, 2) అవిశ్వాసులు ప్రోగుచేసిన కానుకలవల్ల ఎంత సువార్తపని జరిగినదో చూస్తే చాలా ఆశ్చర్యము కలుగుచున్నది. నాకు ఒక ఆలోచన తోచినది. సంవత్సరమునకు ఒకమారు సంఘము అంతయు గుడిలో కూడుకొని ఐదు, ఆరు దినములవరకు ఈ కోతపండుగ చేయవలెను. ఆ పండుగ చేసేటప్పుడు ఈ 7రకముల అంశములు గురించి ఒక్కొక్క దినమున ధ్యానించుచు, వివరించుకొంటూ, దానికి సంబంధించిన పాటలు పాడుకొంటే ఏమి జరుగుననగా సంఘములోనున్న పేదలు భాగ్యవంతులౌదురు. దేవునికి ఇచ్చినందున పేదలు లేరుగాని, ఇచ్చి భాగ్యవంతులైనవారు చాలామంది ఉన్నారు. దేవునికి ఇచ్చిన తరువాత తృప్తిగా భోజనంచేసినవారున్నారు. మాకు కొదువ వచ్చినది అనువారు లేరు. అప్పుడు ఋణబాధ ఉండదుగాని ఆస్థి ఉంటున్నది. తినగా వారికి ఇంకా మిగిలి యున్నది. ఈ సంగతులు తిరిగి తిరిగి వివరించినందున ఆత్మకు శాంతి కలుగును. మీకు మొదట చెప్పిన ఈ ఏడు అంశములను వివరించను. చెప్పిన ఈ ఏడుకాక రెండు అంశములు ఉన్నవి. దానిలో మొదటిది ప్రాముఖ్యమైనది. నేను క్రొత్తగా చెప్పేది, మీరు ఇచ్చేది ఏదనగా, మీ స్వంత ఇష్టాను సారముగా ఇవ్వండి.

బైబిలులో స్వంత ఇష్టముతో ఇచ్చినవారు ఇద్దరున్నారు. అనగా చందా ఇవ్వాలని దైవాజ్ఞ పుట్టకముందే సొంతముగా ఇచ్చినవారు ఇద్దరున్నారు. వారిరువురిని చూచి మీరు ఏలాగు కానుకలిచ్చారు? అని అడిగితే, వారు ఏమని చెపుతారంటే, 'దేవుడు మాకు కానుకలియ్యండి అని చెప్పలేదు, దేవునికి ఇయ్యవలెనని మా

ఆత్మలో మాకే ప్రేరేపణ పుట్టినది' అని అంటారు. దేవునికి ఇవ్వవలెనని వారికే తోచినది. ఈ కాలంలో బోధకులు 'పండుగకు కానుకలు ఇయ్యండి' అని అనేకమార్లు బోధించినప్పటికిని, మనఃస్ఫూర్తిగా ఇచ్చే వారు తక్కువమంది చేతులతో నిండైన కానుకలు ఇచ్చేవారు బహు తక్కువ. ఆ హేబేలు తన స్వంత ఇష్టంతో ఇచ్చినాడు. తన స్వంత మందలోని గొర్రెపిల్లను ఇచ్చినాడు. ఇతరులు తనకు ఇచ్చినది కాదు. తాను సంపాదించిన దానిలోనిది ఇచ్చెను తనది ఇచ్చినాడు. 1) తన ఇష్టముతో ఇచ్చెను 2) తనకున్న దానిలో శ్రేష్టమైనది ఇచ్చెను. అదే అసలైన కానుక. ఈ దినమందు ఈ మూడును కల్గి, ఇష్టంతో శ్రేష్టమైనది ఎవ్వరు తెచ్చినారో, అది హేబెలు కానుక వంటిదని సంతోషించగలరు అదే అంగీకారపు కానుక.

రెండవ ఆయన ఎవరనగా ఆదికాండము 4వ అధ్యాయములో ఉన్న హేబేలు దగ్గరనుంచి ప్రయాణమైవస్తే ఈ రెండవ ఆయన ఉన్నాడు. ఆయనే అబ్రాహాము. అబ్రాహాముగారు తన రాబడిలో దశమభాగము దేవునికి ఇచ్చెను. 10వ భాగము దేవునికి ఇచ్చెను ఈ 10వ భాగము ఇవ్వాలని దేవుడు అబ్రాహాముకు చెప్పలేదు. వారికి తోచినందువల్ల వారంతట వారే ఇచ్చిరి. ఈ 10వ భాగము అనే మొదటి ఆ కానుక ఆదికాండము 14వ అధ్యాయము చివరి భాగములో కనిపించుచున్నది. 14వ అ॥ మొదలుపెట్టి ఈ దశమ భాగము పాతనిబంధన చివరి పుస్తకమైన మలాకీ గ్రంథమువరకు వెళ్లినది. అయితే మలాకీ తర్వాత వచ్చిన క్రొత్తనిబంధనలో దశమభాగము అనేమాటలేదు. ఆదికాండములో హేబెలు దగ్గర మనసులో ఉన్న స్వంత ఇష్టము, అబ్రాహాము మనస్సులో ఉన్న స్వంత

ఇష్టము; ఈ రెండు స్వంత ఇష్టములకు సంబంధించిన అర్పణలు క్రొత్త నిబంధనలో ఉన్నవి.

ఎంత ఇచ్చిననూ స్వంత ఇష్టముతో ఇవ్వకపోతే పేరులేదు. 1) ఒకరు చెప్పగా ఇస్తే, 2) ఆజ్ఞప్రకారం ఇస్తే, 3) ఇష్టములేకుండా ఇస్తే ఆ కానుక ఆచాల గొప్పగా ఉండవచ్చునుగాని అది కానుక కాదు. అటువంటి కానుక హేబేలు యొక్క గొప్ప కానుక వంటిదైనప్పటికిని అది దేవునికి అంగీకారం కాదు. అబ్రాహాము దశమ భాగము ఇచ్చినంతటి గొప్ప కానుక అయినప్పటికిని, అది మెచ్చుకొనదగిన కానుక కాదు. పాతనిబంధనలో యూదులకు దేవుడు కానుకలను గూర్చిన ఆజ్ఞ ఇచ్చినాడు. దేవుడు ఎందుకు అట్టి ఆజ్ఞ ఇచ్చినాడంటే, యూదులు అప్పటికి చిన్నపిల్లలువంటివారు, అనగా జనాంగములన్నిటిలో యూదులు చిన్న జనాంగము. వారిని చిన్నపిల్లలను తల్లిదండ్రులు ఏలాగు చూస్తారో, దేవుడు వారిని ఆలాగే చూచినాడు. ఏలాగంటే, 'నాకు ఇంత చందా వేయండి అని నేర్పను'. తల్లిదండ్రులు తమపిల్లలను తీసికొనివెళ్లేటప్పుడు 'ఇంత చందావేయండి' అని పిల్లల చేతిలో కానుకపెట్టి నేర్పించుచున్నారు. అలాగే యూదులకు చందానుగూర్చి నేర్పుటకు దేవుడు దశమ భాగమును చూపించెను. ఈ చిన్నపిల్లలు పెద్దవారై ఉద్యోగం వచ్చిన తర్వాత తల్లిదండ్రులు వారిచేతిలో ఇక చందాపెట్టరు. అణా॥ చందావేయి, లేదా రూ॥యి చందావేయి అని చెప్పరు. వారు ఇష్టానికి వారిని విడిచిపెట్టెదరు. అలాగుననే క్రొత్తనిబంధనలో దేవుడు తన సంఘమును తన ఇష్టమునకు విడిచిపెట్టెను. వారు ఎంతవేస్తే అంత మాత్రమే నీవు దశమ భాగము ఎందుకు ఇవ్వలేదని అడుగడు.

## కానుకల పండుగ:-

### కానుకలు వేయువిధానము:-

(1) మీకు ఇష్టముంటేనే ఇవ్వండి.

(2) దేవుడు మీకు మేలుచేస్తేనే ఇవ్వండి.

(3) 'ఇకముందుకుకూడ మేలుచేస్తాడు' అని ఉంటేనే ఇవ్వండి

(4) మీకు ఎంత తోస్తే అంతే ఇవ్వండి.

(ఎ) బలవంతముమీద వేయవద్దు. (బి) పాదిరిగారు చెప్పినారని వేయవద్దు (సి) నేను దేవుని ఇచ్చినందువల్ల నా ఆస్థి తరిగిపోవునని అనుకొంటే వేయవద్దు. (డి) దేవునికని అంటారుగాని ఇచ్చినదంతా పాదిరిగారే తింటారు అని మీ మనసులో ఉంటే వేయవద్దు.

(5) మీరు చందావేస్తే ఇతరులకు చెప్పవద్దు, చెప్పుకుంటే దీవెనపోతుంది. (6) చందావేసేటప్పుడు హృదయము కృతజ్ఞతతో నిండియున్నదా లేదా అనిచూచుకొని ఇవ్వండి.

(7) 'ఇంతకంటె ఎక్కువ చందా ఎప్పుడు ఇవ్వగలనో' అనే ఆలోచనతో చందావేయవలెను. అనగా ఇప్పుడువేసే చందాకంటే ఇంకా ఎక్కువగా నా జీవితములో ఎప్పుడు వేయుదునా! అని అనుకొని వేయవలెను. దీవెన:- దేవుడు మిమ్ములను దీవించునుగాక. ఆమేన్.

**ప్రార్థన:-** పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యత అని వ్రాయించిన ప్రభువా! నేటిదిన వాక్యాహార కానుకనుబట్టి నీకు స్తోత్రములు. నీవే మాకు ఆహారమైపోవు కానుకగా వచ్చినావు, అందునుబట్టి నీకు స్తోత్రములు. ఈ దిన వాక్య వెలుగులో మా అంతరంగములను సరిచేసికొని ఇకముందుకు హృదయపూర్వకమైన కానుక అర్పించువారిగా మమ్ములను చేయుమని క్రీస్తుయేసు పరిశుద్ధ నామమున అడుగుచున్నాము తండ్రీ ఆమేన్.[1]

1. 10.3.1957వ సం॥లో దేవదాసు అయ్యగారు గుంటూరు క్రీస్తు సంఘములో చేసిన ప్రసంగము.

# 10. రూపాంతర దర్శన వివరము

## మత్తయి 17:1-8.

క్రీస్తుప్రభువు రూపాంతరమును ధ్యానించుటకు వచ్చిన ప్రియులారా! యేసు పొందిన రూపాంతరమును మీరును పొందుదురుగాక.

నేటి వర్తమానమునకు ముందుగా రూపాంతర కొండను, సీనాయి కొండను మీ ముందు ఉంచుచున్నాను. సీనాయి కొండపై కనబడిన సూచనలు రూపాంతర కొండపై కనబడకపోయినను, ఇక్కడ కేవలము ప్రభువు ఒక్కరే మిగిలిపోయిరి. అదే రూపాంతర సన్నిధి. ఈ రూపాంతర కొండపై-

1. కమ్మిన మేఘము లేదు, 2. పలికిన తండ్రి లేడు, 3. కనబడ్డ మోషే, ఏలియా లేరు, 4. అలుముకొన్న కాంతి లేదు.

ఇవన్నీ పోయినను యేసుప్రభువు ఒక్కడే ఉండిపోయారు. 1. సీనాయి పర్వతము, 2. రూపాంతర పర్వతము. ఈ రెండు పర్వతములకూ దగ్గరి సంబంధమున్నది. ఇక్కడ రూపాంతర కొండపై ఆ ఒకొక్కనినే, అనగా ఆ యేసు ప్రభువునే, ఆ ముగ్గురు శిష్యులు చూచిరి.

షరా:- ఆ కొండమీద రెండు నిబంధనలున్నవి. 1) పాతిబంధన, 2) క్రొత్త నిబంధన.

1. మోషే, ఏలియాలు పాతనిబంధనలోనివారు.

2. పేతురు, యాకోబు, యోహానులు క్రొత్త నిబంధనలోనివారు పాతనిబంధన వెళ్లిపోయినది. క్రొత్తనిబంధన ఉన్నది (అనగా ముగ్గురున్నారు. పేతురు, యాకోబు, యోహానులు). వెళ్ళిపోయిన పాత నిబంధనకును, ఉండిపోయిన క్రొత్త నిబంధనకును మధ్యవర్తిగా యేసుప్రభువు ఉన్నారు. రేపుకూడా మనమధ్యనున్న వారందరుకూడా వెళ్లిపోతే ప్రభువు ఒక్కరే ఉంటారు.

1పాట:- ఎవరుపోయిన-ఏమిపోయిన = యేసునకు యేసెయుండు ఏమి కావలె॥ రూపాంతర కొండకును ఈ కీర్తనకును సంబంధమున్నది. అయ్యగారు నిన్న ప్రభువుయొక్క 3 ½ సం॥ల జీవితములో ఉన్న దేవుని సన్నిధిని గురించి చెప్పినారు. అప్పుడొక కీర్తన పాడించిరి.

2 పాట:- రారే మనయేసు స్వామి అనుపాటలో నది తట మఠ జన పదవనముల స-మ్మద శుభవార్తను - బలికినవాడట అనుభాగము పాడించి ఎఫ్రాయీము మన్యము సంగతి చెప్పిరి. అక్కడి సన్నిధి అన్నిటికంటె గొప్పది. ఎందుకంటే పేతురు, యాకోబు, యోహానులు అనే సంఘము క్రొత్త నిబంధనలో అక్కడ ఉన్నది. అదే క్రొత్త నిబంధన.

ఎఫ్రాయిములో, గలిలయ సముద్రపు దోనెలో, బజారులో, జనపదములో నదిలో, గుడిలో సువార్త ప్రకటించుచున్నపుడు ఈ రెండులేవు. అనగా పాత నిబంధన, క్రొత్త నిబంధనలు లేవు. ఆ సమయములో అంత ప్రకాశతలేదు, మేఘములేదు, తండ్రి స్వరంలేదు, అలుముకున్న కాంతిలేదు. అవన్నీ ఈ కొండపైనే ఉన్నవి. బైబిలు అంతటిలో రూపాంతర కొండపై ఎక్కుడ నోట్సు దొరుకును. బైబిలులో ఇది ఒకటే, అన్నిటికి అన్ని ఉన్న పాఠము.

షరా:- ఇంకా బైలుపర్చబడేవి ఇకను బైలుపడినవి, అన్నీ ఇక్కడే ఉన్నవి. ఎవరైతే ఈ భూమిమీద సన్నిధిలో ఉంటారో, వారు బైటకు వచ్చేటప్పుడు కళతో వస్తారు. కళ అనే పాఠము ఇక్కడ రూపాంతర కొండమీద నేర్చుకొంటున్నారు. పాట:- విలాపములకు చెవినిచ్చెను - శ్రమ కలాపములకు సెలవిచ్చెను.

1. మీరు సన్నిధి కూటమునకు వెళ్లకముందు విలాపముండును అనగా ఏడ్పుండును. 2. సన్నిధిలోనుండి బైటకు వచ్చునపుడు కళావళులుండును. అనగా కళతో వత్తురు= సంతోషముతో వత్తురు.

**రూపాంతర కొండ వివరము:-**

(1) యేసుప్రభువు దేవుని సన్నిధిలో ఉన్నారు. గాని ముగ్గురి సన్నిధిలోలేదు. ఒంటరిగా ఉన్నట్టు ఉన్నారు. తక్కిన సమయములలో ఆయన అందరితో కలిసి ఉన్నారు. ఇక్కడ ప్రభువు ఒక్కరే తండ్రి సన్నిధిలో ఉన్నారు.

(2) ఎఫ్రాయీము అరణ్యములో 12మంది శిష్యులు ప్రభువుయొక్క సన్నిధిలో ఉన్నారు.

(3) ఈ పాఠములో అదికాదు. ఇక్కడ ప్రభువు మరియు ముగ్గురు దేవుని సన్నిధిలో ఉన్నారు. (దైవసన్నిధిలో ఉండు సమయములో నిద్రపనికిరాదు) పేతురు మనమిక్కడుందాము బాగున్నది. పర్ణశాలలు మూడు కట్టుకొందాము అన్నారు. అలాగే మీరు సన్నిధిలో ఉంటే మానివేయుటకు ఇష్టముండదు. ఇంకా ఉంటే మంచిది అనిపించును. కొండమీద కథే మనకును సన్నిధిలో ఉంటుంది, జరుగుతుంది. ఆ కొండమీదకి మహిమ మేఘము వచ్చునట్లు మనకు సన్నిధిలోకి వస్తుంది. రూపాంతర కథ ఇపుడును మనము సన్నిధిలో ఉంటే జరుగుతుంది. ఆ రూపాంతర కొండమీద దర్శనము లేక ప్రత్యక్షత ఉండి ఉండి టక్కున ఆగిపోయింది. ప్రభువు 'ఇకలెండి' అని అన్నారు. మనము సన్నిధికూటముచేస్తే రూపాంతర కొండమీదికి వచ్చినవి అన్నియు మనగదిలో ఉండును.

యేసుప్రభువు ప్రార్థన చేసేకొలది ప్రభువునుంచి వెలుగువచ్చింది. మీరు టార్చిలైటు నొక్కితే వెలుగు వచ్చినట్లు ప్రభువులోనుండి వెలుగువచ్చినది (మత్తయి. 17). యేసుప్రభువు రూపాంతరము పొందెను. ఆ తర్వాత వారికి యేసుప్రభువు తప్ప మరొకరు కనబడలేదు. ఆ కొండమీదికి దిగి వచ్చినవన్ని ఆగిపోయినవి.

మోషే ఎందుకు రావాలి?

జ: 'నేను వ్రాసిన ధర్మశాస్త్ర ప్రకారము లోకములో నీవు ఒక్కడవే నెరవేర్చినావు గనుక నీకు నమస్కారములు' అని నమస్కరించుటకే మోషే కొండమీదికి వచ్చినాడు.

ఏలియా ఎందుకు రావాలి?

జ: రాబోయే సంగతులన్నియు ప్రవక్తలు వ్రాసిపెట్టియుంచినారు. వాటిపేరు ప్రవచనములు. ఆ ప్రవక్తలందరికి బదులుగా ఏలియావచ్చారు. ఎందుకంటే మత్త. 5:17లో ఈ రెండునూ ఉన్నవి. (1) మోషే చేతిలోని ధర్మశాస్త్రమునూ, (2) ఏలియా చేతిలోని ప్రవచనమును ఈ రెండును మత్తయి 5:17లో ఉన్నవి. ధర్మశాస్త్రము నైనను, ప్రవక్తల వచనములైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు. నెరవేర్చుటకే వచ్చియున్నాను. అవి నెరవేర్చినాను అని యేసుప్రభువు చెప్పినారు.

1. అవి నెరవేర్చినారు. 2. ఇవి నెరవేర్చినారు గనుక నమస్కారములు, అని చెప్పుటకే మోషే, ఏలియాలు రూపాంతర కొండమీదికి వచ్చిరి. 1 అవి అనగా ధర్మశాస్త్రము 2 ఇవి అనగా ప్రవచనములు.

ప్రశ్న:- ప్రవక్తల తరుపునా ఏలియా ఎందుకు రావలెను? ఇంకెవరైన రాకూడదా? (లూకా 1:17) ఈ లోకములోనికి 'నేను వస్తాను' అని అనడానికిని, 'ఇదిగో వచ్చాను' అని అనడానికిని తేడా ఉన్నదా? లేదా? ఉన్నది. (వచ్చెను అనునది గొప్పది) అప్పుడు పలికిన ప్రవచనము 'వచ్చెదను' వాక్యములోనికి ఏలీయా వచ్చినాడు. ఏలీయా ఏలియాయే ఆ ప్రవచనముయొక్క నెరవేర్పుగా వచ్చినాడు. (మలాకీ. 4:5). గనుక ప్రవక్తల ప్రతినిధిగా ఏలియావచ్చెను. దేవునియొక్క కృపవల్ల ఈ వాక్యముయొక్క వివరము దేవదాసు అయ్యగారికి చిన్నతనములో అనగా

4వ తరగతిలోనే తెలియబడినది. అయ్యగారికి అది అందుకొనుట కష్టముకాదు. మత్తయి 11:25లో ఈ వివరము ఉన్నది.

ఏలియాలోని ఆత్మ, శక్తి బాప్తిస్మమిచ్చు యోహానులోనికి వచ్చినది. గనుక ఈయన ఏలియా అని ప్రజలు యోహానును అనిరి. ఆత్మశక్తి యోహానులోకి వచ్చినది గనుక ఏలియా వచ్చినట్టే. (తక్కిన ప్రవక్తలు రాలేదు). వారు వచ్చివెళ్ళిపోయారు. ఏలియాకూడా ప్రవక్తగా వచ్చి వెళ్ళిపోయాడుగాని యోహానులోకి మరలా వచ్చాడు. పిదప ఇక్కడ కొండమీదకు వచ్చాడు. గనుక ప్రవచనము పలుకుటకంటె తానే యోహానులోనికి వచ్చుట గొప్పతనము. తక్కిన ప్రవక్తలు పలికి వెళ్ళిపోయారు. ఈ ఏలియా పలికి వెళ్ళిపోయాడు గానీ మరలా యోహానులోనికి వచ్చినాడు. నెరవేర్పుగా వచ్చినాడు. ప్రవచన రూపముగా కొండమీదికి రాలేదు గనుక ఏలియా ప్రవక్తలందరికంటె గొప్పవాడు. ఏలియా ఏ విషయములో గొప్పవాడు? నెరవేర్పు విషయములో గొప్ప వాడు అనగా యోహానులోనికి వచ్చాడు గనుక గొప్పవాడు.

అది మాత్రమేగాక తక్కిన ప్రవక్తలందరికి బదులుగా రూపాంతర కొండమీదికి వచ్చాడు గనుక గొప్పవాడు. తక్కిన వారందరి బదులుగా వచ్చుటకు తగినవాడు గనుక వచ్చాడు గనుక గొప్పవాడు. ఇది క్రమముగా సన్నిధిలో ఉంటే అర్థమగును. పరలోక పరిశుద్ధులలోనుండి తరచుగా సన్నిధి కూటములలోనికి వచ్చువాడు ఈ ఏలీయాయే గనుక ఈయన గొప్పవాడు. ఇది అయ్యగారి అనుభవము. మార్కు 9:11,13; ఎప్పుడైనా, ఏలియాగారు సన్నిధిలోకి వచ్చినపుడు, త్వరగా త్వరగా చెప్పివెళ్ళిపోతారు.

1. యేసుప్రభువు మొదటి రాకకు ముందు ఏలియా వస్తారు అని మలాకీ 4:5,6లో ఉన్నది.

2. అలాగే రెండవ రాకడకుముందు 7 ఏండ్ల శ్రమకాలము రాకముందే ఏలియా వస్తారు. అది ఈ కాలమే. ఏడేండ్ల శ్రమకాలములోనికి మనము వెళ్లకుండ జేయుటకు ఏలియా వస్తారు. మలాకీ 4:5,6లో ప్రభువుయొక్క మొదటి రాకకుముందు 1) యోహాను అనే ఏలియా వచ్చి క్రీస్తును గురించి ప్రవచించెను. ఈ ప్రవచన ప్రకారముగా అదివరకే సిద్ధపడినవారిని సిద్ధపరచుటకు యోహాను వచ్చి సిద్ధపరచినాడు. తీరా సిద్ధపడిన తరువాత ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్ల అని చెప్పెను. చెప్పుటయేగాదు తనశిష్యులైన ఆంద్రెయాను, పేతురును ఆయన దగ్గరకు పంపెను. అప్పుడు సిద్ధపడిన వేలకొలది ప్రజలకు బాప్తిస్మము ఇచ్చెను. ఈ యోహాను గొప్ప ప్రసంగము చేసినట్లు మత్తయి. 3వ అధ్యా॥లో ఉన్నది అయ్యగారు ఈ యోహాను ప్రసంగమును పద్యములో వ్రాసిరి.

1. ఏలియా వస్తాడని శాస్త్రులు చెప్పుచున్నారు (మలాకీ 4:5)అని శిష్యులు ప్రభువును అడిగిరి. ప్రభువు వారికి జవాబు ఏమి చెప్పిరి. లూకా 11:17 ఏలియా వచ్చాడు, సిద్ధపడినవారిని సిద్ధపర్చినాడు (క్రీస్తు ప్రభువు మొదటి రాకకు) మీరాయనను మీ ఇష్టము వచ్చినట్లు చేసినారు అని చెప్పినారు. ఇందులో చాలా అర్థమున్నది. యోహాను ప్రభువును గూర్చి మెస్సియా వచ్చెను. ఆయన మీమధ్య ఉన్నాడు అని సాక్ష్యమిచ్చెను.

2 రెండవ రాకడకుముందు ఏలియా రావలెను. ప్రజలను సిద్ధపరచవలెను. సంఘము ఏడేండ్ల శ్రమలలోకి వెళ్లకుండ ఆపుచేయవలెను. 'ఆ పనిమీద ఇపుడు ఏలియా ఉన్నాడు' అని దర్శనము లేకపోయిననూ వాక్యమునుబట్టి సిద్ధపర్చుటకు వచ్చినాడని, వచ్చుచున్నాడని నమ్మవచ్చును.

ఏలియా పని ఏదనగా: అనేకమంది తమ హృదయములలో రాకడ రాకడ, ఎపుడు రాకడ అని అంటున్నారు. ఇది ఏలియాయొక్క పనియే. ఆ పని మాత్రముగాదు 'రాబోయే ఉగ్రతను తప్పించుకొనుటకు మీకు బుద్ధిచెప్పినవాడు ఎవడు?' అటువంటి మాట ఇపుడును చెప్పుచు మన తలంపులో రాకడను పెట్టినాడు ((1) రాకడ తలంపు తలలో పెట్టెను. (2) రాకడ భయము మన తలలో పెట్టెను.

షరా:- ఆ ఏలియాయొక్క ఆత్మయును, శక్తియును స్నానికుడైన యోహానులోనికి వచ్చింది. ఏలియాలో ఉన్న చరిత్ర అంశములు కొన్ని యోహానులోనికి వచ్చెను. అన్నీ రావు. అయితే, యోహానులోకి ఎక్కువ వచ్చినది ఏమిటి అంటే హత్య. హతసాక్షియగుట.

యేసుప్రభువు హతసాక్షియగుటకు పూర్వము మచ్చుకు తనకొరకు ఒకరు హతసాక్షి కావలెను. అందుకు తగినవాడు యోహాను. క్రీస్తుప్రభువు మొదటి రాకకు సిద్ధపడిన ప్రజలను ఈ యోహానే సిద్ధపర్చవలెను. క్రీస్తుప్రభువు రెండవ రాకకు ఇపుడు పరలోక పరిశుద్ధులను సిద్ధపరచవలెను. ఆ పనిమీద యోహాను తప్ప మరొకరు పనికిరారు. సిద్ధపరచుటలో అదొక వరము. ఇదొకవరము. యోహానుకు దేవుడు మరణము రానిచ్చినాడు. అది ఆయన చిత్తము నేడు ప్రతివారి మనస్సులోనే ఏడేండ్ల శ్రమ గురించి ఏలియాగారు జ్ఞాపకం చేస్తున్నారు. అందుచేతనే మేము రాకడకు సిద్ధపడుదుము. ఏడేండ్ల వరకు ఉండము అని కొందరు అంటున్నారు. వారికి మహాశ్రమల భీతి కలిగినది గనుకనే ఆలాగు అనుచున్నారు.

ప్రార్థన:- ఓ ప్రభువా! ఏలియా గురించి మేము నేర్చుకొన్న పాఠములో మమ్ములను సిద్ధపరచిన, సిద్ధపరచేటువంటి పాఠములు చూపించుము ఆమేన్.[1]

1. 15.1. 1957వ సం॥లో దేవదాసు అయ్యగారు గుంటూరు క్రీస్తు సంఘములో చేసిన ప్రసంగము.

# 11. క్రీస్తుప్రభువు రాకడలు

## యెషయా 60:4; మత్త. 25:1-13; 2పేతు. 3:7.

రాకడ, రాకడ, రాకడని కలవరింపగోరే ప్రియులారా! విశ్వాసులారా! మీకు అట్టి శుభము కలుగునుగాక. ఆమేన్.

గత ఆదివారము నా ప్రసంగము సగమే చెప్పినాను. రాకడను గురించి క్రిందటి ఆదివారము అడ్వెంటు కాలమని చెప్పినాను. ఈ అడ్వెంటు కాలము గురించి డిసెంబరు నెలలో లూథరన్ మిషన్ వారు తరచుగా చెప్పుచుందురు అని చెప్పి మూడు గుంపులలోని మొదటి గుంపు, రక్షితులు; రెండవ గుంపు, పెండ్లికుమార్తె సంఘములోని మృతులు; మూడవ గుంపు సజీవుల గుంపు. వీరినిగురించి వివరించినాను. అయితే యేసుప్రభువు రాకడలు ఎన్ని? 1) ప్రభువు బెత్లెహేములోని పశువుల తొట్టిలోకి రావడము. 2) సిద్ధపడిన సంఘమంతటిని ప్రభువు మధ్యాకాశానికి, పరలోకానికి తీసికొని వెళ్లుటకు రావడము 3) అంత్యతీర్పులో అవిశ్వాసులను నరకములో వేయుటకు రావడము. ఇవి అన్ని మిషనులవారు ఒప్పుకొంటారు. ఇవేకాదు ఇంకా ఉన్నవి. ఇవి అన్ని రాకడను గూర్చి అడ్వెంటు కాలములో మాట్లాడకపోతే, ఇంకెపుడు మాట్లాడుకొంటాము? సంవత్సరమునకు ఒకసారైన మాట్లాడకపోతే ఆత్మకుబలము నిరీక్షణ ఎట్లు కలుగును? అయితే సమయముంటే అన్ని రాకడలను గూర్చి వినవలసిందే అవిశ్వాసులకు 7సం॥లు శ్రమల విందును, పరలోకములో ఉన్న విశ్వాసులకు ఆనంద పెండ్లివిందును జరుగును. పెండ్లికుమార్తె విందులో పరలోకములో ఉన్నందున, క్రిందున్న శ్రమ వారికి కనబడదు. భూలోకముతట్టు వారు చూడనేచూడరు.

ఎందుకనగా 7సం॥ల చరిత్రయే వారికి తెలుసుగాని అనుభవముగాని, ఆ మహా శ్రమ కనుగొనుటగాని యుండదు. భూమిమీద శ్రమలవలన చాలామంది మారుమనస్సు పొందుదురు. వారిని ప్రభువు విందులోనుంచి వచ్చి మోక్షంలోని ఏదో సుఖ స్థలములో పెట్టుదురుగాని విందులోవారికి పాలులేదు. ఇది శ్రమలమధ్యలో వచ్చే రాకడ

మారుమనస్సు పొందిన వారికొరకు ఈలాగు 7సం॥లలో రావడముకూడా రాకడే. 7సం॥ల ముగింపులో అంతెక్రీస్తు, అబద్ధప్రవక్తలతో ప్రభువు యుద్ధముచేయును. ఈ యుద్ధస్థలము యెరూషలేములోని ఉత్తరస్థలము. ఈ స్థలములో ఎవ్వరు తిరుగకూడదు. నేడు ప్రత్యేకముగా ఆ స్థలమున్నది. దీనికి ప్రభువు దూతలు వచ్చి యుద్ధము చేయనక్కరలేకుండనే అంతెక్రీస్తు అబద్ధ ప్రవక్త, 3కప్పలవంటి దురాత్మలను నరకములో పారవేయుటకు, రావడము బైబిలులో ఉన్నది (ప్రక. 9:19-21) ఇదొర రాకడ. హర్మగెద్దోను యుద్ధము కాగానే పరిశుద్ధులు ప్రభువు మరొకసారి భూలోకమునకు వస్తారు. రాగానే అబద్ధప్రవక్త, అంతెక్రీస్తు మూడు దురాత్మలను నరకములో పడవేసిన రీతిగానే సాతానును మట్టులేని గోతిలో పడవేయును. ఆ గోతికి అడుగు లేనందున 1000 సం॥లు సాతాను దిగిపోతునేయుండును. ఇది ఒక రాకడ తర్వాత ప్రభువు వెయ్యేండ్లు భూమిమీద పరిపాలన చేయుటకువచ్చును. సైతానుకు లోబడిన వారిని, సాతాను సేవకులను సాతాను ఎదుట శిక్షించిన తరువాత సాతానును ఆయన గోతిలో వేస్తారు. ఇది సైతాను కండ్లఎదుట వాడి అనుచరులను శిక్షించిన పిమ్మట, సాతానుకు, వాడి అనుచరులకు ఆయన విధించిన శిక్షే.

1000సం॥లు ఆరంభమునుండి ముగింపువరకు సువార్త పని ఆటంకములేకుండగా ఎక్కువగా జరుగును అట్టి సేవ ఇంతవరకు జరుగలేదు. మర్మముగా ఉండక మహిమగా ఉండును. అది ప్రభువు పరిపాలన అది ఇంకొక రాకడ. ఈ 1000సం॥ల ముగింపు కాగానే పరలోకమునుండి సింహాసనము భూలోకానికి వచ్చును. ప్రభువు 1000ఏండ్లు వాక్యము విన్నవారిని మీ తీర్మానము ఏమి? అని సింహాసనమునుండి అడుగుట మరొక రాకడ. వీరందరు బ్రతికే ఉందురు. వీరినే సజీవులందురు. ఈ తీర్పుకే మత్త. 25:లోని గొఱ్ఱె మేకల తీర్పు అందురు. అదియు ఒక రాకడ. సజీవుల తీర్పు అయిన తరువాత ప్రభువు అపోస్తలులతో చెప్పినట్లు, భూదిగంతములవరకు నాకు సాక్షులైయుందురనేది 1000 ఏండ్లలో నెరవేర్పుగా జరుగును. అది ఇపుడు జరుగుటలేదు. ప్రభువు మట్టులేని గొయ్యిలోని సాతానుకు విడుదల కలిగించుటకు మరలా వస్తారు. వాడి మారుమనస్సు లేదు. గనుక ఊరుకొనక ప్రభువుమీదికి యుద్ధమునకు రెండు పటాలమును అనగా రెండు మిలటరీలను సిద్ధపరచును. దేవునితో యుద్ధము చేయును. క్రీస్తు అతనిని ఓడించి నరకములో పడవేయును. ఇది ఒక రాకడ. ఆ తర్వాత గొప్ప వింత కార్యము జరుగనైయున్నది. అది మనము గమనించుట చాలా కష్టము. అనగా గ్రహించుట కష్టము. ఎందుకనగా ఇది చివరి రాకడ. (గ్రహించు) చివరిది ఆదాము, అవ్వలు పాపము చేసినది మొదలు, గోగు మాగోగులను నరకములోవేసే వరకు ఎందరు చనిపోయి హెడెస్సులో (పాతాళములో) ఉన్నారో, వారందరిని ప్రభువు ప్రోగుచేసికొంటు వస్తారు. చివరిలో చనిపోయిన వారందరికి ప్రభువు శబ్దము వినబడి, ప్రభువు పిలువగా వారందరు లేచి వచ్చెదరు. అది అంత్యతీర్పు.

నదులలో, బావులలో, సముద్రములో, చెరువులలో, అడవులలో చనిపోయిన వారందరిని ఆయా స్థలములలో నుండి ఆ సమయమున అప్పగించును. అదే లేచు దినము. అపుడు మృతులెల్లనిక లేచుదినము వచ్చును. వారందరు వచ్చివేయుదురు. అపుడెవరైనా మారుమనస్సు పొందితే ప్రభువు వారిని రక్షించును. ఇదొక రాకడ. ప్రభువు **'రండి'** అని పిలుచును. లాజరును బైటికి రా అన్నాడా లేదా! లాజరును పేరుపెట్టి పిలువకపోతే, 'బైటికి రండి' అంటే చనిపోయిన వారందరు లేస్తారు. గాని వారు ఇప్పుడు లేవవలసియున్నారు అంత్యతీర్పుకు ఇదే అంత్యతీర్పు. ఆ తీర్పులో చాలామంది ఎదురుగావచ్చి మేము ప్రవచింపలేదా! బోధింపలేదా! అద్భుతాలు చేయలేదా! అని అడుగగా వారిని అక్రమము చేయువారలారా! అని ప్రభువు అనును గనుక ***ఇట్టి పనులు చేయువారు జాగ్రత్తగా చివరివరకు నిలిచి ఉండవలయును.*** అట్టివారినికూడా రక్షించుటకు మీ జ్ఞానాన్ని బట్టి, శక్తినిబట్టి రక్షించకూడదా! అని అయ్యగారు వారి గురించికూడ నరకాన్ని కొట్టివేసి రక్షించుమని ప్రార్థించిరి. అది తప్పే అని అయ్యగారు అనుకొనుచున్నారు. అయిననూ ఆయనిచ్చిన చనువు, స్వతంత్రమును బట్టి ఒప్పుకూడా ఉన్నది. ఇదియు రాకడే. ఇదే బైబిలుమిషను వారు బోధించుచున్నారు. ఇది విని కొందరు వారి మిషనులలో బోధించుచున్నారు గాని కొన్ని రాకడల నిశ్చయత వారికే తెలియదు గనుక కొన్ని రాకడలు మాత్రమే అందరూ ఒప్పుకొంటారు. ఈ 7000సం॥లలో అన్ని మిషనులవారు చేయు అనుదిన ప్రార్థనకు, ప్రభువు వస్తారని ఒప్పుకొంటారు. ఒకప్పుడొకాయన అయ్యగారు

మాట్లాడు చుండగా ప్రభువు రాకడకు విశ్వాసులను తీసికొనిపోయిన తర్వాత మిగిలిన వారిని నరకంలో వేస్తారు' అని అన్నారు.

మరొక దొరగారు ప్రభువు రాడేమో, రాడేమో, రాడేమో! అని అన్నారు. రాకడ నిశ్చయత తెలియనపుడు అనగా, ఆయన రాకడలు తెలియనపుడు ఇటువంటి నిరాశయే వచ్చును. మన తెలుగు రాష్ట్రములో (అప్పటికి) 27జిల్లాలు ఉన్నవి. వీటిలో 21లక్షల 24వేలమంది క్రైస్తవులున్నారు. వీరందరు ఈ రాకడలన్ని తెలిసికొంటే ప్రభువుయొక్క రెండవ రాకడలో వెళ్లగలరు. వీరు రాకడను గురించి చెప్పగలిగితే ఎంత బాగుండును! ఒకాయన అయ్యగారిని 'మనము రాకడకు ఉండబోయినామా' అని అన్నారు. ఇవి అన్ని తెలిసికొనుటకే, తెల్సికొని రాకడకు ఎదురుచూచుటకే ప్రభువు యోహానుచే ప్రకటనలో వ్రాయించిరి. అనేకులు ప్రకటన గ్రంథము చదువరు. అయ్యగారితో వారి సన్నిధి కూటములో, 41 సం॥ల క్రితమే ప్రభువు ఈ మాట అన్నారట. ప్రకటనలోనివి అందరికి చెప్పండి" ఎందుకు ప్రభువా? మేము ఎవరికైన చెప్పితే వారు మమ్మల్ని ఆక్షేపిస్తారు అని అయ్యగారు ప్రభువును అడిగిరి. అందుకు ప్రభువు అన్నారట. **"నేను మీకును, అది మీరు ఇతరులకును చెప్పుట నేరముకాదని"** అన్నారట. అందుచేత 8సం॥ల క్రితము నేను బేతేలు గృహము వరండామీద ప్రకటన 22అధ్యాయములు, ప్రభువు నాకు చెప్పగా నేను 100మందికి చెప్పివేసాను. ఇప్పుడు ఇన్ని రాకడలకు ప్రభువు వచ్చుచున్నారు. మృతులైన భక్తులలో శక్తిగలవారు ప్రభువుతో తిరిగి వస్తారు. పోయినవారము మీరు విన్న ప్రసంగము, ఈ వారములో మీరు విన్న సంగతులు మీ హృదయ విశ్వాసమును పెంపొందించును గాక! ఆమేన్.[1]

1. 21.12.1958వ సం॥లో దేవదాసు అయ్యగారు ఆదివారం గుంటూరు క్రీస్తు సంఘములో చేసిన ప్రసంగము.

# 12. పరలోక రాజ్యమర్మములు

## మత్తయి 13:11.

దైవాశక్త ప్రియులారా! నేటిదిన వాక్యధ్యానముద్వారా పరలోకరాజ్య మర్మమైన విషయములు ఆ ప్రభువు మీ జ్ఞానమునకు అందించునుగాక! ఆమేన్.

పరలోక రాజ్య విషయములు, సంఘ విషయములు, బైబిలులోని అనేక విషయములు మరియు క్రీస్తు ప్రభువు విషయములు, లోకమనస్సు గ్రహింపనేరదు. వారు 1) గ్రహించరు, 2) అంగీకరించరు. ఎందుకు గ్రహించరు? లౌకికము అనేది మనుష్యులలో ఉన్నందున గ్రహింపరు. దైవిక విషయాలు ఎందుకు గ్రహించాలని ఆలోచించినందు వలన, వారు అంగీకరించరు. దేవుడిచ్చిన జ్ఞానమును వాడనందువలన గ్రహించరు. ఈ పాఠములోను, యెషయా 6వ అధ్యాయము 10వ వచనములోను ఏమి ఉన్నది? దేవుడే వారి గ్రహింపుశక్తిని ఆపుచేసినట్లు కనబడుచున్నది. అందుచేత వారికి అంగీకరించు మనస్సులేదు. గనుకనే దేవుడు హృదయమును చూచును అని మనము తెల్సుకొనవలెను. నీవు చేయవలసినది చేయుమని ఆయన, యూదా ఇస్కరియోతుతో చెప్పెను. ఎందుకనగా అతని హృదయమట్టిది. గనుకనే దేవుడు మనుష్యుని అపవిత్రతకు అప్పగించెనని రోమా 1:24లోయున్నది. జ్ఞానమువల్ల గ్రహించలేని సంగతులుగలవు. అట్టి వాటిని మనము దేవునియందలి విశ్వాసమువలన గ్రహింపగలము. హెబ్రీ. 11:1లో ఏమున్నది? విశ్వాసమువలన గ్రహించుకొనుచున్నామనియున్నది. ***జ్ఞానశక్తికంటె విశ్వాస శక్తి గొప్పది.*** క్రీస్తుప్రభువు చరిత్ర చదివి, క్రీస్తుప్రభువు చరిత్ర చూచిన ఆకాలమునాటి వారు– ఈయన మరియమ్మ కుమారుడుకాదా? ఈయన యోసేపు కుమారుడు కాదా? నజరేతులో ప్రవక్తలేచునా! ఈయన

ప్రవక్తయైతే పాపాత్మురాలని ఈ స్త్రీని గురించి తెలుసుకొనును" అని చెప్పుచు యూదులు అభ్యంతరపడిరి. ఈయన మెస్సియా అయితే యూదులకు ఎందుకు రాజ్యమియ్యకూడదు! ఇట్టి ప్రశ్నలు వారి మనస్సును చెడగొట్టినవి. మెస్సీయా వచ్చుటకు గురుతుపట్టేటందుకై కొన్ని గురుతులు పాతనిబంధనలో వ్రాయబడినవి. అందులో ఒకటి ప్రభువు గార్ధభాసీనుడై వెళ్లుట; ఇదివారు గ్రహించలేకపోయినారు. ఎందుకంటే ప్రభువును వారు రోమీయుల రాజ్యమును పడగొట్టి, తమకు ఉద్యోగమునిచ్చి రాజ్యమేలుమని కోరినారు, కాని అట్లు జరుగలేదు గనుక అభ్యంతరపడినారు. నా విషయమై అభ్యంతరపడనివాడు ధన్యుడు అని ప్రభువు చెప్పలేదా? యోహాను చెరసాలలో నుండి రాబోవువాడవు నీవేనా! అను ప్రశ్నవేసి, తన శిష్యులను ప్రభువునొద్దకు పంపెను. గనుక ఆయనవలన నిశ్చయము తెలుసుకొనెను. గనుక యూదులుకూడా ఈ ప్రకారముగా తెలిసికొనినయెడల నిశ్చయము తెలిసియుండును. మర్మములు అందరికీ తెలియబడవు. అందరికి అవసరములేవు. క్రీస్తుమత మర్మములు ఒకరికి పూర్తిగా చెప్పివేయండి అతడు అంగీకరించని యెడల చెప్పడము మానివేయవలెను. అట్టివానితో వాగ్వాదము పెట్టుకొనవద్దు.

1తిమో. 4:13-14 విశ్వాసులకు మర్మములు తెలిసే వరమున్నదనియు, ఇతరులకు అవి తెలిసికొనేశక్తిలేదనియు పౌలు సెలవిచ్చెను. ఇతరులకు ప్రభువు కొన్ని సంగతులు అర్థముకాని సంగతులు చెప్పినారు. తృణీకరించినవారెట్లు గ్రహించినామని చెప్పుదురు! పూర్వకాలమునందు మర్మములని చెప్పబడినవి ఇప్పుడు మర్మములు కావుగాని పరమగీతమును, ప్రకటనయును, కొన్ని ప్రవచనములును మర్మములే. అయినను మనము ప్రభువు సన్నిధిలో గడిపినయెడల ప్రభువు ఎక్కువ సంగతులు వినిపించును. నేడు అట్లు ఎవరు చేయుదురో వారికి మర్మములు బయలుపర్చును. శిష్యులు ప్రభువుతో

నిత్యము ఉండిరి గనుక అనేక సంగతులు గ్రహించిరి. మనమును అట్లే చేయగలిగిన యెడల ఎంత బాగుండును! 'కలిగినవానికి ఇవ్వబడును' అని ప్రభువు చెప్పుచున్నది గ్రహించవలెను. నేర్చుకొనగల ఆసక్తిపరులైన విద్యార్థులకు నేర్పవలెనని ఉపాధ్యాయులకు ఇష్టముండును. అలాగే ప్రభువు కొందరికి ఎక్కువ సంగతులు చెప్పును. ఇష్టములేని వారికి ఎట్లు చెప్పును? లేనివానికి కలిగినదియు వానియొద్ద నుండి తీసివేయబడునని ప్రభువు చెప్పుచున్నాడు. వరమువాడని వారియొద్దనుండి వరము తీసివేయబడుట అనేదియున్నది. అలాగే ఇది తీసివేయబడును. ఒకరిలో దురాత్మ ప్రవేశించుటకు దేవుడు సెలవిచ్చెను. 1రాజు. 22:21. చదవండి. ఒకదరినుండి మనము లోబడుచుంటే ఒకదరినుండి ప్రభువు జ్ఞానమును, మరియు కావలసినవాటినన్నిటిని దయచేయును. పూర్వకాలపు ప్రవక్తలకు దేవుడు కొన్ని మర్మములు బయలుపర్చలేదు. ఎందుచేత? వారి అవిశ్వాసమునుబట్టి కాదు. ఆ కాలమందు అవి వారికవసరములేదు గనుక మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధ్యనములైనవి... అనేక ప్రవక్తలు చూడగోరియు చూడలేదని ప్రభువు చెప్పిరి (మత్తయి 13:16,17వచ). బైబిలునుగూర్చియు, క్రీస్తును గూర్చియు, ఆయన సంఘమును గూర్చియు అనేకులు అభ్యంతరపడుచున్నారు. ఒకటి క్రీస్తును గురించి శరీరధారియనియు, ఆయన దైవత్వము నిజముకాదనియు, ఆయన శక్తిగలవాడైతే సిలువమీదనుండి ఎందుకు దిగలేదు అని అభ్యంతరపడుచున్నారు. (1) బైబిలును గురించి సర్పము మాట్లాడునా? (2) గార్ధభము మాట్లాడునా? (3) ఏలీయా ప్రవక్త ప్రార్థనకు అగ్ని కురిసెనా? ఈ మొదలైనవి బైబిలులోని సందర్భములను ఎత్తి అభ్యంతరపడుచు ఇది దేవుని గ్రంథముకాదని చెప్పుచున్నారు. సంఘమునుగూర్చి– క్రీస్తు శిష్యులు జాలరులు, చదువులేనివారనియు,

నేటి క్రైస్తవులు సామాన్య ప్రజలనియు అభ్యంతరపడుచున్నారు. గనుక ఈ మూడు విషయములవలన కలిగే భాగ్యములు వారు పోగొట్టుకొనుచున్నారు. అనేకులు– 'దేవుడు, సైతానును అప్పుడే నాశనము చేయలేకపోయినాడా? మానవులు ఇప్పుడు అనేక కష్టములు పడుతుంటే ఎందుకు చూచి ఊరకుంటున్నాడు?' ఈ మొదలైన ప్రశ్నలు వేయుటవల్ల "దైవ విషయభాగ్యమును పోగొట్టుకొనుచున్నారు" అని దేవుని వాక్యములోనివి విని, తొలగిపోయేవారినిగురించి మనము అనవలెను. వినేవారికి అవసరములేదు కాని, విననివారికి దైవ ప్రాప్తిలేదు అని గ్రహించుకొనవలెను. అటువంటి వారి విషయములో మన విలువైన సమయమును వృధాగా గడుపకూడదు. ఒక పర్యాయము విననివారు మరియొక పర్యాయము వినుటకు వచ్చిన యెడల వారి ఆసక్తినిబట్టి బోధించవచ్చును. యోహాను 3:20; హెబ్రీ. 6:1,8. యూదా ఇస్కరియోతు తప్పిపోయినాడు. అలాగే కొందరు క్రైస్తవులుకూడా తప్పిపోవుదురు. అంతమాత్రమున క్రైస్తవమతమును దైవమతము కాదని చెప్పవచ్చునా? తక్కిన 11మంది బాగుపడలేదా? ఏశావు మారుమనసుస్సు పొందలేదు. ఎందుచేత? అది అతని నైజము. దీవెనకొరకు సిద్ధపడలేదు. ఎందుచేత? అతనిని దీవించుట దేవునికి ఇష్టములేకకాదు. ***దేవుడు ఇచ్చు దీవెన మనిషి అంగీకరించకపోవుటవల్ల దీవెన దొరకదు.*** దీవెన అందరికి ఇవ్వడము దేవునికి ఇష్టమేగాని అందరు దానికి సిద్ధముగాలేకపోతే ఎట్లు ఇవ్వగలడు? కయీను దేవుని నెదిరించెను గనుక ఆయన సన్నిధిలోనుండి వెళ్లిపోయెను. దేవుడు వెళ్ళగొట్టలేదు. దేవుడు ఎవరిని వెళ్లగొట్టడు. కయీనుకు దేవుడు ఎందుకు మారు మనస్సు ఇయ్యలేదని అడుగుచున్నారు. యూదా ఇస్కరియోతు పుట్టకపోతే క్రీస్తు ఎట్లు చనిపోవును? అతడు మంచిపనే

చేసినాడు. క్రీస్తుప్రభువు అతనిని ఎందుకు క్షమించకూడదు! అని ఇట్టి ప్రశ్నలు అడుగుచున్నారు. ఇవి అన్ని అవిశ్వాసులకు మర్మములుగాని విశ్వాసులు సుళువుగా గ్రహింతురు. మన వార్త అందరికి ప్రకటింపవలెనుగాని కొందరు వినరు. వినకపోతే చెప్పడము మానివేయవలెను. మారు మనస్సులేని వారినే సాతానుకు అప్పగింపవలెనని పౌలు అనుచున్నాడు. 'కొందరిని' అని పౌలు అననందువలన మనమెందుకు విచారపడవలెను. హేడెస్సులో బోధ ఉన్నది గనుక ఆదరణ పొందుదము. విత్తనముల గురించి చెప్పిన పిమ్మట ప్రభువు పరలోక మర్మములను గురించి చెప్పెను.

**విత్తనముల ఉపమానము:-**

మొదటి విత్తనము పక్షులు తినివేసెను గనుక అది ఫలింపులోనికి రాలేదు. పక్షులు-ఇవి పిశాచికి గుర్తు. రెండవ విత్తనము మొలిచెను కాని రాతినేల అగుటవలన ఫలములోనికి రాలేదు. రాయి మనిషిలోని చెడు నైజమునకు గుర్తు. మూడవ విత్తనము మొలిచెనుగాని ఫలములేదు, ముండ్లపొదలు అడ్డము వచ్చెను. ఇవి లోకమునకు గుర్తు. మనకు శత్రువులు ముగ్గురు. 1) సైతాను 2) శరీరము 3) లోకము. శరీరనైజమే గొప్ప శత్రువు. అది మన ఒంటిలోని శత్రువు. (మొదటిమూడు ఉపమానములు ప్రభువు జనసమూహముండగా చెప్పెను. తరువాత మూడు ఉపమానములు శిష్యులకు ఇంటిలో చెప్పెను. నాలుగును బైటవారికి మూడును, ఇంటిలోని శిష్యులైనవారికి 4 ఉపమానములు ప్రభువు చెప్పెను. రాతినేల ఉపమానమును జన సమూహము సంతోషముతో విన్నారు. తరువాత ఎండిపోయినారు. అలాగే నేడు క్రైస్తవులలో అనేకమంది ఆరంభమందు మహా ఉద్రేకముతో ఉంటారు. తరువాత తగ్గిపోవుదురు. కనుక ఎవరిది

తప్పు? వాక్యము చెప్పుటలో తప్పున్నదా! వాక్యము వినుటలో తప్పా? లేక మనిషి నైజము తప్పా? విత్తనములో తప్పులేదు గనుక ఒక క్రైస్తవునికి ఉద్రేకము తగ్గినపుడు సంఘపాస్టరుగారిని గాని, సంఘమునుగాని, దేవునినిగాని నిందింపరాదు. కొందరు 30దంతలైనా, 60దంతలైనా, ఫలించరుగదా! 100అంతలు ఫలించరు గదా! రాతినేల వారు ముందు తమ నైజమును తొలగించుకొనవలెను. పొదనేలవారు లోకమువల్ల శోధనలువచ్చునని ముందుగా తెలుసుకొని, అవి వచ్చినపుడు జయించవలెను. వాక్యము బోధించేవారు ఈ మూడు రకములైన శత్రువులును గురించి బోధించకుండా ఉండరాదు. ప్రతి సంఘములోను నాలుగు తరగతులకు సంబంధించిన క్రైస్తవులున్నారు. విన్ననూ వినకపోయినను; అంగీకరించిననూ, అంగీకరించక పోయినను, 'ప్రకటించుట మన పని" అని దారిని పడిపోయిన గింజవల్ల తెలుసుకొనుచున్నాము. ప్రకటించుట మన పని. గుణము మార్చుకొనుట వినేవారి పని. ఈ ఉపమాన భావము ప్రభువే స్వయముగా చెప్పెను. మంచినేలగల వారందరు మంచి ఫలితములోకి వత్తురు, గాని ఫలములలో భేదములుండును. అయినను పర్వాలేదు ఫలము వచ్చును అంతేచాలును. ముప్పదంతలువారు భూలోక మోక్షమును, 60దంతలువారు రక్షితుల మోక్షమును, 100రంతలు వారు నూతన యెరూషలేము అను మోక్షమును, జ్ఞాపకము చేయుచున్నారు.

**విత్తబడిన గింజలలో-** మొదటి గింజలోని ఫలింపు నిష్ఫలమే,రెండవ గింజలోని ఫలింపు కొంచెము ఫలము, కాని నిష్ఫలమే. మూడవ గింజలోని ఫలింపులో కొంచెము ఫలము కాని నిష్ఫలమే. నాల్గవ గింజలోని ఫలింపులో అంతా ఫలమే.

ఈ నాల్గవ గింజలోని ఫలింపులో మూడంతస్తులున్నట్టు. (30,60,100) రక్షింపబడిన వారిలోకూడా మూడు అంతస్థులున్నవని గ్రహించుకొనవలెను. గ్రహించనివారు, మార్గోపమానములోనివారు. ఉపమానము గ్రహించుట ఎంత ముఖ్యమైన పని. అయితే వారు గ్రహించనందు వలననే బొత్తిగా ఫలములేకపోయెను. గనుక దేవుడు మానవునికిచ్చిన జ్ఞానమును ప్రతివాడు ఉపయోగించుకొనవలెను.

**గురుగులను గూర్చిన ఉపమానము:-** మత్త. 13:24-30. దేవుని రాజ్యముయొక్క మర్మములను గురించి వివరించుటకై, యేసుప్రభువు 7 ఉపమానములు చెప్పెను. ఒక్కొక్క ఉపమానము క్రమముగా ప్రకటనలోని 7సంఘములకు, క్రమముగా అన్వయించును. విత్తనముల ఉపమానములో విత్తనములు చల్లిన రైతు యేసుప్రభువే. గింజ దేవునివాక్యము. అయితే మంచిగింజలు సజ్జనులైయున్నారు. గురుగులను చల్లినవాడు సైతాను. గురుగులు మనుష్యులే, అనగా దుర్జనులు. వీరు దేవుని రాజ్యముయొక్క పనులు ఆటంకపరుచువారు, దుర్నీతిగలవారు. వీరు గోధుమలయొద్దనే అనగా సజ్జనులయొద్దనే ఉందురు. సంఘమంతటిలో సాతాను అక్కడక్కడ ఇట్టివాటిని చల్లియున్నాడు. వారు పైకి ఆచారములనుబట్టి, నామములనుబట్టి విశ్వాసులవలె ఉందురు, కాని హానిపరులు. వీరినిగూర్చి మనము జాగ్రత్తపడవలెను. ఎందుకు వీరిని తీసివేయవు? అని విశ్వాసులు అడుగుచున్నారు. దీనికి జవాబులేదు. కాలాంతమందు వీరిని ప్రభువు కట్టలు కట్టలుగా కట్టివేయుదురు. 1) కట్టగా కట్టబడుట, 2) గోధుమలు కొట్టులో వేయబడుట 3) కట్టలు కాల్చివేయబడుట ఈ క్రమము జ్ఞాపకము ఉంచుకొనండి.

కట్టలు కట్టబడుట అనగా విశ్వాసులలో నుండి అవిశ్వాసులను విడదీయుట. కొట్టులో చేర్చబడుట అనేపని పెండ్లి కుమార్తె ఎత్తబడినప్పుడు జరుగును. కాల్చబడేపని అంత్యతీర్పప్పుడు జరుగును. నిద్రపోయినవారు సేవకులు అనగా పనివారు అశ్రద్ధగా ఉన్నప్పుడు వారి శత్రువు "పని" చేయును. మనుష్యులు అజాగ్రత్తగా ఉన్నప్పుడు శత్రువులు గురుగులను నాటిరి. ఒకవేళ గురుగులను తీసివేయవలెనంటే వాటిని పెరికివేయునప్పుడు, మంచిమొక్కలుకూడా తీసివేయబడును. అందుకు యజమానుడు ఒప్పుకొనలేదు. గురుగులు ముందు కూర్చబడును. అటుతరువాత అవి కాల్చబడును. దానికి ముందుగా గోధుమలు కొట్టులో చేర్చబడవలెను. గురుగులు అనగా మారుమనస్సులేనివారు, గోధుమలు అనగా రక్షణను అంగీకరించువారు. భావికాల చరిత్రను చదవగా ముందుగానే పెండ్లికుమార్తె వరుసలోని వారు వెళ్లిపోవుదురు. ఆ తరువాత అంత్యతీర్పు దినమందు ఆ దుష్టులు నరకములోనికి వెళ్ళిపోవుదురు. ఈ ఉపమానము స్ముర్న సంఘమునకు సంబంధించినది. తాము యూదులమని చెప్పుకొనుచు, యూదులుకానివారు ఈ సంఘములో ఉన్నారు. క్రైస్తవులు రాకడలో వెళ్లిపోయిన తరువాత క్రైస్తవులు కానివారు అనగా నామక క్రైస్తవులు మన సంఘములలో ఉన్నారు. ఈ ఉపమానమువలన ఒక పాఠము నేర్చుకొనుచున్నాము. సేవకులు అనేక మర్మములు ఎరుగరు. మర్మములు ఎరిగినవారు, దేవదూతలవలె ఎవరి హృదయము ఎట్టిదో తెలిసికొనుట కష్టముకాదుగదా! అందుకనే వెంటనే ఎవరికి తీర్పుతీర్చకూడదు. యుగసమాప్తి అనియున్నది, గనుక ఆ యుగసమాప్తి సువార్త ప్రకటన అనంతరము వచ్చును. కడవరి ఆజ్ఞ నెరవేరుట రాకడ కాలములో కాదు. వెయ్యేండ్ల పరిపాలనలో జరుగును. ఆ

తరువాత అంత్యతీర్పు. ఆవగింజ క్రొత్త నిబంధన. ఇద్దరితో ఆరంభమాయెను. తరువాత 12మంది ఆయెను. పైగా 70మంది శిష్యులు మత ప్రచారము చేసినవారు కలరు. పెంతెకొస్తు నాడు ప్రార్థనా కూటములో 120మంది కనబడుచున్నారు. అప్పుడు మూడువేలమంది చేర్చబడిరి. ఈ ప్రకారముగా దేవుని రాజ్యములో ప్రజలు చేరుచున్నారు.

**పులిసిన పిండినిగూర్చి ఉపమానము:-**

మత్తయి 13వ అధ్యాయము. పులిసిన పిండి అనగా తప్పుడు బోధ అని అర్ధము. 1) పరిసయ్యుల పులిసిన పిండి అనగా జీవము, శక్తిలేని మతాచారములు. 2) సద్దూకయ్యుల పులిసిన పిండి అనగా పునరుత్థానముగాని, దేవదూతలుగాని, ఉన్నట్టు నమ్మని బోధ. 3) హేరోదీయుల పులిసినపిండి అనగా లోకమును, మనమును కలిసియుండవలెను అను మిశ్రమబోధ. ఈ మూడు రకములైన బోధలు సంఘముల మతోద్ధారణ కాలములో ప్రవేశించినవి. అంతకుముందునుండి ఇవి ఉన్నప్పటికిని, ఇప్పుడు సంఘాభివృద్ధినిబట్టి బైలుపడినవి. మతోద్ధారణ కాలమందు బైబిలు వెల్లడిలోనికి వచ్చినందున సంఘమంతయు పూర్తిగా, దిద్దుబాటులోనికి రావలసినదేగాని శాఖలైపోయినది. ముఖ్యమైన శాఖలు (1) రోమన్ కేథలిక్ సంఘము (2) గ్రీకు కేథలిక్ సంఘము (3) ప్రొటస్టంట్ సంఘము. మూడు కుంచముల మంచిపిండి అనగా ఇదే. అసలు పిండి మంచిదేగాని ప్రవేశించినది పులిసిన పిండి. ఈ మూడు శాఖలు ఎప్పటికైనను ఒక సంఘముగా కాగలవు? నూతన సంవత్సరము వచ్చుచున్న కొలది నూతనమైన శాఖలు కూడా వచ్చుచున్నవి. భిన్నమైన బోధలనుబట్టి సంఘము ఇప్పటికి ఎన్నో మిషనులైనది. మంచిపిండిలో పులిసిన పిండి కలిసిపోగా

విడదీయువీలుండునా? వీలుండదు. పిండి తెచ్చినది ఒక స్త్రీయైయున్నది. నిజమైన విశ్వాసులయొక్క గుంపునకు పెండ్లికుమార్తె అని పేరు. దుర్బోధకుల గుంపునకుకూడ స్త్రీ అని పేరు, అనగా చెడ్డ స్త్రీ, పులిసిన పిండి అనగా దాచి పెట్టబడినది అనగా ఏమి? 'ఇది తప్పు బోధ' అని తెలియకుండా మంచి పిండిలో *దాగియుండునదే పులిసిన పిండి.* ఎవరిమట్టుకు వారే మాది మంచిబోధ అందురు. ఫలానివారిది దుర్బోధ అనికూడా అందురు. ఇట్టివారే తీర్పరులు గనుక ఈ గురుగులు అంతమువరకు ఉండును. అట్లే పులిసిన పిండి అంతమువరకు ఉండును. ప్రభువుయొక్క ప్రత్యక్షతలవల్లనే, మంచిచెడ్డలు బైలుపడును. ఇపుడే అన్ని మిషనులవారు ప్రభువును అడిగినయెడల ఆయన సత్యమును వినిపించును గాని అట్లు సంఘములు అడుగునా? అడగవు. బైబిలులో ఉన్నది గనుక అడుగుట ఎందుకని కొందరు అనుచున్నారు. బైబిలు వాక్యముల అర్థమును మనము బోధకులను అడుగుటలేదా? అట్లే ప్రభువునెందుకు అడుగకూడదు!!!

**దాచబడిన ధనము:-** అనగానేమి? ఆదాము మొదలు అబ్రాహాము వరకు అనేక వందల సంవత్సరములు గడిచిపోయెను. అప్పటివరకు దాచబడిన యూదుల జనాంగము బైలుపడినది. వారినుండి లోకరక్షకుడు జన్మించెను. ఇశ్రాయేలీయులయొక్క 10గోత్రములు చెరలోకి వెళ్ళి నేటివరకు తిరిగిరాలేదు. వారందరు దాచబడిన వారే. వారు ఎప్పుడు బడితే అప్పుడే వస్తారు. యూదుల జనాంగము దేవునికి మిక్కిలి ప్రియమైనవారు. వారాయనయొక్క ధనము. మరియు క్రీస్తు ప్రభువు వచ్చినపుడు ఆయనను వారు అంగీకరించలేదు. అందుచేతవారు ఆయా జనాంగములలోకి వారు

చెదరగొట్టబడియున్నారు. గనుక భిన్న దేశములలో దాచబడి యుందురు. తుదకు యూదుల జనాంగము 7ఏండ్ల పరిపాలనలో ఆయన తట్టు తిరుగుదురు. అప్పుడు దాచబడిన ధనము దొరికినట్టుగా ఉండునుగదా! ఉపమానములో ధనమును కనుగొన్నట్టు ఉన్నది. దీని అర్థమేమి? యూదుల జనాంగమునకు మూల పురుషుడు అబ్రాహాము అన్య జనాంగము వృద్ధిపొందుచుండగా, ఒక జనములో అబ్రాహాము దేవునికి కనబడెను. గనుక ఆయనలోనుంచి యూదుల జనాంగము పూర్తిగా వచ్చువరకు దేవుడు కనిపెట్టెను. అబ్రాహాము కొరకు దేవుడు ప్రత్యేకముగా పనికట్టుకొని వెతుకలేదు. రాష్ట్రములు పెరుగుచుండగా తుదకు అబ్రాహాము దేవునికి దొరికెను. దేవుడు తక్కినవారిని విడిచిపెట్టి అబ్రాహామును పట్టుకొనెను. అబ్రాహాములోనుంచి యూదులు బైలుదేరిరి. ఉపమానములోనున్నట్లు ధనము దొరకగా కలిగే సంతోషము, దేవునికి కలిగెను. యూదులలోనే పితామహులు, బోధకులు, రాజులు, ప్రవక్తలు లేచినారు. తుదకు అపోస్తలులుకూడా లేచినారు. యూదులయొక్క రాష్ట్రము నిమిత్తమై తుదకు యేసు ప్రభువు మరణము పొందెను. 'తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమునుకొనెను' అని వ్రాయబడినమాటలో ఈ సంగతి ఉన్నది. తనకు కలిగినది అనగా ప్రభువుయొక్క స్వకీయరక్తము; అమ్మెను అనగా ధారపోసెను గనుక కొనెను. అనగా ఇశ్రాయేలు జనులు ఎంత దేవుని వల్ల సృజింపబడిన వారైననూ తమయొక్క పాపజీవితమువల్ల సాతానుకు అమ్ముడైపోయినారు. కాబట్టి దేవుని ప్రజలు సాతాను చేతిలోకి వెళ్లిపోయినారు. మన సరుకు ఒకరిచేతిలో ఉన్నపుడు ఎట్లు విడిపించుకొందుము! కొంత సొమ్ము ఇచ్చి విడిపించుకొందుముగదా! దానికొరకు నష్టమైనను సరే, సరుకుపోగొట్టుకొనము. మనము దేవుని సరుకై

యున్నాము, గాని పాపమునుబట్టి సైతాను సరుకైపోయినాము. మనలను విడిపించుటకు భూలోకములో ఏ వస్తువైనను, ఎంత సొమ్మైనను చాలదు. క్రీస్తు రక్తము చాలును. 'ఆ రక్తముతో సర్వలోకమును ఆయన కొన్నాడు' అనుమాట ఎంత నిజమో, యూదులనుకూడా కొన్నాడు అనేది అంత నిజము. ఒకనాడు యూదులలో ప్రముఖునికి దేవుడు ఏమి చెప్పినాడని శ్రమచరిత్రలో యున్నది? 'ఈ రాష్ట్రముకొరకు ఒకడు చనిపోవుట మేలే'అని చెప్పినాడు. ఉపమానములో పొలమునుకొనెను అని వ్రాయబడియున్నది. పొలము అనగా లోకము. ఆయన లోకమునుకొనెను. ఒకరైతు ఒక పొలమును కొన్నపుడు ఆ పొలములోని చెట్లుకూడా రైతువేకదా? అలాగే లోకమును కొన్న యేసుప్రభువునకు లోకములోని జనులందరు ఆయనయొక్క జనముకదా? లోకనివాసులైన ఆయన ప్రజలను క్రీస్తుప్రభువు రక్తక్రయధనమిచ్చి కొన్న చరిత్ర విషయము, మొదట యూదుల చరిత్రలో కనబడుచున్నది. తరువాత బైబిలు చరిత్రలో చదివిచూడగా లోకమంతటిని కొన్నట్టున్నది. దేవుని పనులు, కాలక్రమేణ ప్రత్యక్షమగును. యూదులు దేవునియొక్క ప్రత్యేకజనముగా ఏర్పరచబడియున్నారు అని ఈ ఉపమానములో కనబడుచున్నది. అది మనుష్యులకు అర్ధముకాదు. అందుచేతనే యేసుప్రభువు ఈ ఉపమానమును ఇంటిలో ఉన్నప్పుడు శిష్యులకు మాత్రమే వినిపించెను.

ఆయన అంతరంగములోని ప్రత్యేక మర్మములు అందుకొనునట్లుగా, పెండ్లికుమారుడైన క్రీస్తుప్రభువు నేటి దినమున మిమ్మును తీర్చి దిద్దునుగాక. ఆమేన్.[1]

---

1. 22.8.43వ సం॥లో దేవదాసు అయ్యగారు రాజమండ్రిలో చేసిన ప్రసంగము.

# 13. బైలుపర్చబడిన బైబిలు మిషను

## యెషయా 43:18-19.

బై బై అనగా **బైలుపడిన బైబిలుమిషను.** బై బై అనగా ఇంగ్లీషులో కాలక్రమేణ అని అర్థము. బైబై అనగా ఆదాము మొదలుకొని 1937వరకు బైలుపడలేదు గాని కాలక్రమేణ అంతరంగముగా వస్తూ, అనగా దైవమతము ద్వారా వస్తూ, అనగా యూదా మతముద్వారా వస్తూ, అనగా క్రైస్తవమత సంఘముద్వారా వస్తూ, అనగా క్రైస్తవ మిషనుల ద్వారా వస్తూ, తుదకు 1937వరకు వచ్చి 38లో బైలుపడినది. అపుడు- 'మేము ఉండగా ఇదెందుకు వచ్చినది?' అని అందరికి వెర్రిబుట్టింది. బైలుపడే ఈ పని బయలుపడుతున్నది. బైబై అనగా కాలక్రమేణ అపోస్తలుల కాలములో ఉన్నదిగాని బైలుపడలేదు. 1937లో ఉన్నదిగాని బైలుపడలేదు. 1938లో బైలుపడినది. ఇది స్థాపించబడిన మిషనుకాదు. **బైలుపడిన మిషను.** బైలుపడినది అనేమాట వినగానే అదివరకు ఉన్నది అని అర్థము వచ్చునుగదా? అదివరకు ఉన్నవాటికి బేధముగా కనబడినది వస్తే, అదివరకున్న వాటికి కష్టముగా ఉండి, అనేక వ్యతిరేక కల్పనలు లేచును కదా! ఇది లోకచరిత్రలో ఉన్నది. అన్నిటిలో తేడా ఉన్నట్టు, బైబిలు మిషనులో కూడా తేడా ఉన్నది. మొదటి తేడా బైబిలు మిషను అనుపేరు. రెండవ తేడా దేవుడు బయలుపరచినాడు అనే తేడా. మూడవది గాలిలో వ్రాసి చూపించినాడు అనే తేడా నాలుగవ తేడా ఇన్ని దేశములు ఉండగా, ఇండియాలోనే దేవుడు ఎందుకు బయలు పరచెను అనే తేడా. ఐదవ తేడా ఇన్ని గొప్ప పట్టణములుండగా ఒక రాజమండ్రిలోనే ఎందుకు బైలుపరచెను అనే తేడా. ఆరవ తేడా

ఇంతమంది పరమ భక్తులుండగా ఒక వ్యక్తికే ఎందుకు బయలుపరచబడినది! ఈ ప్రశ్నలవల్ల కలత, కలత, కలత, కలత కలుగుచున్నది. మా మిషను దేవుడు వ్రాసి చూపిన మిషను, మా మిషను, మా మతము దేవుడు గాలిలో వ్రాసి చూపినవే అని ఎవరైనా ధైర్యముగా ప్రమాణము చేయగలరా? మేము చేయగలము. ఎట్లనగా పరలోక పరిశుద్ధులే ఋజువుపర్చుచున్నారని ప్రమాణ పూర్వకముగా చెప్పగలము. రాజమండ్రిలో, భీమవరంలో చాలాకాలము పనిచేసిన రెవ. డా॥ హెచ్. సి. స్మిత్ దొరగారు ఈ మధ్య మా మీటింగు సమయములో దర్శనములోనికి వచ్చి ఈ మాటలు చెప్పిరి. 'భూలోకములో దేవదాసు గారు నా జతపనివారు. అయితే ఇపుడు పరలోకములో ఆయన మాకందరికి అధికారి అయినారు. మేము ఆయనచేతి క్రింద పనివారముగా ఉన్నాము.

షరా:- ఈ దొరగారు నాయెడల ప్రేమయు, గౌరవమును గలవాడు. నేను 5వ తగరతి చదువుచున్నపుడు నాకు ఒక ఇంగ్లీషు ప్రసంగము సభలో చదువుటకు ఇచ్చినాడు (ఇది నిజమోకాదో దేవునిని అడిగి తెలిసికొనండి). 1. ఏ మతములోనికి వెళ్ళిచూచినా, ఏ మిషనులోనికి వెళ్ళిచూచినా, సజ్జనులతోపాటు భక్తిహీనులుకూడా ఉన్నారు. అట్లే మంచి ఆచారములతోపాటు దురాచారములుకూడా ఉన్నవి. తేడా సిద్ధాంతములుకూడా ఉన్నవి. సిద్ధాంత కలహములు కూడా ఉన్నవి. మంచిగ్రంథములతోపాటు చదువకూడని గ్రంథములున్నవి. మంచి కీర్తనలతోపాటు వ్రాసిన పద్యములు, కీర్తనలుకూడా (అనగా అలంకార, ఛందస్సు నియమములు పాటించకుండా వ్రాసినవి) ఉన్నవి. ఎక్కడికి వెళ్ళినా మంచితోపాటు చెడుగుకూడా ఉన్నది. భక్తులలో సహితము బలహీనతలు

కనబడుచున్నవి. విమర్శలు ఎక్కువగా ఉన్నవి. అనగా తప్పులు పట్టుట, ఖండనలు. ఇట్టి తేడాలు ఉంటే దేవుడు బైలుపరచినాడు అని చెప్పగలమా! చెప్పలేము. మనుష్యులు తమయొక్క జ్ఞానమును బట్టి కల్పించుకొనియున్నారని నిశ్చయముగా చెప్పగలము. అయినను దేవుడు అన్నిటిని తన మహిమకొరకు వాడుకొనుచున్నారు. ఎందుకనగా స్వాతంత్ర్యము ఇచ్చినాడు.

అందుచేతనే దేవుడు బైబిలు మిషనును బైలుపరచినాడు. అయితే అన్ని సంఘములలో ఉన్న చెడుగు బైబిలు మిషనులో ఉండకూడదు. కాని అన్నిటిలో ఉన్నవి ఇందులోకూడా ఉన్నవి. ఎందుకనగా బైబిలుమిషనులోనికి వచ్చినవారు అటువంటి మిషనులలోనుండి, సంఘములలోనుండి వచ్చినవారే. అయినప్పటికిని నేను ఈ మిషనును విడిచిపెట్టను. ఎన్ని బాధలు, కష్టములు, వ్యాధులు, పేదరికము, అవస్థలు, అవమానములు, బాధలు ఉన్నప్పటికిని నేను ఈ తండ్రి మిషనును విడిచిపెట్టను. ఇతర మిషనుల తట్టు నేను చూడను. తల్లిదండ్రులలో లోపములు ఉన్నప్పటికిని తల్లిదండ్రులను పిల్లలు విడిచిపెట్టుదురా? అలాగే ఈ క్రొత్త తల్లిదండ్రుల సంఘములో, అనగా కుటుంబములో నాకు సరిపడని విషయములు ఉన్నప్పటికిని నేను విడిచిపెట్టను. ఎందుకంటే ఆ చెత్తవైపు నేను చూడక, దేవుడు బైలుపరచినాడు అను ఒక్క విషయము తట్టు చూస్తూ ఇందులో స్థిరముగా నిలువబడియుందును. ఎందులోనికి వెళ్ళినా చిక్కులే. అయితే ఇందులోకూడ చిక్కులు ఉన్నను, దేవుడు బైలు పరచినాడను విషయమును పరలోక వాస్తవ్యులు వర్తమానములు తెచ్చుచున్నారను విషయమును, దేవుడు కనబడి మాటలాడుచు ప్రశ్నలకు జవాబులు

చెప్పుచున్నాడను విషయములును ఉన్నవి గనుక నేను బైబిలుమిషనును విడిచిపెట్టను. (ఎవరైనా మీ తల్లి మిషనులోనికి వచ్చివేయండి అని అంటే 'తండ్రి మిషనులోనికి వచ్చివేసినాము' ఇది తప్పా అని అడగండి. తల్లి మిషను అనునది ఈ లోకమునకే అయితే తండ్రి మిషను అనునది ఉభయ లోకములకు సరిపోవును. తండ్రి అనగా తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అనే త్రియేక దేవుడగు తండ్రి. తండ్రివల్లనేకదా తల్లి వచ్చినది!). అన్నియు, సరిగానుండ వచ్చునుగాని మిషను అనేది బైబిలులో ఉన్నదా? అని అడుగుదురు.

జవాబు:- మిషను అనగా పని అని అర్థము. బైబిలు మిషను 'పని'చేయుచున్నది. కాబట్టి ఈ పేరు తగును. మమ్మును ఈ ప్రశ్న అడుగువారు తక్కిన 850 మిషనులను ఎందుకు అడుగరు. మొదట మీరు లేచి, అన్ని మిషనులను ఒక సంఘముగా కలిపివేసి, పెంతెకొస్తు దినమున స్థాపితమైన క్రైస్తవమత ఏకసంఘముగా కలిపివేసికొని, అప్పుడు మాయొద్దకు వచ్చి అయ్యాలారా! అమ్మలారా! మీ మిషనునుకూడా ఇందులో చేర్చండి! అని అనగలిగితే ఎంతో బాగుండును. ఆ పని చేయకుండా మా మీద ప్రశ్నవేయుట అధర్మశాస్త్రీయము. క్రైస్తవ మతము 850 శాఖలుగా చీలిపోక అట్లే ఉన్నయెడల బైబిలు మిషను బైలుపడక, ఆదిసంఘమే, 'బైబిలు మిషను' అని అనిపించుకొనును. (ఇది ఒకరి అభిప్రాయము). అన్ని మిషనులలోను సన్నిధి కూటములు పెట్టండి అని అయ్యగారు పేపరులలో వేసి పంపగా, అది చదువుకొని బైబిలు**'మిషను'**లోనికి లాగడానికి ఇది ఒక ఎత్తు అన్నారు. దానికి అయ్యగారి *జవాబు:-* అవును బైబిలుమిషనులోనికి అందరిని లాగవలసిన పని మాదే.

ఇది మా వృత్తి. మా వృత్తి చేయకపోతే బైబిలుమిషనెందుకు! భూదిగంతములవరకు చాటించుటయే మా బైబిలుమిషను పని, నా పని ఈ పని అప్పుడే అయ్యిందా అని అయ్యగారంటున్నారు) మీరు ఎన్ని ఎత్తులెత్తకపోతే ఇన్ని మిషనులు పెడతారు! అని జవాబు చెప్పవలెను. ఎన్ని ఎత్తులు ఎత్తకపోతే మీరు మీ మిషను స్థాపించుకున్నారు అని జవాబు చెప్పవలెను. అసలు చీలికగా ఉన్న మిషనులోనుంచి కొంతమంది వేరైపోయి, మిషను అనుమాట మాత్రము తీసివేసి, గ్రూప్ గ్రూప్ అనిపేర్లు పెట్టుకొన్నారు. గ్రూప్ అనుమాట పెట్టుకొనమని బైబిలులో ఎక్కడుంది? అని అడగండి. పేరులేని క్రైస్తవమతములలో ఏ పేరుపెట్టుకొన్నా శాఖ మతమే. ఇది ప్లీడరు లాజిక్ (న్యాయవాదుల తర్కము) గనుక. హిందువులుకూడా, బౌద్ధులుకూడ ఫెలోషిప్ అనుపేరుపెట్టుకోవచ్చు గాని క్రైస్తవ సంఘమంటే అసలు మతమే. క్రొత్తగా దేవుడు బైలుపరచిన మిషను అని అంటున్నారు గనుక అనేకమైన ప్లీడరు ప్రశ్నలువేసి పునాదులతోపాటు ఈ మిషను పెల్లగించవలెనని కొందరి అభిప్రాయము. రాజుల మతమంటే రాజులకే. క్రైస్తవ మతమంటే అందరికి అని బోధపడుతుంది అలాగైతే, అదే నిజమైతే మన దేశంలో ఇంకా కులం పోలేదు. క్రైస్తవ మతము కులం వద్దంటే మరలా కులం తెచ్చిపెట్టుకొనుట ఎందుకు? గవర్నమెంటువారీమధ్య కులం వద్దన్నారు. ప్రత్యేకముగా ఒక కులమునకు సంబంధించి మిషను స్థాపిస్తే,దానివల్ల మనము కులము తెచ్చిపెట్టినట్టు అగును. ప్రభుత్వము వారు సహితము కులము తీసివేయవలెను అని అంటున్నారు. క్రైస్తవులమైన మనము అంతకుముందునుంచే అనుచున్నాము. ఇపుడు మరలా ఎందుకు తీసికొని రావలెను అని జవాబు చెప్పండి.

'క్రీస్తు విభజింపబడి ఉన్నాడా?' అని క్రైస్తవ మత శాఖలను ఆక్షేపించుచు పౌలు వ్రాసినాడు. ఎందుకనగా కొందరు, మేము పౌలువారము అనియు, మరికొందరు 'మేము పేతురువారము' అనియు చెప్పుకొనుచున్నందున. గుంటూరు బైబిలుమిషనులోనికి రాకపోయినవారు తమ స్థలములోనే ఉండి గుంటూరు బైబిలు మిషనులో దేవుడు చెప్పుచున్న వార్తలు అన్నింటి ప్రకారము ఒక మిషను స్థాపించి, దానికి 'బైబిలు మిషను' అని పేరు పెట్టుకొని, మన సిద్ధాంతములు, ఆచారములు, సందేశములు, సన్నిధి కూటములు, అంతరంగ సంస్కార భోజనము ఈ మొ॥వి అనుసరించిన యెడల, వారుకూడా మన బైబిలు మిషనువారే. కాబట్టి వారు రాకడలో ఎత్తబడుదురు.

అమెరికా వారు మన మిషను పేరుమీద "బైబిలుమిషను అమెరికా" అని స్థాపించుకొంటే అది మనకు బలము. ఆలాగున అన్ని దేశములలో బైబిలుమిషను స్థాపించవలెను అనేకదా! మన ఉద్దేశ్యము. అందుచేతనే మన పత్రికలలో వ్రాసి పంపుచున్నాము కదా? "ఎన్నివేల బైబిలు మిషనులు ఉన్నను ఫర్వాలేదు. కాని కొంచెమైనా, తేడాగా ఉంటే అదే 'శాఖ'. ఉదా:- "అమెరికా బైబిలు మిషనును" అని గనుక ఉంటే, అది అసలైన బైబిలు మిషను కాదు. దానికి మనము పూచీ దారులము కాము. హృదయము చూచువాడు దేవుడే. తీర్పరి తానే. ***దేవుని- "బైబిలుమిషను" అపరిమితమైనది, విశ్వవ్యాప్తమైనది.*** అందుకే "ఇండియా బైబిలు మిషను పోయి అసలైన "బైబిలుమిషను" వచ్చినది. అట్టి బైబిలు మిషనులో, మీరు ఎక్కడివారైననూ, ఎట్టివారైనను త్రియేక దేవుడు మిమ్మును చేర్చునుగాక. ఆమేన్. [1]

---

**1. 6.12.1959వ సం॥లో దేవదాసు అయ్యగారు సాయంత్రం బేతేలు గృహములో చేసిన ప్రసంగము.**

## 14. బైబిలుమిషను భావికాల ఉపన్యాసములు

### యెషయా 40:5-10.

సువార్త ప్రకటించుటకు సువిశేషాసక్తిగల సత్ర్కైస్తవులారా! బైలుపరచబడిన మిషనువార్తను సర్వ సువార్త సాధనములద్వారా, సృష్టి అంతటికీ వెల్లడిచేయ సత్కృపాశీర్వాదములు సర్వకృపానిధియగు తండ్రి మీకు దయచేయునుగాక. ఆమేన్.

**1. విశాల సువార్త ప్రకటన:-** అనగా అన్ని కాలములలో, అన్ని భాషలలో, అన్ని దేశములలో, అన్ని మతములలో; అనగా ప్రభువు చెప్పినట్లు సృష్టి అంతటిలో, లోకమంతటిలో భూదిగంతముల వరకు ప్రకటింపబడేది విశాల సువార్త ప్రకటన. ఉదా- అపోస్తలుల కార్యముల గ్రంథము.

**2. బలవంత సువార్త ప్రకటన:-** అనగా క్రైస్తవమతము లోనికి ఎవరిని బలవంతముగా లాగుకొని రాకూడదు. మేము చెప్పినాము ఎవరి ఇష్టము వారిది. అయితే, ప్రభువు చెప్పిన ఉపమానములోని 'బలవంతము' అనేమాట మనకు ఆధారము. దాని అంతరార్థమేమనగా క్రైస్తవులనుగా చేయుటకై నీకెన్ని ఉపాయములు, పద్ధతులు, సాధనములుగలవో అవి అన్నీ వాడవలెను. అప్పుడు ప్రపంచములోని జనులందరి చెవులకు సువార్త గింగురుమని వినబడును. చెవులు మూసికొన్నను వినబడేటట్టు గట్టిగా చెప్పవలెను. భయముకలిగే ప్రసంగములుకూడ చేయవలెను. బాబో నాయనో అనే ప్రసంగము చేయవలెను.

**3. మినహాయింపు సువార్త ప్రకటన:-** లూకా. 13:6-9; 2రాజులు 518-19; నిర్గమ. 120,21; రిమ్మోను గుడిలో విగ్రహారాధన చేసిన మనిషి, మోషేకాలములో ఇశ్రాయేలీయులకు మేలుచేసిన

మంత్రసానులు, చెట్టుకొట్టి వేయకుండా 1సం॥ వాయిదా వేయించిన తోటమాలి; ఈ దృషాంతములన్నీ మినహాయింపు సువార్త ప్రకటన క్రిందకు వచ్చును. అనగా వారు కోరినట్లు వారికి మినహాయింపు ఇచ్చి, వారిని విశ్వాసమును క్రీస్తునందు స్థిరపర్చుట.

**4. అభిమాన సంఘమును ఏర్పరచి సువార్త ప్రకటన:-** లూకా. 9:49-50. మన పక్షముననున్నవాడు మనవిరోధికాడు అని ప్రభువు పలికినమాట అభిమాన సువార్త ప్రకటనను తెలియజేస్తుంది. ఈలాగున మనమంటే అభిమానముగలవారిని ఏర్పరచి, వారిద్వారా సువార్త ప్రకటించుటకు, సువార్తను వ్యాపింపచేయుటకును ప్రయత్నించవలెను.

**5. నిశ్శబ్ధ సువార్త ప్రకటన:-** ఎవరికి వినబడకుండా, మనము ఆ పని చేయుచున్నామని ఒక్కరికైనా అనగా తెలియకుండగా చేసేపని, అనగా కఠినాత్ముల మనస్సు కరిగించేపని, అదే నిశ్శబ్ద సువార్త ప్రకటన. ఉదా:- కార్డుమీద సువార్త ప్రకటన; అతికించే చిన్ని కాగితముల ద్వారా సువార్త ప్రకటన. మత్తయి 27:11. మరొక ఉదా:- ప్రార్ధనాద్వారా నిశ్శబ్ద ప్రసంగము. మౌనికమ్మగారు తలుపువేసి ప్రార్థించగా కుమారునికి పాదిరిగారికి ఏమి తెలియును! ఆ తర్వాత కాలంలో తన తల్లి ప్రార్థనలే ఆయన గొప్పగా దేవుని పరిచర్య చేయడానికి మూలకారణమని తెల్సుకొన్నాడు. ఈలాగు శపించబడిన ఆఫ్రికానుండి గొప్ప గ్రంథకర్త, పరమభక్తుడైన సెయింట్ అగస్టీన్‌ను దేవుడు లేపెను. కనాను శపింపబడునుగాక అని వ్రాయబడినట్లు, వీరంతా, హాము సంతతివారైయున్నారు.

**6. ఉత్తరములద్వారా ప్రకటింపబడే ఉత్తరముల సువార్త:-** మనకు తెలిసిన వారికి ఉత్తరములు వ్రాయునపుడు, ప్రభువు నామమును ఉద్ధరించుట, కొన్ని ఆశీర్వచనములు, శుభములు

తెలియజేయుటద్వారా పరోక్షముగా కొన్ని సువార్త సత్యములను తెలియజేసినవారమౌదుము.

**7. ముందుగా అడిగావు సువార్త ప్రకటన:-** "ప్రభువా! ఫలాని వ్యక్తిని మార్చివేసినావు స్తోత్రం. నాకు తెలియదు గాని ఒక దినమునకు అతనిని నీవు బాగుచేసినావు. అతను మారిపోయినాడు. గనుక నాకు ఎందుకులే ప్రభువా, విచారము!" అని ముందుగా విశ్వసించుట. ఇది అందరు చేయలేరు. ఈలాగు ఒకరోజు అంతా ప్రార్థించి, రెండవ రోజు అంతా స్తుతించుట.

**8. అన్వయ వచన సువార్త ప్రకటన:-** యాకోబు అన్నగారిని మోసముచేసి వెళ్లుచున్నాడు. ఆ యాకోబును దేవుడు రాతివద్ద, నూతివద్ద దీవించెను. ఏశావు తండ్రి చెప్పినట్లు చేసెను గాని ఆశీర్వాదములు దొంగిలింపబడినందుకు కేకవేసెను, దుఃఖించెను గాని దేవుడు యాకోబును దీవించెను. (అతడు పాపము చేసినను నీవు దీవించినావు, నేను పాపిని నన్ను దీవించుము. యాకోబు ఒక్కడేనా నీకు మూల చుట్టము! ఇట్లు ఎదిరించి అడుగుచున్నందున మరీ పాపినిగామారినా; అయినను యాకోబును దీవించిన నీవు నన్నును దీవించుము అని వాక్యమును అన్వయించుకొని సువార్త ప్రకటనకు దారి చేసికొనవలెను.

ఏశావుకు చిన్న దీవెన:- యాకోబు కాడి నీమీద పడును. నీవు విరగదీయుదువు. ఎదోమీయులు ఇశ్రాయేలీయులను కొంతకాలము ఏలిరి. ఎదోమీయులే గెలిచిరి (అదే ఏశావుయొక్క దీవెన నెరవేర్పు).

**9. నిద్ర సువార్త ప్రకటన:-** ఒకరు ఒక అంశముమీద ఉపవాస ప్రార్థన చేయునపుడు మూర్ఛిల్లి, అలసి పడిపోవుదురు.

అపుడు నిద్రలో ఉందురు. ఆ నిద్రలో కూడా ప్రార్థన ఉంటుంది. దేవుడు అది ఆలకించి కఠినాత్ములను మార్చివేయును.

**10. ప్రవచన సువార్త ప్రకటన:–** ఒక క్రొత్త వ్యక్తి మార్పు చెందుటకు అతనిగూర్చి ఆత్మ అందించుటద్వారా ప్రవచనము చెప్పుట. జరుగబోవునవి తెలియజేయుటద్వారా కూడ ఇతరులను మనము క్రీస్తు తట్టుకు ఆకర్షించగలము. ఉదా:– యోహాను 4:49–53; 'నీవు వెళ్లుము. నీ కుమారుడు బ్రతికియున్నాడు.' అపో.కార్య. 5:1–9. అననీయ సప్పీరాలతో పేతురు చెప్పిన మాట మత్తయి 15:28 'నీ కుమార్తె దయ్యము వదలినది.' ప్రసంగించిన వాడు, తన్ను నిందించిన వానితో 'నీకు కీడు' అంటే ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళిపోగా జ్వరము వచ్చును. తుదకు అతను మారిపోవును.

**11. భాషా సువార్త ప్రకటన:–** మనము కఠినాత్మునిగూర్చి ప్రార్థించినప్పుడు భాషవల్ల అతడు మారినది, మారనిది జవాబు వచ్చును. పరిశుద్ధాత్మ తండ్రి అందించే భాషవల్ల దయ్యములు పోవును.

ఈలాగున మన జ్ఞానమునకు అందినన్ని సాధనములు, మనస్సాక్షికి తోచినన్ని విధములుగా కక్షచేతనైనను అందరినీ సువార్తవలలో చేర్చుటకు, ఒడుపుగా, నేర్పుగా సువార్తను ఆత్మ తండ్రి సహాయుతో అందించవలెను.

అట్టి సువార్త ప్రకటన ధన్యత పరిశుద్ధాత్ముడు తన సాక్ష్యశక్తినిచ్చుటద్వారా మనకు దయచేయునుగాక. ఆమేన్.[1]

1. 23.8.1955వ సం॥లో దేవదాసు అయ్యగారు బేతేలు గృహములో చేసిన ప్రసంగము.

Bible Mission HQ Guntur

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | | | పేజి నం |
|---|---|---|---|
| 1. | జాదలనాస | - | 1 |
| 2. | శక్తికిమించిన శక్తి - ప్రార్థనాశక్తి | - | 6 |
| 3. | గురిపెట్టి ప్రార్థించుట | - | 11 |
| 4. | సంపూర్ణ ఉపవాస అభ్యాసము | - | 22 |
| 5. | పరిశుద్ధాత్మను అందుకొనువాలు | - | 27 |
| 6. | తైలాభిషేకము - ఆత్మాభిషేకము | - | 31 |
| 7. | ఈకాబోదు | - | 36 |
| 8. | కానుకల పండుగలోని కానుకలు | - | 41 |
| 9. | కానుకల పండుగలోని ఆనందము | - | 45 |
| 10. | రూపాంతర దర్శన వివరము | - | 50 |
| 11. | క్రీస్తుప్రభువు రాకడలు | - | 57 |
| 12. | పరలోకరాజ్య మర్మములు | - | 62 |
| 13. | బైలుపర్చబడిన బైబిలుమిషను | - | 74 |
| 14. | బైబిలుమిషను భావికాల ఉపన్యాసములు | - | 80 |


Bible Mission HQ Guntur

# జ్ఞాతవ్యము

## (రెండవ భాగము)

గ్రంథకర్త:

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2025 చందా : 15.00

Bible Mission HQ Guntur

గుంటూరు నందు:

| | | | |
|---|---|---|---|
| మొదటి | ముద్రణ 2006 | ప్రతులు | 5000 |
| రెండవ | ముద్రణ 2017 | ప్రతులు | 2000 |
| మూడవ | ముద్రణ 2024 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ 2025 | ప్రతులు | 1000 |


ఇది దేవుడు యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

**బైబిలు మిషను ప్రెస్ - పెదకాకాని, 522 509.**

**ఫోన్ : 9949121777.**

Bible Mission HQ Guntur